నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 10-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 157 | పేజీలు: 6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

సమతాసౌధం
ఊహకు అందనిది
ఎదురు చూపు.

కాకులగుంపు
నల్ల తెల్ల కాకులు
అస్తిత్వ పోరు.

మంత్రి మారిండు
రద్దులపద్దుషురూ
చరిత్ర కోసం.

బడాబాబులు
దొరికితే దొంగలు
దేశరత్నాలు.

అంతా వ్యాపారం
అక్షరాలకందవు
చింతనచితి

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

గాఢ నిదురపోయె మధుర
గాన హరివిల్లుల తోట !
లతా మంగేష్కర్ , పసిడి
పాటల కోకిలల కోట !

ఊరిపారి ఇంకిపోయె
కళ్ళనీళ్ళు దిండుల్లో !
'నిదుర పోరా తమ్ముడా'
తెలుగు వారి గుండెల్లో !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

తెలంగాణ అభివృద్ధిపై మోదీకి ఈర్ష్య, ద్వేషం : మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 9: ప్రధాని మోదీకి తెలంగాణ అభివృద్ధిపై ఈర్ష్య, ద్వేషం, అసూయ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. రాజ్యసభలో తెలంగాణ పట్ల ప్రధాని మోదీ వ్యాఖ్యలపై నిరసనగా.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరుగనపడేసి.. దేశాన్ని మోనార్క్‌లా ఏలాలని మోదీ అనుకుంటున్నాడని విమర్శించారు. దేశంలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాక అనివార్య పరిస్థితుల్లో అందరికన్నా ఆఖరుకు సమ్మతించి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజా పోరాటానికి తలొగ్గి విధిలేక 2014 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ఇవ్వదనుకొని.. బీజేపీ తర్వాత ఎలాగైనా దాటవేయొచ్చని.. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో తెలంగాణ ఇస్తామన్నారు.

కానీ తెలంగాణ ప్రజల అదృష్టం, కేసీఆర్ నాయకత్వంలో పెరిగిన ఒత్తిడి, ఆమరణ నిరాహార దీక్ష, వందలాది మంది తెలంగాణ బిడ్డల బలిదానాలు.. అన్నీ వెరసి తెలంగాణ సమాజం గిరిగీసి నిలబడడంతో ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకుంటే రాజకీయ భవిష్యత్ ఉండదనే పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదించారన్నారు. రాష్ట్ర విభజనకు ముందు అన్ని రకాలుగా చర్చలు జరిగాయన్నారు. పార్లమెంట్‌లో, అఖిలపక్షాల భేటీలో, జేఏసీలో, శ్రీకృష్ణ కమిటీ పర్యటనలో చర్చలు జరిగాయని, ఇవన్నీ అయ్యాక పార్లమెంట్‌లో ప్రత్యేక తెలంగాణ బిల్లు పాసైందని గుర్తు చేశారు.

ఇవన్నీ జరిగాక వచ్చిన బిల్లును మోదీ అవమానించి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారన్నారు. ఇది దేశానికి మంచిది కాదన్నారు. తెలంగాణ ఏర్పాటై ఎనిమిళ్లయి అద్భుతంగా అభివృద్ధిలో పురోగమిస్తున్నామని, దేశంలో అనేక రంగాల్లో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ నంబర్ వన్ స్థానానికి ఎగబాకిందన్నారు. మోదీ రాచరికపు, ఆలోచనా విధానానికి గండి కొట్టే సాహసం చేస్తున్నదని ఒక్క కేసీఆర్ అని, అందుకే తెలంగాణ మీద కసిబూని మాట్లాడుతూ పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే గొప్పవారని, దాన్ని మరిచిన పాలకులు ప్రజల పాదాల కింద ధూళిలో కలిసిపోతారన్నారు.

వ్యవసాయ బిల్లులను ఎలా ఆమోదించారు మోదీ జీ..?

హైదరాబాద్, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖల మంత్రి హరీశ్‌రావు తప్పుబట్టారు. బీజేపీకి పూర్తి మెజార్టీ లేకపోయినా వ్యవసాయ బిల్లులను ఆమోదించుకున్నారు. కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు, బీజేపీ మిత్ర పక్షాలు వ్యవసాయ బిల్లులను వ్యతిరేకించాయి. అయినప్పటికీ మూజువాణి ఓటుతో ఆ బిల్లులు పాస్ అయినట్టు రాజ్య సభలో ప్రకటించుకోవడం సక్రమమా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇదెక్కడి రాజ్యాంగ విధానం మోదీ? అని నిలదీశారు.

పాలక, ప్రతిపక్షాలతో పాటు 33 పార్టీలు సమర్థించిన ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లు అక్రమమా..? 4 కోట్ల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను అపహాస్యం చేయడం ఏం పద్ధతి మోదీ? రైతు వర్గం అంతా తీవ్రంగా వ్యతిరేకించినా మీరు వ్యవసాయ బిల్లులు తేవడం న్యాయమా..? అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపిం చారు.

ప్రాణాలకు తెగించి సీఎం కేసీఆర్ చేసిన పోరాటం, వందలాది ఉద్యమకారుల ప్రాణత్యాగం ఫలితంగా, తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర బిల్లు ఆమోదం పొందడం అన్యాయమా..? ఇదెక్కడి న్యాయం మోదీ జీ..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం.. సీఎం కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి.. జై తెలంగాణ అంటూ టీఆర్ఎస్ ఎంపీలు నినాదాలు చేశారు.

అన్ని పార్టీలు మద్దుతు ఇచ్చిన బిల్లు అశాస్త్రీయం ఎలా అవుతుందని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు ప్రశ్నించారు. బిల్లు ఆమోదంలో అశాస్త్రీయం ఏముందో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వమే చాలా బిల్లులను చర్చించకుండానే ఆమోదిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఎంపీలు కవిత, రంజిత్‌రెడ్డి, నామా నాగేశ్వరరావుతో కలిసి ఆయన న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ అసందర్భంగా తెలంగాణ ఏర్పాటును ప్రస్తావించారని విమర్శించారు. తెలంగాణ ప్రజలను ప్రధాని అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంటు సాక్షిగా ఏర్పాటైన రాష్ట్రంపై మోదీ వ్యాఖ్యలు సరికావన్నారు.

తెలంగాణపై ముందు నుంచే మోదీకి పగ : మంత్రి కేటీఆర్

రంగారెడ్డి, ఫిబ్రవరి 2: విశ్వాసం నింపాల్సిన చోట ప్రధాని మోదీ విద్వేషం నింపి రెచ్చగొడుతున్నారని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణపై ముందు నుంచే మోదీకి పగ ఉందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంపట్నం నుంచి అనాజ్‌పూర్ వరకు రహదారి విస్తరణ పనులకు, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు, ప్రభుత్వాసుపత్రిలో భవన నిర్మాణానికి, మినీ స్టేడియానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు.

దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని కించపరిచేలా ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు అని కేటీఆర్ ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీవి పనికిమాలిన మాటలు.. ఇలా మాట్లాడిన ప్రధాని మరొకరు లేరు అని కేటీఆర్ స్పష్టం చేశారు. రైల్ కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు పరిశ్రమ, పరిశ్రమలకు రాయితీలు ఇవ్వలేదు. ఎనిమిదేండ్లలో తెలంగాణకు ప్రధాని చేసింది శూన్యమని మండిపడ్డారు. రైతులకు ఇష్టం లేకపోయినా నల్ల చట్టాలు తెచ్చి రద్దు చేశారు. కర్ణాటకలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. విశ్వాసం నింపాల్సిన చోట మోదీ విద్వేషం నింపారు. తెలంగాణపై ముందు నుంచే మోదీకి పగ ఉందని పేర్కొన్నారు. తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపారు. దేశంలో మోదీ రాజ్యాంగం అమలవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆ అధికారం ప్రధానికి లేదు: టీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:కేంద్ర బడ్జెట్ 2022-23పై ఇవాళ రాజ్యసభలో సాధారణ చర్చ జరిగింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలను నిరాశపరిచిందన్నారు. 90 నిమిషాల మంత్రి ప్రసంగం 90 కోట్ల మందిని వెలివేసిందన్నారు. మన్రేగాకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రామీణ కార్మికుల్లో విశ్వాసాన్ని ఎందుకు నింపడం లేదన్నారు. గ్రామాల్లో నిరుద్యోగాన్ని తగ్గించడానికి కొన్ని చర్యలు తప్పవన్నారు.

మిన్ యూజ్ అవుతుందన్న భయాందోళనలను తొలగించాల్సి ఉందన్నారు. మన్రేగాను వ్యవసాయ రంగంతో లింకప్ చేయాలని గతంలో సీఎం కేసీఆర్ సూచించారని, దీని ద్వారా మిస్ యూజ్ అవుతుందన్న అనుమానాలు నివృత్తి అవుతాయని, అందుకే వ్యవసాయ రంగంతో మన్రేగాను లింక్ చేయాలని ఎంపీ సురేశ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే ఇదో మంచి అవకాశం అన్నారు.

గతంలో దుబాయ్‌కు వెళ్లే వారంతా ఇప్పుడు గ్రామాల్లోనే వ్యవసాయం చేసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) ఉంటుందని రైతులకు హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. డి మానిటైజేషన్, జీఎస్టీ ద్వారా ఎంఎస్ఎంఈలు దెబ్బతిన్నట్లు సురేశ్ రెడ్డి తెలిపారు. కరోనా నేపథ్యంలో రుణం ఇవ్వనున్నట్లు కేంద్రం చెప్పిందని, కానీ రుణాలపై వడ్డీని తొలగించాలని ఆయన కోరారు. డిజిటలైజేషన్ ప్రక్రియను స్వాగతిస్తున్నామని, కానీ కొన్ని ఆందోళనలు ఉన్నాయన్నారు.

ఏపీ విభజనపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను డిస్టర్బ్ చేశాయన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం మేం 14 ఏళ్లు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ బిల్లు హౌజ్‌లో పాసైందంటే, అదే పాసైనట్లే అని, ఎందుకుంటే పార్లమెంట్ సుప్రీమన్నారు. సభలో తెలంగాణ రాష్ట్ర విభజన బిల్లు పాసైన విధానంపై ప్రధాని మోదీ ప్రశ్నలు లేవనెత్తడం సరి అన్నారు. హౌజ్‌లో పాసైన బిల్లుపై ప్ర అధికారం ప్రధానికి కూడా లేదని టీ ఎంపీ తెలిపారు. విభజన వల్ల మీకేమైనా ఇబ్బందులు వచ్చాయా అని ప్రధాని మోదీని అడిగారు. ఒకవేళ వచ్చి ఉంటే మరెందుకు మేం అడిగిన డిమాండ్లను పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ నుంచి డిమాండ్లు వస్తున్నా.. వాటిని పరిష్కరించడం లేదని, ఆ డిమాండ్లను తిరస్కరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏదో దురుద్దేశంతో మోదీ రాష్ట్ర విభజనపై వ్యాఖ్యలు చేసినట్లు సురేశ్ రెడ్డ పేర్కొన్నారు.

వివేక వాణి

తనదు పాట్టకొరకుతానుబతుకు వాడు
బతికియున్నగూడ ఫలము సున్న
పరులకొరకు బతుక పరమార్థమున్నది
వినుడి స్వామి సద్వివేక వాణి !!

They alone live who live for Others,
the rest are more dead than alive.

-బండిరాజుల శంకర్
సెల్: 99480 50608

కొలంబియాలో వర్ష బీభత్సం - విరిగిపడిన కొండచరియలు -14మంది మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:కొండచరియలు విరిగిపడిన ఘటనలో 14మంది మృతి చెందారు. మరో 35మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. పశ్చిమకొలంబియాలోని పెరీరా మున్సిపాలిటీలో రిసరాల్డాలో భారీ వర్షాలు పడటంతో కొండచరియలు విరిగిపడ్డాయి.

దాంతో బురద నీరు నివాస ప్రాంతాలను ముంచెత్తింది. బురదలో కూరుకుపోయి కనీసం 14 మంది మృతిచెందారని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు. ఒకరి ఆచూకీ గల్లంతైనట్లుగా అధికారులు చెప్పారు.

మరికొందరి కోసం రెస్క్యూ బృందాలు బురదలో వెతుకుతున్నాయని కొలంబియా విపత్తు నిర్వహణ అధికారులు వివరించారు.

మృతుల సంఖ్యను పెరీరా మేయర్ కార్లోస్ మాయా ధ్రువీకరించారు. ఆ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఇంకా పొంచి ఉందన్నారు. మరింతగా ప్రాణ నష్టాన్ని నివారించడానికి ప్రజలు కొండచరియలు అవకాశం ఉన్న ప్రాంతాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు.

రంగంలోకి దిగిన ప్రభుత్వ బృందాలు నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనలో చెక్కతో నిర్మించబడిన అనేక ఇళ్లు దెబ్బతిన్నట్లుగా గుర్తించారు. అంతేకాకుండా ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలను ఆ బృందాలు గుర్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే 60 కంటే ఎక్కువ ఇళ్లలో నివసించే వారిని ఖాళీ చేయించారు. భారీ వర్షాల కారణంగాల బురద నీటిలో కురుకుపోయిన మరణించిన వారి కుటుంబాలకు కొలంబియా అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ సంతాపం తెలిపారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొండచరియలు విరిగిపడిన సమయంలో చాలా పెద్ద శబ్దం వచ్చిందని.. తాము భయాందోళన చెందామని ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ ట్యాక్సీ డ్రైవర్ తెలిపారు.

చరిత్రలో నేటినిజం

కం॥ మస్తుగ పలుచ ప్రమలను
మస్తా బానరించి ప్రజల మొంబు చుటచే
"శిస్తరు చందు బాగా కొడీయ"
ప్రస్తుతులను బాంధి నాబ ప్రమఖుల చేతనే !!

(ఫిబ్రవరి 10 దర్శక నిర్మాత కే.వీ. బొకాడియా జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

గొంగళి పురుగును చూడు ఎదుగుతు తాకెను నింగి
మనసే దడదడ లాడు అందుకొనగనే వంగి
దాని వలెను పరిణతించు వెదురు విల్లుగా మారె
కనువిందగు నీ యీడు! పూర్వపు గొప్ప ఫిరంగి!

రాముని కథకు తొలిమెట్టు
రామనామమునకు పట్టు
వాల్మీకికి నేర్పిందట
నిజమేనా మఱ్ఱి చెట్టు!

తీగకు పూవులు పూయును
చూడగ బాధలు మాయును
నేలను పాకెడి లతలకు
కడివెడు కాయలు కాయును!

ఉండిన చాలొక చింత
ఉండదులే యే చింత
పూవులు కాయలు పండ్లు
లాభాలవి కొండంత!

పచ్చదనముకే తాను
చిరునామై నిలిచేను
సంపన్నుల వాకిలిలో
సొగసుల నీనెడు లాను!

ఏడాదికి ఒకసారి
పూజింతురు నిను చేరి
తెలంగాణ జాతి గుర్తు
జమ్మిచెట్టు సరేసరి!

ఇంటికి ద్వారం గడప
మంచం కోడుకు కలప
చెట్టు శరీరాన్ని కోసి
పట్టుకుంటివా బడుప!

గాయం చేస్తే వేణువు
డొల్లగ చేస్తే వీణవు
సరిగమలను శ్రుతి చేస్తే
చెట్టమ్మా నెరజాణవు!

ఆకులతో వీవెనలు
రెమ్మల తో దీవెనలుతరు
అరటాకుల వడ్డనతో
అమృతతుల్య భావనలు!

ప్రకృతి పరిమళం-2

ప్రసిద్ధ కవి, కథకుడు రచయిత, విశ్రాంత తెలుగు పండితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, అభినవ దాశరథిగా పేరుగాంచిన **దోరవేటి** కలం నుండి జాలువారిన మణిపూసల కావ్యమే **"ప్రకృతి పరిమళం"**. ఇవన్ని కూడా ముక్తకాలే. ఈ ప్రకృతిలో భాగమైన అనేక రకాల చెట్లు, మొక్కలు, జంతువులు, పక్షులు, కీటకాలు మొదలగు వాటిని పలుకరిస్తూ, **పడిచర్ల సత్యం** సృష్టించిన మణిపూసల కవితా ప్రక్రియలో దోరవేటి కావ్యరచన సాగడం గమనార్హం. తెలుగు సాహిత్యంలో విశేష జనాదరణ పొంది, ఆబాల గోపాలాన్ని అలరించిన మణిపూసల ప్రక్రియలో వచ్చిన "ప్రకృతి పరిమళం" నేటి నిజం పాఠకుల కోసం....!

-సంపాదకులు.

గృహమందిరమున వెలసి
బాధల అంతము నరసి
పూజల నందెడి మాతా
వందనమమ్మా తులసి!

విష్ణువు శయన పాత్రము
తలపగ నతి పవిత్రము
హనుమంతుని ముంగిలిలో
వెలు గశ్వత్థ పత్రము!

అడవిన తానై సాగె
ఆకులు దట్టము మూగె
సర్వరోగ నివారిణి
అల్లదిగొ తిప్ప తీగె!

ఆకులు పూవులు చేదు
పిల్లలు బెరడూ చేదు
ఔషధ గుణముల వేప
ఆరోగ్యానికి పాదు!

ముక్కలు, ముక్కలు నరకు
బురదను పాతుము కడకు
చక్కెర బెల్లము లిచ్చును
అమృతమయి కదా చెఱకు!

తీయని పిల్లల పట్టు
ఆపై బతుకును నెట్టు
త్యాగానికి ముకురమ్ము
అదేగా అరటి చెట్టు!

మధుమాసపు పరిమళము
రసభరితపు జీవనము
అందరి నోరూరించే
అతివ ఆమ్ర రసాలము!

తినగా ఆకుల నిచ్చును
తిను తినుమని పూలిచ్చును
ఆరోగ్యానికి, వృద్ధికి
మునగకాయలను ఇచ్చును!

గగనానికేగిన...గానకోకిల

ఆ సరస్వతీదేవి
ఒడికి దూరమైనా
బడికి ఒకరోజే వెళ్ళినా
ఆ విధిచిన్నచూపు చూసి
కన్నతండ్రి గుండెజబ్బుతో
13 ఏళ్ళకే మరణించినా
బ్రతుకు బండి లాగుతూ
8 చిత్రాల్లో వెండి తెరపై
ఒక మెరుపు మెరిసినా
ప్రేమ పెళ్ళి ఒక పీడకలైనా
కడకు పాటే ప్రాణంగా హిందీ
నేపథ్య గాయనిగా స్థిరపడిన
స్వరకోకిల...లతా మంగేస్కర్

అది గాత్రమా కాదు కాదు
అది ఒక అమృత కలశం
అవి గీతాలా కాదు కాదు
కురిసే తేనెల వానలు
గలగలపారే సెలయేరులు
జలజలదూకే జలపాతాలు
కోట్లాదిమంది భారతీయుల
గుండెల్లో కొలువైన గాన గంధర్వ
స్వరశిరోమణి...లతా మంగేస్కర్

పలు భాషల్లో 50 వేల పాటలు పాడి
తన గానామృతం పంచి పరవశింపజేసి
ఆబాలగోపాలాన్ని ఆనంద సాగరంలో
ఓలలాడించి గిన్నిస్ బుక్ ఆఫ్ వర్ల్డ్
రికార్డులో స్థానాన్ని సంపాదించుకున్న
సంగీత సరస్వతి...లతా మంగేస్కర్

పద్మభూషణ్ పద్మవిభూషణ్
భారతరత్న మూడు అత్యున్నత
పురస్కారాలందుకున్న
భరతమాత ముద్దు బిడ్డ
సంగీత సామ్రాజ్యానికి మకుటంలేని
మహారాణి...లతా మంగేస్కర్.

స్వరమే భగవంతుని వరమంటారు
ఏ గాయకునికైనా ఏ గాయకురాలికైనా
దైనా భారత్ యుద్ధ సమయంలో
దేశభక్తి గీతాన్ని ఆలపించి ప్రధాని నెహ్రూనే
కంటతడి పెట్టించి తన గొంతులో
కోటి వేణువులు దాచుకున్న
కోట్టిరాగాల కోయిలమ్మ భరతమాత మెడలో
మెరిసే బంగరు ఆభరణం...లతా మంగేస్కర్

ఒకనాడు విషప్రయోగం జరిగి మూడు నెలలు
మృత్యువుతో పోరాడి ఆ మృత్యువునే ఓడించినా
నేడు కరుణలేని కరోనా
కాలసర్పం కాటుకు బలై..
తరతరాలకు తరగని అఖండ కీర్తి నార్జించి
గగనానికేగిన గానకోకిల...లతా మంగేస్కర్
ఆత్మశాంతికై అశ్రునయనాలతో
అర్పిస్తున్న అక్షరనీరాజనం

-పోలయ్య కవి కూకట్లపల్లి
.9110784502

విశ్వవిహారం

కోకిలలెప్పుడో
వసంతకాలంలోనే
కొలువుతీరుతాయి
గానామృతాన్ని కురిపిస్తాయి
ఎదలను రంజింపచేస్తాయి
ఈ కోకిలకు ఋతువులతో
సంబంధం లేదు
అన్ని కాలాలూ ఆమెవే
అంతటా ఆమె గానమే
ఆమె గళానికి సరిహద్దులు లేవు
ఆమె గానం విశ్వవిహారం
చందాహైతు మేరా సూరజ్ హైతు
అని పలకరించగానే
ఆ సూర్యచంద్రులు
పులకరించేవుంటారు
ఏక్ పరదేశీ మేరా దిల్ లేగయా
ఆ గీతానికి ఒక్కరుకాదు
పరదేశీయులంతా
ఆమె స్వరాన్ని దోచుకున్నవారే
దాచుకున్నవారే
కుహూ కుహూ బోలే కోయలియా
రాగాలాపనతో తెలుగుతోటలోకి వచ్చి
నిదురపోరా తమ్ముడా.... అంటూనే
తెలుగుతమ్ముళ్ళను మేలుకొలిపింది
పాట అంటే ఇట్లా వుండాలనేలా
పరవశింప చేసింది
లతాజీ! నీ దేహం ఈ లోకాన్ని వీడినా
నీ కంఠం కలకాలం సజీవమే
నీ స్వరపేటిక
జనహృదయాంతరాలలోభద్రమే

-పొత్తూరి సుబ్బారావు
సెల్:9490751681

మరలిరా కోకిల గానమా!

మరలిరా కోకిల గానమా
మరల గతమంతా మది తలవా
పాటవైరా
మరిచిపోయే ఈ జగాన్ని
మేలు కొలుపరా.

మరలి రాని కాలమంతా
బ్రతుకు బరువులో కరిగిపోయే
కలలు కనే కాలమంతా
కాల్ల క్రింద జరిగిపోయే.

బ్రతుకు బాటలో ఆశలన్నీ
ఆవిరాయే
తోబుట్టువుల తోడుకై మనసంతా
తపించి పోయే
బ్రతుకు అంతా పాట ఆయే.

కోకిలొక్కటి కంఠమిచ్చి
బ్రతుకు దాత ఆయే
వసంతమొక్కటి ఎదురుచూసే
మాత ఆయే.

మరలిరా చిగురించి 'లతలా'
మరచిపోక కోకిల గానమా!

(గాన కోకిల
లతా మంగేష్కర్ గారికి
అక్షర నీరాజనం)

– పి.బక్కారెడ్డి
9705315250

గానకోకిల భారతరత్నం లతా మంగేష్కర్

వసంత పంచమి రోజు శారదా మాత సరసన చేరిన భారతీయ గానకోకిల

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గొప్ప నేపథ్య గాయని గొంతులో నవరస భావాల్ని పలికిస్తూ శ్రోతలను తన గానం ద్వారా ఉర్రూతలూగిస్తూ భారతదేశానికి ఘనకీర్తి తెచ్చిన బహుముఖ గాయని లతా మంగేష్కర్ సెప్టెంబర్ 28 వ తేదీ 1929 వ సంవత్సరంలో ఒక సంప్రదాయ మహారాష్ట్ర కుటుంబంలో జన్మించారు. ఈమె జన్మస్థలం ఇండోర్. తండ్రి దీనానాథ్ మంగేష్కర్ సంగీతకారుడు,రంగస్థల కళాకారుడు. తల్లి శుద్ధమతి దీనానాథ్ రెండవ భార్య. అసలు ఇంటిపేరు హార్దీకర్ అయితే గోవాలోని స్వగ్రామం మంగేషి లో ఉండటం వలన ఇంటిపేరు మంగేష్కర్ గా మారింది. లత అసలు పేరు హేమ. తండ్రి నటించే బాన్ బంధన్ నాటకంలో "లతిక" పాత్ర పేరు నచ్చడంతో కూతురును ఆ పేరుతో పిలవగా క్రమంగా లత గా ప్రసిద్ధురాల యింది.

ఒక తమ్ముడు హృదయనాథ్. ముగ్గురు చెల్లెళ్లు. ప్రముఖ గాయని ఆశాభోంస్లే లత చెల్లెలు.తండ్రి తొలి గురువుగా అతని శిక్షణలో సంగీతం నేర్చుకుంది. తన పదమూడవ ఏటనే తండ్రి గుండెజబ్బుతో చనిపోవడంతో పెద్దకుతురైన లతపై సంసార భారం పడి జీవనోపాధి కోసం హిందీ మరాఠీ చిత్రాల్లోచిన్న చిన్న పాత్రలు, హాస్య పాత్రలు వేసింది. మొట్టమొదట 1943లో పహ్లా మంగళ్ గౌర్ మరాఠీ చిత్రంలో కథానాయికి చెల్లెలుగా నటించి రెండు పాటలు పాడి గాయనిగాసినీరంగ ప్రవేశం చేసింది. 1945లో నివాసం బొంబాయికి మారింది. ఉస్తాద్ అమంత్ అలీఖాన్ దగ్గర హిందూస్తానీ సంగీతం నేర్చుకుని 1946లో వసంత జోగలేకర్ తీసిన అప్ కె సేవా మే అనే హిందీ చిత్రంలో పాలగూన్ కర్ జోరీ అనే పాట పాడింది.

ఆ కాలంలోని ప్రముఖ గాయనీమణులు నూర్జహాన్ ఖుర్షీద్ దేశ విభజన తరువాత పాకిస్తాన్ వెళ్లిపోవడం, నేపథ్యసంగీతానికి ఆదరణ పెరగడంతో ఆమె గాయనిగా ఉన్నత శిఖరాలను చేరడానికి అవి దోహదం చేశాయి.

లత గళాన్ని మందగతి స్వరంలో ఉందని హేళన చేసినా,సూటిపోటి మాటలు అన్నా, ఎన్నో ఆటుపోట్లను అధిగమించి ముందుకు సాగింది. అప్పటికే దిలీప్ కుమార్ నీ గొంతులో మాండలిక యాస ఉందని హిందీ భాష సరిగా లేదని విమర్శించే సరికి దానిని ఒక ఛాలెంజ్ గా తీసుకుని మౌల్వీ షఫీ వద్ద ఉర్దూ భాషను నేర్చుకుంది.

సంగీత దర్శకుడు గులాం హైదర్ లతకు ఎంతో ప్రోత్సాహ మిచ్చారు. ఆయన ఎంతో ఆశా దృక్పథంతో రానున్న కాలంలో నిర్మాతలు, దర్శకులు లతా మంగేష్కర్ కాళ్లపై పడి పాటలు పాడమని బ్రతిమిలాడుకుంటారన్న జోస్యం నిజమైంది.

ఎన్నో ఒడి దుడుకులను ఎదుర్కొని నవ్విన నాపచేనే పండుతున్నదన్న సామెతగా హిందీ సినీ పరిశ్రమలో తిరుగులేని గాయనిగా, పాటల సామ్రాజ్ఞిగా రాణించింది. ఆమె గులాం హైదర్ తన అభివృద్ధికి కారకుడు అని ఎప్పుడూ గుర్తు చేసుకుంటుంది.

ఎన్నో పురస్కారాలు ఆమెను వరించాయి.

పద్మవిభూషణ్ మాత్రమే కాక అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న" తో సత్కరించబడింది.

1942 నుంచి కొనసాగుతున్న ఆమె సినీ ప్రస్థానంలో ఇరవై భాషలలో

యాభై వేలకు పైగా పాటలు పాడి యావత్ ప్రపంచ శ్రోతలను ఉర్రూతలూగించిన మధురగాయని అవివాహిత గా ఉండి తన జీవితాన్ని పాటలకే అంకితం చేసిన ప్రపంచ ప్రఖ్యాత గాయని లతా మంగేష్కర్. ఈరోజు భారతదేశం కన్నీరు కారుస్తుంది

ఆమె గొంతు మాత్రం మూగపోలేదు అందరి మదిలో చిరకాలం కొలువై వుండే గానకోకిల

లతాకు ఇదే అక్షర నివాళి..

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

ప్రతిహృదిలో...

వసంతం మూగబోతుందేమో.!
లత విడిచి వెళ్లిపోయారని..!

ప్రకృతి పరవశించదేమో.!
గానకోకిల గాత్రం మూగబోయిందని..!

సంగీత వాయిద్యాలు పలుకవేమో.!
సంగీత రత్నం సెలవు తీసుకుందని..!

చినుకు వర్షించదేమో.!
పాటలనావ రేవుకు చేరిందని..!

విత్తనం మొలకెత్తదేమో.!
దివ్యగానం దివికేగిందని..!

హృదయం స్పందించదేమో.!
వికసిచిన కుసుమం రాలిపోయిందని..!

పుడమి పులకించదేమో.!
కోకిలమ్మ గానం

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 10-2-2022

పుంటోరోపం

ఇబ్బందులున్నాయని
బేంబేలు పడకు
మబ్బులున్నా సాగే
సూర్యుణ్ణి మరువకు.

ఇల్లు మీద ఇల్లు
కట్టుకుంటే సరిపోదు
ఇల్లాలి గుండె గుడిలో
కొలువుండాలి.

కూరగాయల కొనుగోలులో
బేరసారాలు
నక్షత్రాల హోటల్లో
నజరానాలు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

మనసుపై మనసు పడ్డ కడారు వీరారెడ్డి

రసాయన శాస్త్ర ఆచార్యుడిగా 35 సంవత్సరాల బోధనానుభవం, 33 సంవత్సరాల పరిశోధన, శాతవాహన విశ్వ విద్యాలయ ఉపకుల పతిగా ఉన్నతోద్యోగం, పలు విదేశాలకు పయనం వెరసి సహృదయుడు, సౌజన్యమూర్తి కడారు వీరారెడ్డి. పరిణత వ్యక్తిత్వంతో, పరిపక్వమైన జీవితానుభవంతో 2014 సం॥లో "భాస్వరాలు" కవితా సంపుటితో కవన రంగంలో అడుగులిడారు కడారు. ప్రశంసలు, విమర్శలు ఆయనను రాటు దేలిన కవిగా తీర్చిదిద్దాయి. నిరంతర అక్షరప్రతుడైనాడు. కవిత్వ సృజనలోని రుచి, మజా అనుభవానుకొచ్చింది. రాయకుండా వుండలేని తనం ఆవహించింది. ఏడు సంవత్సరాలల్లో 15 కవితా సంపుటులు ప్రకటించారు. అంటే ఏడాదికి రెండు. అందులో అయిదు దీర్ఘ కవితలు. యిప్పుడు తాజాగా ఆరవ దీర్ఘ కవిత "మనసు తొడుక్కున్న మనిషి".

వీరారెడ్డి వస్తుతః కవి కాడు. వస్తుతఃకవి కాడు అంటే తత్వాన్ని బట్టి కాక సాధనవల్ల కవి అయిన కవిలాంటి కవి. నిరంతర సాధనవల్ల పదునుతేలిన కవి. ఏ కవి అయినా తన కవన ప్రస్థానంలో ఒక్క దీర్ఘ కవిత అయినా రాయాలి. అప్పటికి కానీ పరిపూర్ణత సిద్ధించదు. అంటే పూర్తి కవి కాడు అని అర్థం. ఈ కవి ఆరు దీర్ఘ కవితల్ని వెలువరించి సిక్సర్ కొట్టేసాడు. దీర్ఘ కవితల్లో వస్తువు మీద దృష్టికాదు.. రూపం మీద శ్రద్ధ కూడా అవసరమే. తగినంత సమయం వస్తువు మనసులో మాగితేనే కవిత పండంటి బిడ్డలా పురుడు పోసుకుంటుంది. 'మనసు తొడుక్కున్న మనిషి" సంపుటి చదివింతర్వాత వీరారెడ్డి దీర్ఘ కవిత రచనలోని మెలకువలు బాగానే ఆకళింపు చేసుకున్నట్టు గోచరిస్తుంది.

ఆయన ఎంచుకున్న వస్తువు "మనసు". మనసు మీద మహాకవి ఆత్రేయ. అద్భుతమైన సినీగేయాలు రాశారు. అవన్నీ అజరామరం. వీరారెడ్డి స్పృశించిన కోణం భిన్నమైంది. వస్తువు ఒకటే అయినా పలు రకాలుగా దర్శించడమంటే ఎవరి సంతకం వారిదే అన్న మాట. కొత్తగా ఆవిష్కరించడమే నిజమైన కవిత్వం.

మనసు అనేది ఎక్కడా వుండదు. భౌతికంగా కనబడదు. తొడుగు కూడా కాదు. శరీరావయ వాల్లో ఒకటి కాదు. మరి ఏమిటిది? అది మెదడులోని ఒక భాగం. భావోద్వేగాలకు నిలయమైన మనసు అనుక్షణం పరిపరి విధాల పరుగులెత్తే రేసుగుర్రం. సంకెళ్ళు వేయడమే మెదడు పని.

'మన బ్రతుకు ఓ భిత్తిక" అంటున్నాడు వీరారెడ్డి. భిత్తిక అంటే గోడ. "మనసు కుంచెతో, నచ్చిన రంగులతో ఐచ్ఛికంగా చిత్రించుకునే చిత్రపటం. ఎవరికి వారే ముద్రించుకునే కలల పటం". జీవన పథంలో అందమైన చిత్రాలను ముద్రించుకున్నా, అస్తవ్యస్త రేఖల వెంబడి పయనించినా మనిషి మేధ మీదే ఆధారపడి వుంటుంది. మేధ అంటే మనసుని నియంత్రించే మెదడే.

సంతోషం అన్నది ఓ మానసిక స్థితి. ఓ మధురానుభూతి. **"సంయమనం కోల్పోని మనసే.. సంతోషానికి కొలమానం"** అంటున్నాడు కవి.

"సంతోషం.. ఒక సంక్లిష్ట మానసిక ప్రక్రియ. ఉన్నదాంట్లో సంతృప్తి, క్రమశిక్షణ, కృతనిశ్చయం, అందనిదానికి ఆరాటపడని తత్వం..సంతోషానికి మూల రహస్యం" యింకా అర్థం కావాలంటే "ఆమ్లం, క్షారం విరుద్ధ గుణాలున్న రసాయనాలు. సంతోషం, బాధ, పరస్పరం భిన్నమైన భావోద్వే గాలు". రసాయన శాస్త్రవేత్త కదా! భిన్నత్వాన్ని సోదాహరణంగా చెప్పాడు.

"సంతోషం.. ఏ బ్యూటిఫుల్ సిండ్రోమ్
బాధ.. ఏ టెంపరరీ ఎబర్రేషన్" చక్కని నిర్వచనం
"నవ్వాలనుకుంటే.. సంతోష సముద్రంలో ఈదాలి
బాధ అనిపిస్తే.. బరువు దిగిపోయేవరకు ఏడ్చేయాలి"
అంటు మరింత వివరంగా చెప్తున్నాడు కడారు.
"హ్యాపీనెస్ ఈజ్ నాట్ ద డీఫాల్ట్"
"ట్రస్ట్ ప్రిసీడ్స్ హ్యాప్పీనెస్"

వంటి ఆంగ్ల కొటేషన్స్‌తో తన వాదాన్ని బలంగా వినిపిస్తున్నాడు.

"స్వర్గ, నరకాలు ఎక్కడోలేవు.. మనసులోనే వున్నాయి"

అంటున్న కవి **"అంతర్ దృష్టి నశించిన మనిషికి బాహ్య దృష్టితో జీవించడమే నరకం/ ఆత్మావ లోకనంతో నిత్యం అంతర్ముఖుడై పరమాత్మను దర్శించుకోవడమే స్వర్గం"** యివి వీరారెడ్డి మాటలు కావు. **'ఇదే నాల్గు వేదాల సారం"** అని తాత్వికతను అద్దుతాడు.

"జీవితం ఓ అందమైన అబద్ధమంటారా?
అయితే మృత్యువు- ఓ కఠినమైన నిజం" గొప్ప లాజిక్‌లా అనిపిస్తోంది కదూ!

ఏ కవిత్వానికైనా ఊహ ముఖ్యం. పాఠకుడ్ని ఆకట్టుకోవడానికి ఊహాశాలిత్వం సరైన ఆయుధం.

"జ్ఞానం కన్నా గొప్పది ఊహ
కల్పన దాని ఆత్మ" అంటున్న కడారు
"కలలే కనకుంటే అవి నిజమయ్యేది ఎలా?
నీటిలో దిగకుంటే లోతు తెలిసేదేలా?"

అంటు తన విజయవంతమైన కవితా ప్రయాణంలోని రహస్యాన్ని వెలుగులోకి తెస్తాడు.

"క్షుణ్ణంగా ఛేదిస్తే ఘన పదార్థమంటూ ఏదీ కాదు.
సూక్ష్మంగా విభజిస్తే..
మనిషి మనసులో జనించే
వేనవేల ఆలోచనలూ
రూపాంతరం చెందిన శక్తి ప్రకంపనలే" అన్న పోలిక బాగుంది.

"సంస్కారాలన్నింటికీ.. మనసే పుట్టిల్లు"
"మనసు మలిచిన శిల్పమే మనిషి"

యిలా మనసును పరిపరి విధాల నిర్వచించిన కవి

"లోతుకూ, వైశాల్యానికీ
అది ఓ మహా సముద్రం" అంటు తేల్చేస్తాడు.

"పగలూ, రాత్రులూ లేవు మనసుకు
క్షణ, క్షణ చైతన్యమే దాని సొగసు
నదిలా, వాయువులా, గులేరులా
ప్రతిపాత్రలో ఒదుగుతూ
అన్నింటా తానై దూసుకు వెళ్తుంది" ఈ క్రింది చివరి రెండు పాదాలు ఎంత గొప్పగా అన్నాడో చూడండి.

"ఇరుకైతే.. ఇముడనీయదు ఇసుమంత రేణువునైనా లోతుకూ, వైశాల్యానికీ.. అది ఓ మహా సముద్రం"

వీరారెడ్డి మొట్టమొదటి కవితా సంపుటి "భాస్వరాలు"పై సమీక్షా వ్యాసం రాశాను. ఆయన కవితా సంపుటులు అన్నీ చదివాను. రాస్తున్న కొద్దీ మొదటి సంపుటిలోని మొరటుదనం, అపరిపక్వత, కవిత్వం లోపించిన వచనం మటుమాయమై కవిగా తనను తాను తీర్చిదిద్దుకుంటున్న వైనం అబ్బుర పరుస్తుంది. వస్తు వైవిధ్యమేకాదు. వ్యక్తీకరణలో గాఢత కడారు సాధించిన ప్రగతి.

మనసు తొడుక్కోవటం ఏమిటి? మనిషితోనేగా వుండేది. కాదు అని కవిభావం. మనసుని చంపు కుని, అమ్ముకొని మృగంలా మారుతున్న మనిషి గురించే ఆయన ఆవేదన. అన్నీ భావోద్వేగాలకు ఆలవాలమైన మనసుని మనిషి ఎట్టి పరిస్థితుల్లోను పోగొట్టుకోవద్దు అని అంతర్లీన సందేశం. తొడుగులా తనతో అంటిపెట్టుకొని వుంచుకోమని వీరారెడ్డి హితవు.

"యుద్ధం చేస్తున్నాడు
మనసు తొడుక్కున్న మనిషి
తనలో.. తానే
అంతర్మథనం చెందుతూ
చేయాల్సిందే నిత్యం.. ఈ యుద్ధం
తానెవరో తెలుసుకునేందుకు" అంటు ముక్తాయిస్తారు కవి వీరారెడ్డి. మనసున్న వాడికే ఏదీ మంచీ, ఏది చెడు అనే విడమరిచే విజ్ఞత అలవడుతుంది. విజ్ఞత ఉన్నవాడే తనను తాను తెలుసుకోగలడు.

దీర్ఘ కవితకి కావాల్సిన ఒక ధార, ఒక వేగం భుజాన వేసుకుని పాఠకుణ్ణి ఎత్తుకుపోయే లక్షణం కావాలి. ఎంచుకున్న వస్తువు "మనసు". సున్నితమైన వస్తువు. ఆ వస్తువును ఏ కోణం నుండి 'unfold' చేస్తున్నాడు. disclose చేస్తున్నాడు అనేది ముఖ్యం. కవిత్వానికి అంతగా లొంగని వస్తువుని లబ్ధ ప్రతిష్ఠులు కూడా సాహసం చేయని వస్తువుని కడారు వారు ఎంచుకుని తన ప్రతిభను చాటుకున్నారు.

పొరలు, పొరలుగా unfold చేసిన వస్తువును ఒక క్రమ పద్ధతిలో పేర్చకపోవడం, ఒకే భావాన్ని అక్కడక్కడా పునరావృతం చేయడం, దాదాపు 100 పేజీల దీర్ఘ కవిత కొన్ని సందర్భాల్లో వచనంలా తేలిపోవడం బహుశా కడారు వారు గమనించే వుంటారు.

ఎంత రాశామన్నది కాదు.. కవితా ప్రియుల గుండెల్ని స్పృశించింది ఎంత అనేది కవికి ముఖ్యంకావాలి. వివిధ మాధ్యమాల్లో విస్తృతంగా కవిత్వం రాస్తున్న కడారు వీరారెడ్డిగారికి వాసిపై కూడా మరింత శ్రద్ధ అవసరమేమో ఆలోచించాలి.

ప్రతులకు: ఆచార్య కడారు వీరారెడ్డి
ఇ.నెం. 8-12-20
బృందావన్ నగర్,
రోడ్ నెం. 8, హబ్సీగూడ
హైదరాబాద్-500 007
సెల్: 9392447007

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

విపులు



తలచుకొంటే
ఆలోచనల్లో
ఉంటాను-
కళ్ళు మూసుకొంటే
కలల్లోకి
వస్తాను-

భావాచరణలో
సహగమిస్తే
నీలో జీవిస్తాను!
"ఆశయాన్ని" నేను!

-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

ఒడి నిండారా శిశువు .. .

బిడ్డడి తొమ్మిది నెలల ప్రవాసం
ఒక రోజు తల్లి పురిటి నొప్పులతో సంపూర్ణమైంది !
శిశువు జననంతో
అమ్మ ఒడి నిండిపోయింది
కడుపు లోపలి బరువంతా ఒడి నిండింది !
ఒడిలో కాస్తా గాలికికూడ ఖాళీ లేదు !
అంతా శిశువు రాజ్యం.

తల్లి ముఖాన్ని శిశువు
శిశువు ముఖాన్ని తల్లి చూడాలనే
నిరీక్షణనకు నాభి తెగి
మాయ విడివడి ఉత్సవం తెచ్చింది.

తల్లి ముఖమే శిశువు ముఖం
శిశువు ముఖమే తల్లి ముఖం
ఒకరికొకరు అద్దంలో చూసుకున్నట్లే.

ఒక్క కన్న తల్లికే తెలుసు
దుంకుడు శిశువు ఉంగ ఉంగ పలుకులు
వ్యాకరణం లేని భాష
తల్లికేం కొత్తగాదు
కడుపులో ఉన్నప్పుడే
పిందాండంగా కదలికలు
ఇపుడు ఒడి నిండా బ్రహ్మాండమంత ఆనందం.

శిశువుకు తీరిక లేదు
తల్లికి తీరిక లేదు

ఇద్దరి ముచ్చట్లకు
ఏం టీకా తాత్పర్యముంటుంది !

సీమంతం వేడుకలో పండ్లతో
ఒడి నింపుకున్న నిండుచూలాలు
ఇప్పుడు పండంటి బిడ్డతో
ఒడిని ఊయల చేసింది !
బరువు దిగిన అమ్మ ఖాళీ కడుపులో
ఇపుడు విశ్వమంత సంబరం

పగలంతా బిడ్డడికి నిద్ర
రాత్రంతా తల్లికి జాగరణ
పరులెవరైనా ఎత్తుకుంటే
బిడ్డకు ఏడ్పు ఎత్తుకునుడే !
అంతే తల్లి ఒడిలోనే శిశువు నిద్ర
తల్లికి కునికిపాట్లు
శిశువు సముద్రం మధ్య
ఒంటిగా వటపత్రశాయి కాదు !
హాయిగా తల్లి ప్రేమాస్పద ఒడి
సామ్రాజ్యంలో బాల చక్రవర్తి

-కందాళై రాఘవాచార్య
8790593638

నిన్ను నువ్వెత్తుకో

నింగి విరిగి నెత్తిని పడ్డా
కత్తి వ్రేటు కుత్తికపై బడ్డా
ఆత్మ విశ్వాసం
నీ ఆయుధం కావాలి!

నిన్ను నువ్వు ఎత్తుకో
మన్ను మిన్ను సాక్షిగా

నువ్వు పల్లవించ గలవు
నవ్వులు పువ్వులు పూయగలవు.

నిబ్బరమే నీ మందు
దెబ్బల దేహం ముందు!

-కిలపర్తి దాలినాయుడు
7780589336

సహజీవనం

పెళ్ళంటే మూడుముళ్ళు
ఏడడుగులు కట్నాలు కానుకలు
పట్టువస్త్రాల బంగరు వన్నెల
దగదగలు దాండియా నృత్యాల నడుమ
బుల్లెట్టు బండెక్కి పోయే
కన్యాదాన వైభవోపేత మహోత్సవం కాదు.
జీవితమంతా కలిసి నడవవలసిన
రెండు హృదయాల అపూర్వ సంగమం
పెళ్ళంటే కనిపించని అరుంధతి
నక్షత్రం కోసం వెతుకులాట కాదు
ఆకాశంలో సగం నీ జీవిత భాగ స్వామిగ
నీ ఎదుటే నిలిచున్న మహాస్వప్నం.
కొత్త బ(క)ంగారు లోకాల్లోకి అడుగిడే
ఆజంట ఒకరిలోకి ఒకరు తొంగి
చూసుకోవాల్సిన ఉద్విగ్న క్షణాలది
పెళ్ళంటే... కాళ్ళు తొక్కడం
వేళ్లు గిచ్చడం కాదు.
ఒకరినొకరు గుండెల్లో
బాడుకంటుకున్న అసమాన
ఆధిపత్యాల అహంకారపు గోడలను
కూలగొట్టుకొని సమానతా 'ప్రేమ'
సౌధాల్ని నిర్మించుకోవాల్సిన సందర్భం..
పెళ్ళంటే..

కార్లు కలర్‌టీవీలు ఫ్రిజ్జులు
బంగరు ఆభరణాలు పట్టు వస్త్రాల
దగదగల మదతల్లో ఫోటో ప్రదర్శనే కాదు
వంటిమీద నగల వెనుకాల
ఆమె హృదయ స్పందనల్ని
వినగలగడం..
పట్టు చీరెల మదతల్లో
ముడుచుకున్న ముతక ఆలోచనల్ని
మూఢ అంధకారాల్ని సరిచేసుకొని
అరమరికలు లేని మరో ప్రపంచంలోకి
అడుగేయడం..
పెళ్ళంటే.. దోసిళ్ళకొద్దీ తలంబ్రాలు
పోటీపడి పోసుకొని.. అప్పగింతల్లో
దుఃఖ సముద్రాల్ని ఈదడం కాదు
జీవన గమనంలో ఎదురయ్యే
సవాళ్ళను బతుకుబాటలో ఎక్కి
దిగాల్సిన ఎత్తు పల్లాలను
మగువకు మనసుంటుందని
మగ పెత్తనపు కోటల్ని మనసు
సుత్తెల్తో సున్నితంగా చెక్కుకొని
మానవీయంగా బ్రతికే మనుషులుగా
చెక్కుకోవడం.. పెళ్ళంటే
సామాజిక సహజీవనంలా
సాగాల్సిన జీవన సమరం!

-సహచరి
9440970454

రైతు గోడు !

పుడమితల్లిని నమ్మిన పుత్రుడతడు
నింగితండ్రిని ప్రార్థించు నిరతుడతడు
మట్టినే నమ్ముకొన్నట్టి మనిషియతడు
కృషిని విడలేని కర్షకఋషియతండు !

అప్పులుజేసి క్షేత్రముల నాసగ విత్తులు నాటి,పంటకై
ముప్పులు తిప్పలన్ గడచి పూటకుపూట సురక్షజేయుచున్
చెప్పులు లేక నేలపయి చిర్రను నెండలవానలన్ సదా
తప్పక సాగు ధాన్యముల దాతయతండు కృషీవలుండహో !

పండినపంట నమ్ముకొన వచ్చినవేళల మోసపోవుచున్
దండిగరాని మూల్యముల దారియొకింతయు కానరాదయెన్
పండిన పంట నేలపయి పారగబోసి గృహమ్ముకేగుచున్
గుండెలలో విషాదములు గుప్పుమనంగ హతాశుడయ్యెడిన్!

తినుటకు తిండిలేక గొనితెచ్చిన యప్పులు దీర్పలేక,తా
మనుటకు దారిలేక తన మంచికి యాదృతిగానరాక,రై
తునకు నిరంతరమ్ము భువి దూరములైనవి భాగ్యలాభముల్
కనుగొనరేల యాతని వికాసపు దారులు నేతలెప్పుడున్!

చలికి వజవజవణకుచు సాగువాడు
వాన దడియుచు ముద్దయై బ్రతుకువాడు
ఎండలకు నెండిపోవుచు నేగువాడు
వాడు కర్షకుడే నష్టభాగ్యజీవి!

ఆతని గోడుల దీర్పగ
చేతలలో బూనవలయు చింతలు దీర్పన్
ఆతడు నేడ్చిన జాతికి
ఖ్యాతియు శూన్యముగ నిల్చు కాశ్యపిలోసన్ !

-డా.అయాచితం నటేశ్వరశర్మ
9440468557

ఆశిస్సు

గురువండి గురువు
మా కళ్ళ వెలుగు
బంగారు బాటకు
దారి చూపించు
వజ్రమంటి వ్యకిత్వాన్ని
శిల్పిలా చెక్కు
ఏమిచ్చి ఋణం తీర్చుకుంటాం?
చేతులెత్తి మొక్కి
తలవంచితే చాలు
పాదాల నంటి
ప్రణమిల్లితే చాలు
"వందేళ్ళు వర్ధిల్లు"
ఆశిస్సు మన సొంతం!

-యలమర్తి అనూరాధ
సెల్:9247260206

నా భారతం

ఘనకీర్తి పొందినదే నాదేశం
భిన్నసంస్కృతుల సమాహారం
ఈ ప్రత్యేకతే భారతీయసంస్కృతి
మానవీయవిలువల మిళితమే నాదేశం
ఐకమత్యమే మహాబలం
దర్శనీయమే నాభారతం
ఆనాటి తెల్లదొరలను తరిమింది..
ఈనాటి దేశద్రోహులను
దునుముతుంది..
సమైక్య బలమే...
తెలిసి మసలుకో
మన మనుగడ తెలుసుకో...
యువతే మనదేశసంపదన్న
పెద్దలమాట మిన్న
చెడు నడతలు చేరనివ్వక
యువతభవితను
బంగరు బాట నడిపి
భరతమాత భాగ్యం నింపగ
చేయిచేయి కలుపుదాం..
ఉన్నతునిగా మనల్ని నిలిపే
సనాతన ధర్మాన్ని గుర్తించు
ఈదేశపౌరనిగా అనువర్తించు..
శ్రమజీవుల ఘర్మజలం
అవనికి భుక్తినొసంగునందాక
మేధోసంపదలు దేశసిరులు పెంచునందాక,
ప్రతిహృది నిస్వార్థతతో
చరించునందాక
సరిహద్దుల్లో విజయకేతనాలు ఎగురునందాక
నాదేశం సుజలాం సఫలాం...
అదే నాభారతం
జై భారత్..జైజైభారత్

-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

గొలుసు 'కొట్టు' కథ

ప్రియ సోదర సోదరీమణులారా !

నమస్కారాలు. అందరికీ స్వాగతం. శుభస్వాగతం. మనకు ఉన్న ఆనవాయితీ ప్రకారం మన సంస్థ అధ్యక్షుల వారినే నేటి ఈ అంతర్జాతీయ మహాసభకు అధ్యక్షత వహించవలసిందిగా వేదికకు సాదరంగా ఆహ్వానిస్తున్నాను. అలాగే మన ప్రధాన కార్యదర్శి గారిని, కోశాధికారి గారిని వేదిక మీదికి రావలసిందిగా కోరుతున్నాను.

స్వాగత వచనాలైపోయాయి. సభ అంతా అంతకుముందే నిశ్శబ్దంగా ఉంది. సభలో రెండు వందలమందికి పైగా కూర్చుని ఉన్నారు. అంతా కిందనే కూర్చున్నారు. వేదిక మీద కూడా ఓ కార్పెట్ మీదే అతిథులు కూర్చుని ఉన్నారు.

భాగ్యనగర్‌కు నలభై కిలోమీటర్ల దూరాన ఒక అత్యంత ప్రాచీనమైన, శిథిలావస్థలో ఉన్న భవనంలో జాతీయ రహదారికి దూరంగా, కాకులు, చీమలు, కుక్కలు, నక్కలు చేరలేని ప్రదేశంలో జరుగుతోంది మీటింగ్.

ఇప్పటికే ఈ సభ కథా కమామీషు ఏంటో మీకు అర్థమైందనుకుంటా.

అదేనండీ గొలుసు 'కొట్టు' సభ. సభలో అంతా గొలుసు కొట్టేసే దొంగలు. అందులో సీనియర్స్, జూనియర్స్, శిక్షితులు, శిక్షకులు, గురువులు, ప్రవచనకారులు, వాహన చోదక ప్రవీణులు, జిత్తుల, ఎత్తుల మేరు నగధీరులు, ఇలా ఎన్నో కేటగిరీస్ వాళ్లున్నారు.

అధ్యక్షుడు ఉపన్యాసం మొదలెట్టాడు. 'డియర్ కామ్రేడ్స్ ! ముప్పై సంవత్సరాలుగా మన ఈ చోర వృత్తినే దైవంగా భావిస్తూ, సేవిస్తూ ఆరాధిస్తూ, నిరాఘాటంగా ముందుకు పోతున్నాం. మనకు 64 కళల్లో చోర కళ కూడా ఉన్నది. దీని పవిత్రతను, విశిష్టతను చిత్తశుద్ధితో మీరంతా మంచి టీం వర్కుతో కాపాడుతున్నందుకు సంతోషం. మీ జీవితం మూడు గాజులు, ఆరు గొలుసులు, పన్నెండు వడ్డాణాలుగా వర్ధిల్లుతూండాలని మనసారా కోరుతున్నాను. మీకు ఇప్పుడు కొన్ని సూచనలు :-

"కరోనా ఓ వంక మహమ్మారి అయినా మనకు ఓ మహావరం అయింది. మీరు నిండుగా కళ్ల వరకే కనిపించేలా మాస్కులు ధరించాలి. సానిటైజర్ రాసుకోవాలి. భౌతిక దూరం తప్పకుండా పాటించాలి. అయితే, సోదరీమణులు సందుల్లో, గొందుల్లో ఒంటరిగా వెళుతున్నప్పుడు మాత్రం భౌతిక దూరం సూత్రాన్ని వదిలేశేయాలి.

ఆడవాళ్ల మెళ్లకు గాయాలు కాకుండా సాధ్యమైనంత నేర్పుగా గొలుసుల్ని లాక్కోవాలి.

మన ఆహ్వానాన్ని మన్నించి ఎన్నో పనుల ఒత్తిళ్లలో ఉండీ కూడా ముఖ్యఅతిథిగా విచ్చేసిన చోరేశ్వర వర్మ గారిని మన సంస్థ పురోగతి కోసం తమ ప్రవచన ప్రసాదం అందించవలసిందిగా కోరుతున్నాను" అంటూ అధ్యక్షుడు తన ఉపన్యాసం ముగించి, ముఖ్య అతిథి గారి వైపు చూశాడు.

ముఖ్య అతిథి చోరేశ్వర వర్మ మందర స్వరంతో కేవలం సభలోని చివరి వరస వాళ్ల వరకే వినపడేలా తన ప్రసంగం ప్రారంభించాడు.

"చోర సోదర సోదరీమణులారా ! స్వర్ణ ప్రియులారా ! నిజానికి నేనివాళ బెంగళూరులోని సభలో మాట్లాడవలసిన కార్యక్రమం ఉంది. అయినా బంగారానికి కోశాగారమైన భాగ్యనగరంలో, మీరు నిర్విరామంగా, పగలురేలు అనే తేడా లేకుండా నిరంతర కృషి చేస్తూ, వృత్తిని నిర్వర్తిస్తూ బతుకును బంగారుమయం చేసుకుంటున్న మిమ్మల్ని అభినందిస్తున్నాను.

నాదొకటే కోరిక. మనది భరతభూమి, తపోభూమి, పుణ్యభూమి, ఆర్యభూమి. మహిళలు పూజలందు కుంటున్న మహిపైన దేవతలు కొలువై ఉంటారని పెద్దలు చెప్పారు. కనుక, పర స్త్రీలందరినీ తల్లుల్లా చూడండి. వారిపైన చెడు దృష్టి ఉండకూడదు. మీ దృష్టి వాళ్ల ధరించిన బంగారం పైనే ఉండాలి. సాధ్వీశిరోమణుల మనోభావాలు దెబ్బతినకూడదు. వారి గౌరవానికి భంగం ఏర్పడకూడదు. వాళ్ల ప్రతాలకు, నోములకు ఆటంకం కలగకూడదు. వాళ్లను తమ దారిలో ఒంటరిగా నడవనివ్వండి. పలకరించకండి. మీరూ మౌనం పాటించండి. మీ

చుట్టూ తుపాకులతో పోలీసులు. గొలుసు 'కొట్టు' కథ కంచికి కాదు, కైదు కెళ్లింది.

మౌనం మీకు పెట్టని ఆభరణం. ఆ ఆభరణం వల్లనే కదా వాళ్ల ఆభరణాలు చేతులకు అందేది ? వేర్వేరు రంగుల చొక్కాలు, కోట్లు ధరించి అపహరణ కార్యక్రమంలో కృతార్థులు కాగానే పక్క సందులో కెళ్లి చొక్కా మార్చండి. మీ బైకు నెంబరు స్పష్టంగా లేకుండా చూసుకొండి. దగ్గర కారంపొడి స్ప్రేబాటిల్సు అట్టే పెట్టుకొండి. వాహన చోదకులు 150 స్పీడుతోనైనా వెళ్లగలిగే వాళ్లయి ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోను మందు తాగిబండ్లు నడపకూడదు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడకూడదు. చట్టాన్ని గౌరవించాలి కద ! బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తారు. పోలీసులు దర్యాప్తు చేస్తారు. దొంగతనం టైమ్‌లో మీరెక్కడ ఉన్నదీ ఎలిబీ సృష్టించుకుని, సర్టిఫికెట్ దగ్గరుంచుకొండి. మీ నైపుణ్యమే మీ పుణ్యం, మీ చాకచక్యమే జీవన సార్థక్యం. కేసు అయి పట్టుబడ్డా భయపడకండి. జైలుకు కృష్ణ జన్మస్థానం అన్న పేరుంది. 4-5 రోజులు జైల్లో పెడతారు. అసలు తగినన్ని జైళ్లు ఎక్కడున్నాయి కనుక ? తిరగిగొచ్చేస్తారు. 100 సార్లు 200 సార్లు ఇలా అత్తారింటి కెళ్లి వచ్చిన వాళ్లను మంచి బిరుదులతో సత్కారాలు చేయవలసిందిగా అధ్యక్షుల వారిని కోరుతున్నాను. స్వర్ణ కిరీటి, స్వర్ణ రత్న, స్వర్ణ శిఖామణి, స్వర్ణశ్రీ, స్వర్ణబ్రహ్మ, స్వర్ణపితామహ, స్వర్ణకేసరి, స్వర్ణప్రవీణ మొదలైన బిరుదులిప్పటికే ముంబయి, కలకత్తా, చెన్నై, ఢిల్లీ, గుజరాత్, బిహార్, మహారాష్ట్ర మొదలైన చోట్ల చాలామందికి ఇప్పించి ప్రోత్సహించి, చైతన్య స్ఫూర్తిని రగిలించడం జరిగింది. మీ కందరికీ ఇన్సూరెన్సు, హెల్త్ కార్డులు, కృతిమాంగాలు లాంటి సౌకర్యాలుంటాయి. మీ పిల్లలు అటు చదువుతోపాటు ఈ చోరవృత్తిలో కూడా ప్రశిక్షణ పొందుతారు. ఉద్యోగం దొరికినా, దొరక్కపోయినా ఈ వృత్తికి ఢోకా ఉండదు". ముఖ్య అతిథి మాట్లాడుతుండగానే బయటి నుంచి విజిల్సు, మైకులో మాటలు వినిపించాయి. చూస్తే చుట్టూ తుపాకులతో పోలీసులు. గొలుసు 'కొట్టు' కథ కంచికి కాదు, కైదు కెళ్లింది.

-చిమ్మపూడి శ్రీరామమూర్తి
97041 77270

నిన్ను నువ్వెత్తుకో

నింగి విరిగి నెత్తిని పడ్డా
కత్తి వ్రేటు కుత్తికపై బడ్డా
ఆత్మ విశ్వాసం
నీ ఆయుధం కావాలి!

నిన్ను నువ్వు ఎత్తుకో
మన్ను మిన్ను సాక్షిగా

నువ్వు పల్లవించ గలవు
నవ్వులు పువ్వులు పూయగలవు.

నిబ్బరమే నీ మందు
దెబ్బల దేహం ముందు!

-కిలపర్తి దాలినాయుడు
7780589336

గజల్ ఓమనసా

నీకన్నా మిన్నగుంటె ఓర్వలేవు ఓమనసా
వారికీర్తి పతాకాన్ని చూడలేవు ఓమనసా

చక్కనైన నడవడితో నలుగురిలో మెప్పుపొందె
నీతోటి సహచరులా పొగడలేవు ఓమనసా

హృదయాలను గాయపరచ పరిక్కంప కుప్పలన్ని
మూటగట్టి మాటబరువు మోయలేవు ఓమనసా

ఎతలోతుల నిండుకున్న చీకట్లను తరిమివేయు
హాయిగొలుపు సమూహాన నవ్వలేవు ఓమనసా

గుంపులోన కలవలేక ఒంటరిగా ఉండలేక
కఠినరాతి నిశీధుల్లో నడవలేవు ఓమనసా

వకుళపూల సుగంధాల స్నేహమంత వాడినాక
అందనంత తీరాలలొ పలకలేవు ఓమనసా

-వకుళ వాసు
9989198334

నాలో... గణతంత్ర గుణగణాలు

గాల్లో కపోతాలు
కల్లో కలలు
వాస్తవంలో దేశ గుణగణాలు...

జెండా ఎగురుతూనే ఉంది
కర్ర నిలబడే ఉంది
మనిషి నిలకడే నేలను మరిచిన కపోతమైంది...

గణతంత్రాలు గడిచిపోతున్నాయి
సామాన్యుడి కలలు
మంత్రాలకు రాలే చింతకాయలు అవుతున్నాయి....

ఆకాశంలో సూర్య జననం త్యాగఫల కాషాయం
మట్టితల్లి గుండె పచ్చని పచ్చదనం
ఇంటి ముందు మంచు దుప్పటి శాంతి శ్వేతం
నరుడి నడవడే ఇరుసుల ధర్మచక్రం...

బడిలో జెండా ఎగురుతూనే ఉంది
చేతిలో సద్దిగిన్నే ఊగుతూనే ఉంది
సద్దిగిన్నే కడుపు నింపింది
ఎగిరే జెండా మనుగడకే సార్థకత నింపింది....

నా మనసు ముగ్గులో
దేశ గొప్పతనం ఉగ్గుపాలు తాగుతున్నది
నేనెంత అదృష్టపు భరతమాత బిడ్డనో....

-అభిరామ్
9704153642

నేటి మానవులు?

ముందుగా మంచి మాటలతో..
ప్రేమను ఒలుకబొస్తుంటారు..
వెనుక నుండి వెన్నుపోటుతో..
కీడు చేయ పూనుకుంటున్నరు..

పరులకు కీడు చేయ దలచి..
తనకు హాని జరుగుట మరిచెను..
స్వార్థ

ఆకాశం నీ అత్తారిల్లా

ఆకాశం నీ అత్తారిల్లా
ఎగిరిపోతావు చినుకా?
మేఘపు కొమ్మను
వాలిపోతావు భలే నీటిచిలుకా!

సూర్యం మామ చూపులకెగిరి
చుక్కలనంద జూస్తావు
చందమామ తన గంథము రాయగ
చుక్కెనేలకు వస్తావు

నెర్రెలు తెరిచిన నేలగొంతులో
నెగడును చల్లార్చే స్తావు
ఆల్చిప్పలో మెల్లగా చేరి
ఆణిముత్యమైపోతావు

కుండపోతగా కొండలపైన
కురుస్తు వాగైపోతావు
మైదానంలో మట్టిని కాస్తా
మాయం చేసి పోతావు

నదిగా మారి పంటకు చేరి
పచ్చని బతుకులు పెడతావు
సంద్రంలో కి పోతే మాత్రం
ఉప్పైమిగిలి పోగులవు!

ఆకాశం నీ అత్తారిల్లా
ఎగిరిపోతావు చినుకా?
మేఘపు కొమ్మను
వాలిపోతావు
భలే నీటిచిలుకా!

-కిలపర్తి దాలినాయుడు
7780589336

అనుభవాలు

పాత గాయం మంచిదే
జ్ఞానాన్నిచ్చి
కొత్త గాయాన్ని మాన్పుతోంది!

రెక్కలు తెగినా కానుగ చెట్టు
చిగురించడం మానదే
పచ్చని కలే దాని ఆత్మ గౌరవం!

జారి పడినా
వాన చినుకుది పతనం కాదు
పరోపకారమే!

చూడు! నేల రాలినపూలు
కృతజ్ఞతగా ఈ మట్టికి
పరిమళాలద్దుతున్నాయి!

పరుగెత్తే ఏటి నీటి రుచి
ఎదురెక్కే చేప పిల్లనడగాలి
ప్రవహించనిదే శుచి రుచి అబ్బదు!

వేదాంతమంటేమిటో
ఉదయాస్తమానాలను చవి చూస్తున్న
భూగోళాన్నడగాలి!

కష్ట సుఖాలను
ఆహ్వానించని జీవితాల్లోకి
వెన్నల వెలుతురు తొంగి చూడవు!

ఎగుడు దిగుడు
నడకెరిగిన పాదాలకు
ప్రయాణపు అలసట అంటదు!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

ఏది పరమార్థం..?

ఆకులు రాలి
చెట్టుకు ఎరువైనా
వర్షం జారి
ఆకాశానికి ఊపిరిలూదిన
సృష్టిలో అంతర్భాగమే..!

నీరు మంచైనా
మంచు నీరైనా
మబ్బు చినుకైనా
చినుకు మబ్బైనా
సృష్టి నియమమే..!

పండు బీజమైనా
బీజం పండైనా
జననం మరణమైనా
మరణం జననమైనా
సృష్టి మూలమే..!

శాశ్వతం అశాశ్వతమైనా
అశాశ్వతం శాశ్వతమైనా
ప్రకృతి వికృతైనా
వికృతి ప్రకృతైనా
సృష్టి రహస్యమే..!

పూర్ణాన్ని పూర్ణంగా
ఉన్నదానిని ఉన్నట్లుగా
రేపటి అవసరార్థులకు
ప్రకృతిపరిమళాన్ని అందించడం
సృష్టిలో అవశ్యమే..!

సృష్టిలోని ప్రతి వస్తువునూ
అపరబ్రహ్మ అన్నంతగా
గుండె దోసిలితో
పట్టి పెట్టి కాపాడుకోవడమే
పునర్జీవన పరమార్థము..!

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

పల్లె పదనిసలు

జాతి వెన్నెముకలే కదా పల్లెలు
కర్షక శ్రామిక వర్గాల చెమటలు
వెచ్చటి తొలి సంధ్య ఘడియలు
ఉషోదయాన పక్షుల కిలకిల రావాలు
మంచు ముత్యాలు వెలసిన ఆకులు !

అలారం కూతతో లేచే పల్లెలు
ఊరిని చుట్టిన హరిత తివాచీలు
గుమ్ముల నిండా ధాన్యరాసులు
పాడిపంటలతో పల్లె సంబరాలు
లేగ దూడల నెమలి నాట్యాలు !

ఉడుత, పిచ్చుకల ముద్దు ముచ్చట్లు
ఆవులు, బర్లలే ఆత్మీయ స్నేహాలు
కల్లాపు పేడల కమనీయ వాసనలు
జోడెడ్లతో నాగటి సాల్లల్లో విత్తనాలు
చేను చెలకల్లో పవన విన్యాసాలు !

పంటను చూసి కర్షకుడి ఆనందాలు
కంటి కునుకు మరిచి కల్లంలో కాపురాలు
వరి కోత మిషిన్లు.. కుప్పల తిప్పలు
ధాన్య సేకరణకే మీనమేషాల వేషాలు
గిట్టుబాటు ధరల కొనుగోలు కేంద్రాలు !

వరి గొలుసుల బరువుకే ఒరిగిన చేలు
పత్తి లాంటి సుతిమెత్తని మనసులు
ముక్క కంకుల చెంప గిచ్చితే పాలు
పల్లి కాయల్లోంచి నూనెల ధారలు
తాటి ఈత కల్లు కుండల మోతలు !

మైసమ్మ, ఉప్పలమ్మ, ముత్యాలమ్మలు
గ్రామదేవతలకే తీరొక్క పూజలు
బొడ్రాయి సాక్షిగా దసరా పండుగలు
బతుకమ్మ, బొడ్డమ్మ, బోనాల వేడుకలు
ఊరు ఊరంతా ఉత్సవ శోభలు !

పట్నం రంగేసుకున్న గ్రామీణ పల్లెలు
నవ్య నడవంత్రపు పోకడల ప్రవాహాలు
బెల్ట్ షాపుల్లో హౌజ్‌ఫుల్ బోర్డులు
కొట్టుకుపోతున్న నాటి పల్లె సౌందర్యాలు
గ్రామాలకే పట్టిన పట్టణీకరణ చెదలు !

పెంకుటిల్లు, గుడిసెల అవశేషాలు
అంతరిస్తున్న నాటి ఊరి వాసనలు
అభివృద్ధి పేరుతో గ్రామ విధ్వంసాలు
త్రిశంకు స్వర్గంలో అమాయక పల్లెలు
వాణిజ్య దాడులతో గాయాలపడ్డ గ్రామాలు !

శస్త్రచికిత్సలకే నయం కాని అగ్రహారాలు
ఆగమై పోతున్న అన్నదాత జాడలు
నిల్చున్న చెట్టునే నరుక్కునే రోజులు
ఎవరి బొంద వారి తవ్వే అకాలాలు
గ్రామాభిమానులే కరువైన ఘడియలు
పల్లెను కమ్మిన కాలుష్య కారుమబ్బులు !

చేతులు కాలక ముందే ఆకులు పడదాం
చేయి దాటక ముందే చేతులు కలుపుదాం
పల్లె పునాదుల్ని పునరుజ్జీవింపజేద్దాం
సాగుబడి రాబడితో పిల్లల్ని బడిలో చేరుద్దాం
రైతును మహారాజుగా పట్టాభిషేకం చేద్దాం
భారత సమాజాన్ని సాగుతో సక్కబెడదాం !

-మధుపాళీ
9949700037

గుండె గూటిపై పిడుగుపాటుకు...

తలపు తేమని
మడతలెన్నేసినా చెమ్మాగడం లేదు.
సన్నగా సెగ కమ్మడం మానలేదు.

కళ్లను సూటిగా తాకి
చిందే కన్నీటిలో
తీపి శబ్దాలని రంగరించి తాపినా
దప్పికారలేదు.

మాటతో పాటుగా
మనసు కోల్పోయిన నాలుక,
సెలయెరై పారి
ఎండి సొమ్మసిల్లిన పెదాలు,
కల కోరికను తెంపుకుని
నిద్రను తెంచుకున్న కళ్ళు,
బాధతో బీడై
బరువెక్కిన భావుకత,
కాలం సంకెళ్లకు
మౌనం మాటున ముడుచుకుని
గుండె గూటిపై పడ్డ
పిడుగు పాటుకు
తలచుకుని ఒంటరిలోకి
కూరుకుపోయే సమయంలో

ఏ అక్షరాన్ని నాటాలన్నా
చేతికి చలనంలేదు.
ఏ భావాన్ని పులుముకోవాలన్నా
హృదయంలో సందడి లేదు.

ఎదురు తిరిగిన వ్రాతలో
వెక్కి ఏడ్చే నిజాలను చూసి
ఏళ్ల కొద్ది తపస్సు చేసిన
మునివేళ్ళుకు మతితప్పి.

అక్షరాన్ని తలవాలంటే ....
భయమైంది..
అక్షరాల్ని పిలవాలంటే....
దిగులైనంది...

-చందలూరి నారాయణరావు
9704437247

నానోలు

పుస్తకం
దిక్సూచి
చదువు
గమ్యం
నవ్వు
సుగంధం

కోపం
దుర్గంధం
విజ్ఞత
విజయం

అహం
పరాజయం
కలం
కూర్పు

కవిత్వం
మార్పు
వెన్నెల
వెండి
వెలుతురు
స్వర్ణం

మెరుపు
పలకరింపు
చినుకు
పులకరింపు

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

భరతమాత శతకము-దేశభక్తి నిలయము

సమాజహిత కాంక్షి అయిన రచయిత సదా చిరంజీవి అవుతాడు. అందులో ఏమాత్రము సందేహము లేదు. తన వ్యక్తిత్వమును,తన భావనను నిరంతరం సమాజ అభ్యున్నతికి వినియోగించేందుకు చేసే ప్రయత్నంలో కొందరు కవులు మాత్రమే సఫలీకృతులు అవుతారన్నది జగమెరిగిన సత్యం.

వంశపారంపర్యంగా వస్తున్న సాహిత్య పరిమళమును పునికిపుచ్చుకుని అటు ఆధ్యాత్మిక తత్త్వ కీర్తనలు ఇటు పద్య,వచన రచన సాహిత్య సృజన కారులుగా వెలుగొందుతున్న కవి, రచయిత ఇందూరు వాస్తవ్యులు ×శ్రీ ఎలగందుల లింబాద్రి× గారు వీరి వంశీయులు (ముఖ్యంగా అన్నయ్యలు) తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేశారని చెప్పాలి. నేడు అదే పరంపరలో భాషామతల్లి సేవలో భాగంగా నిత్యరచనా సేద్యమును కొనసాగిస్తూ అనేక కృతులను వెలువరించారు ×శ్రీ లింబాద్రి గారు.×

ముఖ్యంగా వీరు రచించిన శతకములు: 1)లింబాద్రి నరసింహ శతకము,2)లింబాద్రి శతకము,3) భరతమాత శతకము× అన్ని కావ్యములు పద్య సారభమును వెదజల్లేవే అయినప్పటికీ ఇందులో దేశభక్తితో పాటు దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన కలిగి పలువురు మన్ననలను పొందిన రచన ఏదైనా ఉన్నది అని చెప్పవలసి వస్తే అది కేవలం 'భరత మాత శతకము' అని చెప్పవలసి ఉంటుంది.

చిన్ననాటి నుండి తన అనుభవాలను, జ్ఞాపకాలను ఎన్నింటినో తన మదిలో పదిల పరుచుకున్న రచయిత భవిష్యత్ తరాల యందు ఈ విధంగా వాటికి భాషా పరిమళాల నది అందమైన పద్యాలుగా వెలుగొందేటట్లు చేయడం జరిగింది. అసలు ఈ శతకమునందు తనకు భరత ఖండం పట్ల దేశసంస్కృతీ, సంప్రదాయాల పట్ల ఎంతటి గౌరవాభిమానాలు ఉన్నాయని గనుక మనం తొంగి చూస్తే మనకు ఎన్నో జీవన ఛాయలు, మధురానుభూతులు మనను తడుముతూ ముందుకు తీసుకువెళతాయి.

"భవిత సన్మార్గదర్శిని భరతమాత!
"బిభరత కులపుత్ర సకల సౌభాగ్య దాత!!"

అనేటువంటి ద్విపాద మకుటంతో సీస పద్యం ఛందస్సులో సాగుతూ 108 పద్యములతో పూర్తి అయినటువంటి ఈ 'భరత మాత శతకము' భారత భూమి అంటే అనాది సంస్కృతికి, వేదములకు ఆలవాలమైనదని సకల కళలకు పుట్టినిల్లు అని విశ్వసించిన రచయిత తన మాతృదేశం పై గల గౌరవాభిమానాలను ఈ విధంగా చాటిచెప్పారు.

॥సీసం॥
బిమనభారతీయ ధర్మానికి బీము
బివేదమేయనవచ్చుమోదమునను!
బివేదంబె వృక్షమై వెలుగొంద దానికి
బినుపనిషత్తుల పేర్లు నొప్పుగాను
బిశాఖోపశాఖలై సకల జగత్తులో
బివిస్తరించెనునివి వేదమందుబి
చెలగి శాఖలు పురాణాలు, కీర్తనములు
బిపూజలు పాటలు భజనలన్నీ
తే॥గీ॥
ఆకులుగ వృక్ష మందున అమరియుండ
తేటముగ ధర్మమగు భారతీయ మనగ
భవిత సన్మార్గ దర్శిని భరతమాత!
భరత కులపుత్ర సకల సౌభాగ్యదాత!!

సనాతన భారతీయ ధర్మ మార్గం ఎటువంటిదో తెలియజెప్పే ఒక గొప్పపద్యం ఇదని చెప్పవచ్చు. అంతేకాకుండా సరళ సుందరమైన పదజాలంతో సీస పద్యం గతిని నడిపించిన విధానం గమనిస్తే రచయితకు భాషా,పదజాలం పట్ల ఎంతటి పట్టు ఉందో మనకు అర్థమవుతుంది. అంతేకాకుండా మనం చూస్తున్న సమాజంలో ఎంతోమంది కుల వృత్తుల వారు మనకు కనిపిస్తారు. అటువంటి కుల వృత్తుల వాళ్లే గనుక లేకపోతే ఈరోజు మనం ఎటువంటి పనినైనా వ్యక్తిగతంగా చేసుకునేవాళ్ళం కాదని చెప్పాలి.

ఎందుకంటే నేటి సమాజంలో కొందరు వృత్తి పని వారిని చులకనగా చూస్తున్న వైనాన్ని గమనించిన కవి హృదయం ఎంత తపించి ఉంటే ఇంత గొప్ప పద్యం వస్తుంది!

సీసం!
పిడికెడు మెతుకుల పేర్మియే రైతుది
వస్త్రధారణ సాలె వారి వరము!
కిటికీలు ద్వారాలు కీలైన వాసమంల్
వడ్రంగి చెతురత వాసిగాదె!
స్వర్ణకారుని నేర్పు స్వర్ణాభరణములు
పరిణయ క్రతుజర్పు బ్రాహ్మణుండు!
కుమ్మరన్నయు మట్టికుండలు బాణలు
మేలైన బుట్టల్లు మేదరన్న
తే॥గీ॥
బివృత్తులన్నియు మనజాతి పొత్తుగాదెబి
బితుదకు కడజాతి కడదాక తోడుగాదె.....!!

చూడండి ఎటువంటి వర్ణాన్నైతే ఈ సమాజం హీనంగా చూస్తుందో వారే మనకు అంతిమ సంస్కారాల యందు తోడై ఉంటారనే ఒక జీవన సత్యమును రచయిత సమాజమునకు కనువిప్పు చేయడమనేది ఈ పద్యం ద్వారా గమనించవచ్చు.

మరోచోట మట్టికి,మనిషికి మధ్యఉన్న సంబంధ బాంధవ్యములను తెలియజేస్తూ మనిషి పుట్టక ముందటి నుండే ఈ మట్టితో సకల ప్రాణికోటికి సత్సంబంధం ఉన్నదన్న నిజాన్ని బట్టబయలు చేస్తూ,ఈ ధరాతలం పై మనిషి ఏ విధంగా తన కర్తవ్యమును నిర్వర్తిస్తున్నాడోచెబుతూ...

॥సీసం??॥
మట్టిలో పుట్టాము మట్టిలో పెరిగాము
మట్టిలో గలియుటే చిట్టచివర!
మంచివారిని నమ్ము మంచి స్నేహముజేయు
యెంచనీ బ్రతుకంత మంచిగుండు!
మట్టిని మరి మంచి మనిషిని నమ్మక
చెడ్డవారిని గూడ చెడుదువీవె!
మట్టికన్ననుమిన్న మహినినేదియులేదు
మట్టివిలువ లెక్కగట్టలేము!
తే॥గీ॥
బివేయిలార్జించినా నీతొ వెంటరావుబి
బిమట్టిలో గల్వమిగులు నీ మంచియొకటె.....!!"

లింబాద్రి గారి ఈ పద్యమును చదివితే వారిలో ఒక వేదాంతి మరియు ఒక తాత్త్వికుడు మనకు గోచరిస్తాడు. జీవనసారమును అంతటినీ ఈ ఒక్క పద్యము నందే చెప్పడం అంటే రచయితకు లోకజ్ఞత ఎంత ఉందో చెప్పకనే తేటతెల్లం అవుతుంది.

ఏదో చెయ్యాలి అనుకుంటూ,ఎన్నో సాధించాలని కుంటూ, ఎత్తుకు పైఎత్తులు వేస్తూ,ఈ భూమి పైకి వచ్చాక మనిషి తనను తాను ఏ విధంగా నిరూపించుకుంటాడో మరి అమ్మ కడుపున ఉమ్మనీటిలో ఉన్నప్పుడు నెలల తరబడి పిండదశ ఎట్లా మార్పు చెందుతుందో ఈ పద్యమును చదివితే మనకు ×రామ రామ శతకము× లోని సారాంశం గోచరిస్తుంది.

॥సీసం॥
గర్భమందున పింద గతులిట్లు యుండును
నెలల వారిగ పింద మలరుచుండు!
ఐదురోజులకు పిండాకారముండియు
పదిరోజులకు రేగు పండుయంత!
నెలకు శిరస్సు రెన్నెళ్ళకు భుజములు
మూడునెల్లకు నఖములును చర్మ!
మును మరి గుహ్యాంగములువచ్చు గుట్టుగ
సరి నాల్గునెలలకు సప్తదాతు!
వులు నైదు నెలలకాకలి దప్పికలుగల్గు
మాయగప్పును నారు మాసములకు!
సప్తమాసములలో జ్ఞానంబు గలిగియు
కదలాడు నటునిటు గర్భమందు!
తే॥గీ॥
బివూర్తి మానముల్ నిండి తా పుట్టువరకు
బితానుజేసిన కర్మాల దలచి యేడ్చు.....!!"

ఉదరకుహరమున నెలలు నిండిన పిదప శిశువు పడే వేదనను గర్భస్థ శిశు దశలను రచయిత ఒక చిత్రం వేసి చూపించినట్లుగా చూపడం అనేది అనన్య సామాన్యమైన విషయం.అటువంటి ఈ నరజన్మను మానవుడు పొందిన పిదప ఎన్నో సమస్యలను, సంతోషాలను సమానంగా ఎదుర్కొని అనుభవించవలసి అవసరం ఉందని తెలియజేసే ఈ క్రింది పద్యం చదివితే మనిషిలో ఏ మూలనో దాగిన నిరాశానిస్పృహలు కాస్త మటుమాయం అవుతాయననే చెప్పాలి.

సీసం॥
కష్టాలు కన్నీళ్లు కలతలు తప్పవు
జన్మమెత్తిన నరజన్మకెపుడు!
శ్రీ రామచంద్రుడే సీతాసమేతుడై
యడవుల కష్టాల ననుభవించే!
దైవమే నరరూపుదాల్చి జగతిలోన
సత్యధర్మనిరతి చాటిచెప్పె!
శ్రీ రామబాటయే శిరసావహించిన
అవనియే రామరాజ్యంబుగాదె!
తే॥గీ॥
బిఅట్టి మహనీయుడే వ్యథలనుభవించెబి
బిమానవులమైన మనమెంత మాన్యులార.....!!"

ఈ పద్యం విన్న తర్వాత "సాగిపోవుటె బ్రతుకు" అనే నగ్నసత్యం బట్టబయలు అవుతుంది అని చెప్పాలి. అయితే ఎన్ని చేసినా మనిషిలోని స్వార్థపూరిత భావజాలం మాత్రం నశించడం లేదు. అందుకే శ్రీరామచంద్రుని జీవితం ఆదర్శమనే భావనతో రచయిత ఈ పద్యం చెప్పారనేది మనకు తెలుస్తోంది.

చివరగా ఈ దేశ సంస్కృతిని, దేశ సౌభ్రాతృత్వము కొనియాడుతూ ఎందరో మహనీయులు యొక్క త్యాగ ఫలితమే ఈ మన స్వతంత్ర్య భారతావని అని తెలియజేస్తూ, తన యొక్క పదాలనే ఆ భారతమాత చరణారవింద ములకు కుసుమాంజలిగా సమర్పిస్తూ రాసిన పద్యం ఒకసారి.....

॥సీసం??॥
పరదేశు హస్తాన బందియయ్యిననాడు
స్వాతంత్ర్య సమరాలు జరిగెనెన్నో!
ప్రాణాలు సైతము పణముగ పెట్టగా
వీరపుత్రుల రక్తధారవరలె!
భరతమాత మనల పాలించు తల్లిరా
తల్లికొరకు చావ తప్పులేద!
పుణ్యభూమిన బుట్ట పుణ్యఫలముగాదె
చచ్చిన తీరును జన్మఋణము!

ఇటువంటి ప్రబోధాత్మకమైన సందేశం ఈ 'భారతమాత శతకము' లోని ప్రతి పద్యమునందు మనకు అగుపిస్తుంది ప్రతి ఒక్క భారతీయుడు ఈ దేశాన్ని,ఈ నేలను, ఈ మట్టిని నిత్యం ప్రేమిస్తున్నాడు అంటే అంతకంటే ధన్యులు మరొకరు ఉండరనే చెప్పాలి.

పాఠకలోకానికి చైతన్య పూరితమైన భావజాలం పంచే దిశలో ఇటువంటి మరెన్నో శతకములు,కావ్యములు ×శ్రీ ఎలగందుల లింబాద్రి× గారి లేఖిని నుండి వెలువడాలని ఆ భారతి వారికి నిండు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనసారా వేడుకుంటూ రచయితకు మరోసారి శుభాభినందనలు.

ప్రతులకు:
ఎలగందుల లింబాద్రి
సెల్: 7659834393

-సుప్పని సత్యనారాయణ,
9492626910

పుస్తక సమీక్షలు

యమ్.వి.నరసింహారెడ్డి యజుర్వేదం తెలుగు వచనానువాదం

విద్యావేత్త, పండిత ప్రాచార్యులు, ముదుగంటి వేంకట నర్సింహారెడ్డి, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విశిష్టతకు ఆలవాలమైన వేద విద్యపై దృష్టి సారించి, నాలుగు వేదాలను సులభశైలిలో సంపూర్ణంగా తెలుగు వచనానువాదం చేయటం ఎంతైనా అభినందనీయం. 'యజుర్వే దము', ఈ సద్గంథంలో, 40 అధ్యాయాలలో మహర్షి దయానంద సరస్వతి రచించిన, సంస్కృత ఆర్య భాషా విభూషిత యజుర్వేదములోని పంచ సంపుటాలను తేట తెలుగులో జనసామాన్యానికి అందించారు. వేద పారాయణం, యజ్ఞ యాగాది నిర్వహణకు అత్యంత ప్రధానమైన యజుర్వేదం సమస్త మానవాళి శ్రేయస్సుకు యజ్ఞములు ఉత్తమ కర్మలని అనంతమైన శాస్త్ర జ్ఞానం



వేదాలలో నిక్షిప్తమై పరమేశ్వరునిచే ఉత్పన్నమైనదని వివరించారు. యజ్ఞకర్తలకు, గృహస్థులకు,ప్రజలకు, రాజులకు, దుష్ట స్వభావ వర్తనులకు, కన్యలకు, యోగులకు, న్యాయాధీశులకు సర్వ మానవాళికి యథార్థ దర్శన రూప విద్య ద్వారా నాశరహితమగు పరమాత్మను ప్రాప్తించుకోవలసినదిగా అయిదు సంపుటాలలో ప్రబోధించారు. యజుర్వేదంలోని ఋషులు, దేవతలు 115 సంఖ్యలో, గ్రంథాంతంలో ఒక పట్టికగా అందించారు. వేదాలు బ్రహ్మ దివ్యవాణి తేజస్సుతో సృష్టించబడి ఋషుల మేధస్సు అప్రయత్నంగా ఆవిర్భవించి, వారి వాక్కుల ద్వారా వెలువడిన సంస్కృత మంత్రాలుగా ప్రబోధించబడటం వలన, వేదం అపౌరుషేయమని, ఋషులు మంద్రద్రష్టలని దివ్య సందేశంగా వివరించారు.

విద్యావేత్తగా తత్త్వ, మానసిక శాస్త్రవేత్త అయిన రచయితగా ఆంగ్లంలో, హిందీ, తెలుగు సుమారు 20 రచనలు ప్రచురింపచేసిన వ్యవహారిక భాషావేత్తగా ఎమ్.వి. నరసింహారెడ్డి, వేదాలను ఆంగ్లభాషా యుక్తంగా లోతైన అధ్యయనంతో, సామాన్య చదువరులకు చదువుకొనే ఆసక్తి, అభిలాష, ధర్మ జిజ్ఞాసతో జీవిత పరమార్థాలను ఆచరింపచేయటం ప్రశంసనీయం.

ప్రతులకు: ఎమ్.వి. నరసింహారెడ్డి
సాహిత్య నికేతన్, 3-4-852
కేశవ నిలయం, భర్కత్‌పురా
హైదరాబాద్-500 027
ఫోన్: 040-27563236

-జయసూర్య
సెల్: 9440664610

మూడో కన్నీటి చుక్క- బొల్లోజు బాబా కవితా సంపుటి

"ఏ రెండు
కన్నీటి చుక్కలు ఒకేలా ఉండవు
వాటిని చూసినపుడు
జారిన మూడో కన్నీటి చుక్క
కవిత్వం" అంటారు. **'మూడో కన్నీటి చుక్క'** కవితా సంపుటిలో బొల్లోజు బాబా, జీవన దృశ్యాలను కవితా వాక్యాలుగా కథనం సృష్టించడం, అక్షరాలలో మనో ప్రపంచాన్ని ప్రవహింపచేయటం, ప్రతీ కవితలో బాబా ఆవిష్కరింప చేసారు. 'ఫ్రాగ్మెంట్స్'లో అందమైన సీతాకోకలు, గాల్లో ఎగిరే దృశ్యంతో, రైల్వే ట్రాక్‌పై మురికి బట్టల సీతాకోకను చూస్తాను. **'అధికారం'** కవితలో

"ఓ నాయకుడు



రెండు వేళ్ళూ పైకెత్తిగాల్లో
అటూ ఇటూ ఊపుతున్నాడు
వెర్రి జనం కూడా ఊపుతున్నారు" అంటారు. ముల్లు తీయించుకోవటం వంటి అమ్మ జ్ఞాపకం లాంటి అనుభవం, ప్రయాణంలో స్వప్నాలలోకి ప్రవహించటం, చీకటి దిష్టిబొమ్మ దహనం, అవసరం లేకపోయినా నెమలీకలు కొనుక్కోవడం, చెవిటి, అంధ, మూగ వారి అనుభవ కవిత, కీమోథెరపి వేదన, గమ్యాన్ని మరచిన దారి, పదచిత్రాలుగా కవితాభిమానులను ఆకట్టుకొంటున్నాయి. ఆ మూడు రోజుల దైహిక రహస్యం, నాన్నతనం వైవిధ్యభరితమైన ఇతివృత్తాలను కవి ప్రతిభావంతంగా కథ చెప్పినట్టే ప్రస్తావించి, భిన్నమైన ధోరణిలో కథనాత్మకత గాఢంగా దర్శింపచేస్తారు. ఆకర్షణీయంగా మానవ సంబంధాలను మానవతా విలువల కవితలుగా తీర్చిదిద్దటంలో బొల్లోజు బాబా హృదయాలను స్పందింపచేసే విధంగా మూడో కన్నీటిచుక్క మనల్ని కట్టి పడేస్తుంది.

ప్రతులకు: బొల్లోజు బాబా
30-7-31, సూర్యనారాయణపురం
కాకినాడ (తూ.గో.జిల్లా)
ఆంధ్రప్రదేశ్
సెల్: 9849320443

-జయసూర్య
సెల్: 9440664610

అబద్ధం

ఇది నువ్వేనా..?
నీ నడక
నీ నవ్వు
నీ చూపు
ఈ ఏడుపు ఐనా నీదేనా..?
అసలు నువ్వు నువ్వేనా
అద్దంలో కాదూ..
హృదయాంతరాల్లో తొంగిచూడు
నీ ప్రతిబింబం కాదు
ప్రవర్తన కనిపిస్తుంది
అది నువ్వో కాదో..!
ఎదురుబదురై తేల్చుకో..!

- పోలీస్ భీమేశ్
సెల్:9505255218

ప్రీఫైర్ మత్తు

ఆనందంగా ఉండే పిల్లలు
సంతోషంగా బడికి వెళ్ళే పిల్లలు
ఏ పాపం చేయలేని పిల్లలకు
కరోనా వచ్చి
చదువు ఆగిపోయింది
ఇంటికే పరిమితం అయ్యారు
ఆన్ లైన్ తరగతులు అన్నారు
ఆప్పు చేసి
మొబైల్ కొనగా
ప్రీఫైర్ మత్తులో పడిపోయారు
అన్నం కీ దూరం అయ్యారు
బద్ధకాన్ని పెంచుకున్నారు
కంటి దృష్టిని తగించుకున్నారు
గంటల తరబడి కూర్చుని
ఆడుతూ
వెన్నముక్కన్ని కరిగించుకున్నారు
ఎన్నడూ వంచనీ మెడను
గంటల తరబడి
మొబైల్ లో వంచాడు
మెడ నొప్పి అని బాధపడుతున్నారు
ప్రీఫైర్ ఓ వ్యసనం
ఇకనైనా వదలండి



-రమావత్ విష్ణువర్ధన్
7036890195

భగవద్గీత

కనుమరుగవుతున్న మనిషికి
మార్గదర్శి గీత
విలువలు వదిలిన మనిషికి
దిక్సూచి గీత
మారుతున్న సమాజానికి
నడక నేర్పే మాతృమూర్తి గీత
మనిషి ఎలా ఉండాలి
ఎలా నడవాలనే
కర్తవ్యాన్ని, ధర్మాన్ని
తెలిపే జీవన గ్రంథం గీత
తినే తిండి నుండి గుణాల వరకు
తామస, రాజస ,సాత్విక
త్రిగుణాల కలయికలతో నడిచే
మనిషికి
జీవన గమనాన్ని
జీవిత సూత్రాన్ని
విశదీకరించే జ్ఞాన భాండాగారం
శ్రీమద్భగవద్గీత...
అలసిన మనసుకు ఆశ్వాసన్ని
పడిపోయిన మనిషి ధైర్యాన్ని
జడంగా ఉన్న మనిషిలో
చైతన్యాన్ని బోధించే పంచమ వేదం
శ్రీమద్భగవద్గీత...
తరాలు మారినా తరగని జ్ఞానం
యుగాలు గడిచిన మారని అక్షరం
ఇప్పుడు, అప్పుడు,
ఎప్పుడు జ్ఞానామృతాన్ని
ఇచ్చే జ్ఞాన కల్పతరువు
శ్రీమద్భగవద్గీత...
ప్రపంచ సాహిత్యమంతా
మరుగునపడిన
నిరంతరం వెలుగును పంచే
తత్వజ్ఞానం శ్రీమద్భగవద్గీత...
అందుకే
నా భారతదేశ
వారసత్వ సంపద
శ్రీమద్భగవద్గీత.....

-శ్రీపాల్
8978894808

అంతర్లీనంగా జవాబు..!!

అక్షరాన్ని అటూ ఇటూ మారుస్తున్నా
సవాలక్ష ప్రశ్నలకు జవాబుగా
కుదిరితే అర్థవంతంగా ఉంటుంది
కుదరకపోతే మరో ప్రశ్న ఉదయిస్తుంది...

అర్థంకాని అనంత విశ్వం
సృష్టి రహస్యాలు దాచి ఉంచుతుంది
కంటికి కనిపించే చుక్కలే
ఖగోళ శాస్త్రానికి అంతుచిక్కని ప్రశ్నలు...

మనిషి హృదయాన్ని చదవగలిగితే
ఎన్నో శాస్త్రాల మర్మములు చెప్పవచ్చు
ఆత్మజ్ఞానం పొందగలిగితే
మహా గ్రంథాలను పక్కన నెట్ట వచ్చు...

యక్ష ప్రశ్నలు ఎన్ని ఉన్నా
నేటి సమాధానాలు రాకెట్ వేగమే
అంతర్లీనంగా జవాబు ఉంటే
బహిర్గతంగా ప్రశ్నలు ఉదయిస్తాయి...
మూడు కాళ్ళ శరీరము కూడా
యవ్వనపు మనసుతో పరుగులు తీస్తుంది
నలుగురు మోసే పాడె వరకు
వార్ధక్యం మనసుకు లేదు కదా..

కాలపు గొలుసు బంధించిన
బంధుత్వం కొక్కిలి ఊడుతున్నాయి
మానవత్వపు చిగుళ్లు
రాతి మనసులో
మొలకలు వెయ్యడం లేదు...
నింగిని నేలను శాసిస్తున్నా మనిషి
తనను తాను అదుపు తప్పుతుండు
విశ్వాన్ని గుప్పిట్లో బంధించి
అరచేతిలో
ఆటంబాంబును పెంచుతున్నాడు..

-కొప్పుల ప్రసాద్
9885066235

ఇది కవిత్వం కాదు

కిటికీ తలుపు సందు నుండి
చల్లని చలికాలపు గాలి
దుప్పటి పక్కకు జరిగిందో లేదో
దూరమైన నిద్ర ఒడి...
సమయం ఒకటిన్నర....
ఒక్కసారి తలపుల కొలనులో
తరంగితమైన
సరిహద్దుల దృశ్యం...
ఇక్కడ..
ఆస్తుల కుస్తీలు
ఆక్రమణల గస్తీలు
సంపదలకై దోస్తీలు
దోపిడీలు జబర్దస్తీలు...
అక్కడ...
పహారా పహారా పహారా
దేశ రక్షణ కై
సమాజ భద్రతకై
అనుక్షణం తమ ఆయువును
కొంచెం కొంచెంగా మండిస్తూ
ఆ వెలుతురులో ఊపిరి జెండా
ఎగురవేసే
సైనికుడి గుండె సవ్వడి..
ఇక్కడ
ఇంత రంచనుగా
వేళకు భోజనం,నిద్ర
అన్నీ ఉన్నా ఇంకా
ఆరాటాలు,ఆర్భాటాలు....
అక్కడ
మంచు ఖడ్గం వెన్ను విరుస్తున్నా
ఆకలి శూలం కడుపును పొడుస్తున్నా
వెన్ను చూపక మడమ తిప్పక
అస్తమించని సూర్యుడై
జ్వలించే ఆ సైనికుడి అడుగుల సవ్వడి
ప్రాణం పోగానే శవమయ్యే మనిషి ని
అశుభంగా చూసే
చిత్రమైన మనుషులం
భూకంపాలు,సునామీల
ఉత్పాతాల వేళ
సైనికుల సేవలకు ఉందా కొలమానం..
రాజకీయాలూ,రమణీ విలాసాలతో

నందివర్ధనాలు

- డి.రాములు
సెల్:94403 76688

అన్నపిలుపునందు ఉన్నను రాగంబు
చంద్రకాంతి కన్న చల్లనైన
దానికన్న యిచ్చు తన్మయత్వముసుమ్ము
అతివకుండు రక్ష అన్న ఉన్న

మనసు పొరలు విప్పి మాధుర్యమొలిగించు
మమత పొరల భాష మనసు భాష
భక్తి రక్తి ముక్తి శక్తి యుక్తుల భాష
ఇప్పపూవు రసపు ఇంపు భాష

తెలుగు వారి శక్తి తెలుగుపై గల భక్తి
తేటతెల్లముగను తెలియజేయ
ఏకమై కదులటే ఏకైక మార్గమ్ము
ఇపుడుగాక యింక ఎపుడు చెప్పు

పుస్తకాలు చదువ ముఖ్యమే అయినను
మనుజులను చదువుతు మనయవలయు
లోకమును చదివిన పోకడలు తెలియు
నిన్ను నువ్వు చదువు మిన్నగుండు

అధిక వేతనమ్ము అందెడి మాస్టార్లు
వారిపిల్లగాళ్ల బాగుగూర్చి
ఆరు ఏడు వేలనార్జించు కాన్వెంటు
'సార్ల' నడుగు - నేటి చదువు లివియె

స్త్రీని దేవతంటు చెప్పు నందరుయును
పంజరాన పక్షి పడతిగాదె
చెప్పడాలు కావు విప్పడాలెముడులు
చిక్కు వీడినపుడె చింత దీరు

చిన్నపాటిదయ్య జీవితమ్మును చూడ
మిడిసిపాటు తగదు మితము గనక
ప్రకృతిని పరికించు పాఠాలు నేర్పెన్నొ
నేర్వకున్న మనదె నేరమౌను

మార్పు చేర్పు మనను మంచి గమ్యము వైపు
తగిన గమనముండి తపనయున్న
విజయకాంక్షలుండి వినయ సంపదయున్న
ఓర్పు తెచ్చు మంచి మార్పులెన్నొ

ఉన్న ఊరి కన్న కన్న తల్లియు కన్న
లేవు అంచితాలు ఏవిలేవు
అమ్మ చేతి వంట కమ్మదనము మించి
ఏమివుందొ మిన్న ఎంచి చెప్పు

చేతగాదు అనకు చెయ్యగలదు అన్ని
చదువుకుంటె మహిళ సవ్యసాచె
మగువ చేయనిపని మహిళందునున్నదా
ఆమె పూర్ణమైన ఆకసమ్ము

భార్యభర్తలెపుడు వాదులాడుచునుంటె
గతుకులమయమేను బతుకుబండి
సఖ్యతున్న యిల్లు సర్వసుఖములొందు
నిత్యసంతసముల నిలయమౌను

ఇంతి కేల యిన్ని యిక్కట్లు జగతిన
గర్భమందె మొదటి గండ ముండు
పుట్టినంత తనకు ముప్పుయే అన్నిటా
ఆడజన్మకన్ని ఆంక్షలేను

అనుభవజ్ఞులు మరి అభిమానధనులేను
సహృదయసహకార సర్వగుణులు
వయసుమల్లెనంత వలదు ఛీపొమ్మంటె
ఇంత కంటె వంచ నేమి యుండు

అవసరమ్ము లేని అన్నింట యందున
వేలు పెట్టరాదు వెతలు కలుగు
వృద్ధులందరు సరిదిద్దుకోలేనట్టి
తప్పుచేతురిట్లు తలను దూర్చి

నడిమి వయసులోనె నడత మారుచునుండు
మరుపు కలిగి మనదు మాట వినరు
చిన్నతనమునందు నిన్నెట్లు సాకిరో
అట్లెసాకి వారి నాదు కొనుడు

మల్లి మల్లి పెట్టు మనవాడు వాడైతె
కానివాడు అయితే కర్రు కాల్చు
మరల తిరిగిరాయు మనదు రాజ్యాంగము
ఎదురు చెప్పగలడ ఎవ్వడైన

చదువు సంధ్యలుంటె సంస్కారమలవడు
జ్ఞానమబ్బు పుస్తకంబు చదువ
చదువులున్న యిళ్లు సాహితీ లోగిళ్లు
సమత మమత సంతసాల గుళ్లు

తళుకుమని మెరిసెడి తలపుతటిల్లత
ఒడిసి పట్టుకొనును ఒద్దికగను
పిదప సమస్త కమ్ము పదసుధలనుయద్ద
పద్యరూపమొకటి పాడుకొనును

అన్యభాషలందు అసమాన ప్రతిభున్న
ఆహ ఓహొయంటు అనెదరంత
ఇంటి భాష వీడి యిల్లెక్కి కూయుట
ఇంగితంబు కాదు ఇంపు కాదు

పరమ పూజ్యమంద్రు పరులకై సాయంబు
పాప కార్యమంద్రు పరుల హింస
ఇదియె తెలుసుకుంటె వెదికి వేసారరు
పుడమినందు ఎవరు ముక్తికోరి

అన్నివేళలందు అదియె పనిగ చెప్తె
వింటు వింటు తుదకు విసిగిపోవు
మంచిమాట కూడ మనిషి కూత పదమౌ
వస్తవమ్ము గనక వంచనంద్రు

దానమాచరింప ధనమొక్కటే కాదు
తప్పకుండవలయు దానగుణము
ప్రమిదవత్తె గాదు ప్రచరింప వెలుగులు
తైల ముండవలయు తెలుసుకొనుము

రగులుతున్నదిపుడు రావణకాష్టము
రాజకీయ కాక రాష్ట్ర మంత
రాచకీయ మిపుడు రసవత్తరంబాయె
చట్టమిపుడు ఎవరి చుట్టమౌనొ

పృథ్వి శతకమందు హృద్యమౌభావాలు
ఒలుకుచుండె మధుర పలుకులౌతు
బహుళ రచనలందు బహుదపేరొందిన
శతకకర్త పృథ్వి నతులు గొనుడు

కలుగునట్టి ఎట్టి కష్టములైనను
కొన్నిసార్లు చేయునెన్నొమేళ్లు
పేడిరూపమొంది పెనువిపత్కాలాన
ఆదుకొనబడెగద ఆర్జునుండు

కర్మ చేయనపుడు కర్మఫలములేదు
కర్మఫలము లేక కాయమేది
కాయమందనపుడు కష్టసుఖములేవి
జ్ఞానులిట్లెచెప్పె కర్మ గూర్చి

అదుపునుంచవలయు ఆలోచనలపుంత
మనదు మాట వినదు మనసు సుంత
గుఱ్ఱమువలె దాన్ని గుంజి పట్టినయంత
చెప్పుచేతనుండి చేయునంత

హద్దుమీరనపుడు ఆనందమేయంత
కట్టుబాటునున్న కలుగు మేలు
గట్టు తెగిన చెఱువు గమనమాపగలదు
విచ్చలవిడితనము తెచ్చుముప్పు

పడనివారిపట్ల పగలు పెంచుకుంటె
రాజుకొనును నిప్పు రగులు సెగలు
సంయమముగ చల్లు సఖ్యతా చన్నీళ్లు
హితము గూరి సన్నిహితము పెరుగు

ఓటు వేసి మనము ఉన్నత పదవిచ్చి
ఉనికి నిచ్చినాము ఊతమిచ్చి
బాధనొందుటేలొ బోధపడకున్నది
వాడు ఓటు బ్రతుకు కీడు త్రుంచు

వచ్చుఫలితమేమి వ్యాసములను రాయ
కలుగు లాభమేమి కవితలల్ల
కాసులొచ్చుగాదె కథయొ నవలొరాస్తె
అన్నవారు భాషకాప్తులౌన

గూడుకట్టు కున్న గుండె లోపటి బాధ
చెప్పలేరు మనసు విప్పలేరు
వేదనలకె గాని వాదనలుండవు
ఎన్నొ జీవితాలు యింతెసుమ్ము

ముక్కు మూసుకుంటు మునులు గడిపె నాడు
ముక్తి కొరకు ఆత్మ శక్తి కొరకు
ముక్కుమూయకున్న ముప్పాయె గదనేడు
దూరముండకున్న దారి లేదు

వైద్యసేవలందు వన్నె కెక్కిరియెంతొ
ఎన్నదగిన రచనలెన్నొజేసి
కుప్పకుప్పలుగను గ్రుమ్మరించునుప్రేమ
కుప్పమాడు బిడ్డ గొప్పదనము

శ్రేయ మొందు చుండె రెండు రంగములందు
ప్రేమ జూపుచుండె పేదలందు
తల్లి పట్ల జూపు తనివి మరపురాదు
రాణ కెక్కివరలు రామలక్ష్మి

డాక్టరమ్మ గారు డాబు దర్పములేని
మమతల ముకురమ్ము మల్లెదండ
అమృతనము నందు అమ్మకే అమ్మైన
రామలక్ష్మి ఎదను రాగమేను

పునుకు పుచ్చుకొనియె గుణములు అమ్మవి
తల్లిపట్టుదలయు తనయ కబ్బె
దొడ్డ మనసు ఉన్న బిడ్డ రోజాప్రియ
పుత్తడమ్మ పునుగు అత్తరమ్మ

పాఠము చెబుటందు పాటవమును జూపి
పద్యములను చదువు హృద్యముగను
నచ్చి నట్లు చెప్పెనాటి గురువులంత
కష్టమనక చెప్పె ఇష్టపడుతు

అంతరిక్షమందు అడుగు వేయుశిరీష
బండ్లవారి ఆడపడుచువమ్మ
తెలుగు వెలుగు శిఖల తేజోమయూరమా
పిడుగురాళ్ల బిడ్డ పిడుగువమ్మ

ఘనతనొంది నట్టి గగన విహారిహో
మెట్టు మెట్టు నెక్కి మెరిసినట్టి
అంతరిక్షయాని అమెరికా విజ్ఞాని
అందుకొమ్మమాదు ఆశితులను

అర్థవంతముండి అందచందములుండి
పాడినపుడు మాటలాడినపుడు
సరళ సహజ సరస స్పష్టతా సభ్యతా
గోచరించవలెను గొంతు నుండి

నెట్టు మోజునపడి నేటి యువతరమ్ము
శ్రద్ధ పెట్టరైరి చదువులందు
రెంటికి చెడినట్టి రేవడౌతున్నారు
కానవలయు యువత కనులు తెరచి

మాటపొదుపు చేస్తె మనిషి కెంతొ మేలు
ధనము పొదుపు చేస్తె దక్కు హితము
జలము పొదుపు చేస్తె జగతికేమేలగు
పొదుపు చేస్తె అన్ని అదుపునుండు

మనకు నచ్చినట్లు మనము వుండగలేము
తగదు యియ్యదన్న తప్పు యిపుడు
వేయి మాటలేల విలువలన్నవి సున్న
మనదు బ్రతుకు యిపుడు మనది కాదు

తాలిబనులార తప్పుడు పనిమీది
హేయమైన చర్యహితముగాను
మీదు ప్రజను చంపి మీరొందు మేలేమి
తలచరేల సుంత తగదనంచు

నీతి వాఖ్యములను నిత్యమ్ము చెప్పుతూ
నియమనిష్ఠలు విడి నీతిమాలి
పాడుపనులు చేయు వారి గోత్రములను
చెప్పవలెను విప్పి తప్పకుండ

మానసికముగాను మంచి శక్తినిచ్చి
తృప్తి కలుగజేయు - యీ వ్యవస్త
కయిన వ్యక్తి కయిన క్రమశిక్షణొక్కటే
ఉండవలయు ఉన్న ఉచితమౌను

మంచిగుంటి కనుక మంచిగా మీరంత
ఉండవలయు నంటె ఉచితమవదు
నిన్ను తినను నేను నన్నుతినకు నీవు
అన్న సింహము తను మిన్నకుండ

చీమ శ్రమను జూచి శివుడు తనకు తాను
శ్రమ రమటులె కుక్క బ్రతుకునిచ్చె
మరల వాటికి తను మానవ జన్మిచ్చి
చేతులెత్తివేసె శివుడు పిదప

ఉందురొక్క ఇంట అందరూ అయినను
మాటలాడుకోరు మనసువిప్పి
స్వంత యింటినందె బయటివారముగాదె
చిత్రమిదియె "సెల్లు" చేతినుంటె

కోరుకున్నగాని కోరకున్నసుగాని
మార్పు వచ్చినంత ఓర్పు జూపి
మార్చుకోవలయును మనదు జీవనశైలి
ఏటికి ఎదురీత యీదతగదు

భక్తిభావమన్న బానిసత్వము గాదు
అంత రంగ మందు ఆత్మ తృప్తి
ఎంత భక్తి వున్న హేతవు కందని
మూఢభక్తి తెచ్చు ముప్పు చాల

బద్ధికుండనట్టి ఓర్మియు లేనట్టి
గాడి తప్పుబతుకు గతుకులేను
పొదుపుగుండు బ్రతుకు పొసగినుండునుగాదె
ఒడిదుడుకులు రావు ఒబ్బిదున్న

విధము చెడినవాడు విలువలు గోల్పోయి
అధముడౌతు బతుకు అన్నిటందు
సంపదించువాడె సర్వజ్ఞుడౌనిల
ఇంద్రుడతడు భువిన చంద్రుడతడు

ముంచవలెను అంటె ముందుగా నమ్మిస్తు
నదురు బెదురు లేనినటన జేసి
కోలుకోని దెబ్బ కొట్ట గల్గినవారె
నేటి కాలమందు మేటి దొరలు

బ్యాంకు పేరు మార్చ బాధపడుటతప్ప
లేదు ఎదురుచెప్పువాడు లేడు
ఆంధ్రులన్న వారు ఐక్యత లేనట్టి
వారలనెడి ముద్ర వ్యాప్తిగాంచె

మహినవచ్చి నట్టి మార్పు లెన్నైనను
మారలేదు భువిన మహిళ బ్రతుకు
అందురంతయామె ఆకాశసగమని
భద్రతేది మహిళ బయటకెళ్తె

ముద్దుచేస్తు బిడ్డ మురిపాలు దీరుస్తూ
కష్టనష్టములను కానకుండ
పెంచి పెద్ద చేస్తె కొంచెమైనను బిడ్డ
ఇంగితమ్ము లేక ఎదిగి గాదె

చిన్నతనమునందె చేతురుపెళ్లిల్లు
తగని వయసనంటు తలచరెవరు
చంకనుండు బిడ్డ సంవత్సరమ్ముకే
నరకప్రాయ మికను నారి బ్రతుకు

కర్షకుండు పడెడి కాయ కష్టంబంత
వాహినందు కురియు వానజల్లె
కోటకడెదమంటు మాటలాడెడివారె
గిట్టుబాటు ధరకు గింజ కొనరు

పద్దతంటు లేని పరిపాలనందున
చిన్న పనులు కూడ చిక్కుముడులె
ఎప్పుడేమి జరుగొ ఎవరేమి చేతురో
నిలకడుండనపుడు కలవరమ్మె

సాగినన్ని నాళ్లు సరిద్దుకోలేని
తప్పులెన్నొ చేసి తమలొతాము
కుళుకుతారు మొదట కుములుతారు పిదప
పలితమేమి చివర పరితపిస్తె

గొప్పవారు చెప్పుగొప్పమాటలు ఎన్నొ
ఒడిసి పట్టవచ్చు ఓపికున్న
మనదు తెలుగునందు మహనీయులెందరో
రాసి ఒలక బోసి రాశిబోసె

కుందనాల అమ్మ కుప్పము రెడ్డెమ్మ
కూతురన్న ఎంతొ కూర్మిగలది
మనిషి మార్గదమ్ము మనసు పరిమళమ్ము
మానవీయతున్న మహిళసుమ్ము

అమ్మనాన్నయౌతు అన్నిటా గురువౌతు
తనయ హృదయమందు స్థానమొంది
భయముభక్తి నేర్పి బ్రతుకురీతులు చెప్పి
అమృతనముకు తను అమ్మయేను

జీవితమ్మునిచ్చి జీవించడము మప్పి
తనయ భవితపట్ల తపన చెంది
ఆత్మగౌరవమ్ము అసలు ముఖ్యంబని
ధీరవనితమల్లె తీర్చిదిద్దె

పుట్టిగిట్టినావు మట్టిలో కలిసావు
మరకతమ్ము వమ్మ మానవతివె
నీదుబిడ్డకొరకు నిచ్చెనమెట్లైన
అమ్మనీదు చరిత అవసరమ్మె

అవసరమ్ము వుంద ఆడవారికి విద్య
అనెడి కాలమందు అయిదు చదివి
అవసరంబె చదువు అమ్మాయిలకు అన్న
దొడ్డదానివమ్మ రెడ్డియమ్మ

పల్లెచదువుచదివి పట్టుదలనుజూపి
లోకరీతులన్ని ఆకళించి
దాలిపొయ్యి మీది, పాలకుండగమల్లె
చవులు జూపె బిడ్డ చదువులందు

చదువు సంధ్యలందు సంస్కారమందున
ఆర్తినింపుకున్న అమ్మగాదె
ఆమె కోర్కెలన్ని ఆమె సుతనుగంటు
మురిసె రెడ్డియమ్మ ముదమునొంది

సంపదున్న చోట సద్గుణాలుండవు
సద్గుణాలు వుంటె సంపదుండు
జ్ఞానబుద్ధి కరుణ కలిగియుండు కలిమి
సంపదెపుడు సహజ సద్గుణాలె

అమ్మమాటవినరు ఆడపిళ్లలెవరు
చీదరింత్రు పనులు చెప్పినంత
తాను తల్లి కాగ తన తల్లి విలువను
తలతురపుడు అమ్మదైవమనుచు

కూలిపనులు చేసి కోట్లాధిపతులైన
వారలుండె గాదె వసుధ నందు
నమ్ముకొంటు శ్రమను సొమ్ము చేసుకొనిరి
చెమటచుక్క వారి సిరుల మొక్క

ఇచ్చిపుచ్చుకొనుటకేవారమైతేమి
తప్పుయని తలచుట ఒప్పుగాదు
హేతువుండవలయు నేపనిచేసినా
మూఢనమ్మకమ్ము వీడవలెను

ఎవరుచూడనపుడు ఎట్లు వర్తింతువో
అదియె గాదె నీదు అసలు గుణము
సర్వవేళలందు సభ్యత కూడుండి
మెలగువానికెపుడు విలువలుండు

దుష్టులు తమ తప్పు దుర్బుద్ధితో దాయు
మసలు తప్పు తెలిసి మంచివారు
సంకుచితముగుండు స్వార్థపరులు ఎంతొ
మమతలున్నవారు సమతపంచు

నిజము చెప్ప మనలో నీతుంటె చాలును
ఒప్పుకొంటె చాల గొప్ప-గుండె
స్థైర్యముండి ఎంతొ దమ్ముగావలయును
ఆత్మధైర్యముయును అంతకంటె

గెలుపుయంటె మనలొ కలిగెడానందాలె
కావు ఎపుడు కూడ కావు సుంత
గెలుపువలన కలుగు వెలుగులు అన్నియు
పరుల కనులయందు కురిసినపుడె

నేర్పుగలదెయెందు ఓర్పును మించెడి
సాధ నేమి వుంది శాంతి మించి
శాంతి ఓర్పులున్న సకలముండునుగాదె
ధరలొవరలు మూల ధనములవియె

వెళ్లరాదు ఎవరు పిలవని చోటుకు
వెళ్లి పొందరాదు వెతలునెపుడు
దక్షవాటికందు దాక్షాయిణొందెడి
దారుణము జరిగిన తీరు గనుడు

పరమజిడ్డుగాదె ప్రాయోజితమ్ములు
ఎంతరోతొ బూతుగెంతులన్ని
విషయముంద అందు విజ్ఞానమున్నదా
ఏవగింపు తప్ప ఏమి వుంది

పెళ్లి అయిన వాణ్ణి ప్రేమింతురిందున
రంకు కథలు లేద బొంకు కథలు
చూపు దృశ్యమేది చూడముచ్చటగాదు
ఆది అంతమేది లేదుగాదె

ఒక్కరాతినందె ఒనగూరదేదియూ
గద్దె అయిన బ్రతుకు వృద్ధి అయిన
కృషిని సల్పువాడె వృద్ధిగాంచునుండు
అండనున్న ప్రజలగుండెనుండు

కోటి విద్యలున్న గుణము విగుణమైతె
విలువ ఏమి విద్య ఫలముయేమి
గడ్డి పూలు యెంత కనుల కింపుగనున్న
పరిమళమ్ముచిందు విరులు యౌనె

ప్రజలకోసమెవరు పరితపించరు నేడు
పదవి కొరకె వారి ప్రాకులాట
ఓట్లు వేసుకొనెడి ఒడుపు తెలిసినాక
నిజముగపని యేమి ప్రజలతోడ

సాగరంబు వోలె సాహిత్యమెంతయో
చదువశక్తి వున్న చాలగలదు
తృష్ణవున్నకొలది తృప్తితీరగత్రాగ
వచ్చుగాదె - భాష భావజలధి

శివుని విల్లువిఱిచె శ్రీరామచంద్రుడు
పులకరించెనాడు పుడమియంత
ఇప్పుడైతె అట్లు ఎంత అలజడౌను
భక్తజనుల మధ్య వహ్నిరాజు

కులమునందు మిగుల గుణశేఖరుండువై
పేదసాదలందు ప్రేమజూపు
లక్ష్మిదేవి సుతుడలక్షాద్రి విభవుడా
అచ్చు పుస్తకాల ఆత్మసఖుడ

భయము గుప్పెటందు భావాలు స్వేచ్ఛగా
పూలవలెను విరగ బూయలేవు
చరిత వ్రాసినట్టి చేవ్రాలు లెన్నియో
చెరిగిపోవు కలగ చెదిరిపోవు

ఇచ్చెడి బహుమతులు ఎంత విలువగాని
ఇంపుగుండవలయు ఇచ్చు విధము
మెచ్చుకోలుకొరకొ ఇచ్చుకాలకొరకొ
గాక నీయవలయు కానుకెపుడు

అడిగినంతరావు అవకాశములుయేవి
వచ్చువాటినెపుడు వదలబోకు
అందిపుచ్చుకొనుటె అసలైన విజ్ఞత
ఆటలాడరాదు చేటు కలుగు

గౌరవించ తగదు కపటిని ఎన్నడు
తలను వంచరాదు తప్పుకెపుడు
కలిసి జీవనమ్ము కపటితో కూడదు
చెనటితోడ చేయు చెలిమిముప్పు

కూలి కూడ రాక కూరగాయలుయన్ని
పారబోయుచుండె పంటరైతు
అధిక ధరలుపెట్టి అంగట్లొ కొనలేక
గోడు నేడ్చుచుండె కొన్నవారు

కటిక చీకటందె కనిపించు తారలు
వెలుగునందు చూడ వీలు పడదు
కష్టకాలమందె స్పష్టమౌసత్యాలు
గట్టిపడును మనిషి కష్టమపుడె

ఎదుటివారియొక్క నుదుటి రాతను మార్చి
వారి బాధలు తన బాధలనుచు
బడుగుజీవులందు బాధ్యతుండెడివాడు
ఉండుగాదె ప్రజల గుండెనందు

చెప్పినట్టివన్ని శ్రీరంగనీతులు
చేయునట్టివన్ని చెఱుపు పనులు
మాటలమ్ము వాని మాయలో పడబోకు
సారముండదందు సద్దు తప్ప

మంచివారలయిన మాయగాళ్లయినను
భర్తలంతఒకటె భార్యలందు
ఎంతమంచివారొ అంత అర్థము కారు
భార్యలన్న వారు భార్యలేను

వయసు మల్లెనంత పసివారి వలె వారు
మెలగుతారు రోజు అలుగుతారు
కోపిగంచుకొనక కూర్మితో మాట్లాడు
చరమదశలొ వారు స్వాంతనొందు

సన్నగిల్లుచుండె శక్తిసామర్థ్యాలు
ఊత కర్ర తోడు నుండవలయు
చూపుమందగించు చులకన చూపులు
శ్రద్ధ చూపరెవరు వృద్ధులందు

ఆస్తిపాస్తులుండి ఆప్యాయతలులేక
కబురులాడువారు కనరు ఒకరు
ఊసుపోక ముదిమి ఊసురోమని యేడ్చు
కన్న వారి పట్ల కరుణజూపు

గురుతునుంచుకొనుడు గురువులనెప్పుడు
మొదటిపూజనియుడు పూజ్యగురువె
జ్ఞానమొసగుదాన కర్ణులు గురువులు
గౌరవించవలెను గర్వపడుతు

అందమన్నదుండు అన్నిటియందునా
కాంచగలిగినట్టి కన్నులుంటె
తరులు గిరులు విరులు ధరణిలో జనియించు
ప్రతిది యిచ్చుగాదె పరవశమ్ము

చేతిలోని డబ్బు చేయునెన్నొ పనులు
మంచి చెడులు ఎంచి మసలుకోదు
కొంత గర్వము మరికొంత అతిశయము
కలిగి - కన్ను మిన్ను కానదసలు

మింటితారమల్లె మీగడవారింట
విరయ బూసె వెలసె విరియతార
హేమసమము గాదె హేత్వి శ్రీహరి నీవు
సూర్యకిరణ వెలుగు సుతవు సుమ్ము

పది పదినిముషముల పడకవేయకున్న
దేహమొప్పదయ్య తిరిగి మరల
కొంత శక్తి వచ్చినంతనె కోల్కొందు
వయసు తెచ్చెనిట్టి వక్కరమ్ము

కోరుకొంటినెన్నొ కోడెవయసునందు
పొందలేదు పుణ్యభూమినందు
అయినబాధలేదు ఆదుకొనెడివారు
అండనుండె అదియె ఆత్మతృప్తి

పదవి కొరకు ఎపుడు ప్రాకులాడగలేదు
పెనుగులాటలేదు పేరు కొరకు
చిన్న ఆశ లేదు ఉన్న స్థాయిని మించి
తృప్తి నొందితెంతొ యిదియె చాలు

సహకరించమంటి సాహితీసేవకై
పుస్తకప్రియులార పూని కొంత
శతకమచ్చు కొరకు సాయమెంతిచ్చినా
పుస్తకంబునకది 'పూజదండె'

'వేకువ వీరులు!'

హేమంత మార్గశిరమాసంలో
ప్రకృతి వర్షించే వెండి మంచు పుప్పొడితో
చలి పులి పంజా విసురుతుంది!
బ్రతుకు పోరులో బడుగులు
మూడోజాము శ్రమ పొద్దుతో
వేగుచుక్కులై వర్ధిల్లే వీరులు!

ఎర్రటి నిప్పుల నెగళ్ల ఆసరాతో
వణికించే చలిని పాతరేస్తూ
వెచ్చని శ్వాసల ముచ్చట్లు పంచుకుంటారు!
చెట్ల సందుల్లోంచి విస్తరించే తొలి కిరణాలు
కొంకర్లు తిరిగే శరీరాలకు ప్రాణశక్తినిస్తాయి!
ఆరు ఋతువులందు జీవధారలై పారే
శ్రమ జీవుల చెమట చుక్కలు
ఏ సవాళ్లను సైతం ఖాతరు చేయక
భావి ప్రగతి రథ చక్రాలై ప్రభవిస్తాయి!

-వంగర పరమేశ్వరరావు
9491400534

విధి వంచిత...?

రెక్కలు విరిగిన ఓ పక్షి
వీధిలోని చెత్తకుప్పల్లో పడి
విలపిస్తుంది
దారం తెగిన ఓ గాలిపటం
చెట్లకింద బస్టాండుల్లో
రైల్వేప్లాట్ ఫారాల మీద
అర్థాకలితో
ఆదమరిచి నిద్రపోతుంది.

ఔను అర్థంలేని ఆకర్షణకులోనై
రగిలే కోర్కెలు ఆరని ఆశల
అగ్నిజ్వాలలు కొరడాలు
ఝుళిపిస్తే ఏమౌతుంది?
ఆవేశానికి అమాయకత్వానికి
అమృతనం అమ్ముడుపోతుంది.

నడివీధిలో మానవత్వం
నగ్నంగా నడుస్తే ఏమౌతుంది ?
మౌనంగా మాతృత్వం మరణిస్తుంది?

ఇల్లు వొదిలి ఒళ్ళు మరిచి
చీకట్లో చిందులేస్తే కామంతో
కళ్ళుపొరలు కమ్మితే ఏమౌతుంది ?

కడుపులో కాయకాస్తుంది
కెవ్వుమన్న కేక వినిపిస్తుంది
చీకటి చిరునవ్వు నవ్వుతుంది

విధి విషం చిమ్మితే ఏమౌతుంది ?
పుడమి పురుడు పోసుకుంటుంది
ఊరుపేరులేని ఓ పువ్వు పుడుతుంది

ఎవరో చేసిన పాపం పాశమై
విషసర్పమై అనకొండయై
చుట్టేసుకుంటే ఏమౌతుంది ?

అది ఓ అనాథ ఔతుంది
ఆకలికి అలమటించే
ఓ అస్థిపంజరమౌతుంది
కామం ఓ కారుచిచ్చు ఔతుంది
దానికో రక్తపుముద్ద బలౌతుంది

ఆవేశం ఆపుకోలేని ఓ ఇద్దరి పాపం
ఒక ప్రమిదను వెలిగిస్తే ఏమౌతుంది?
చెత్త కుప్ప కి మెత్తని పాన్పౌతుంది
చెత్త కుండీ ఓ ఊగని ఊయలౌతుంది
అది సుడిగుండంలో ఓ నావౌతుంది
అది సుడిగాలిలో ఒక దీపమౌతుంది

పాపం ఆ ప్రమిదే నిత్యం చెత్తకుండీలో
విసిరిన ఎంగిలి విస్తరాకుల్లో మెతుకులకోసం
కుక్కలతో కుస్తీపట్టే పందులుతో పోటీపడే
విధిపంజా విసిరిన
ఓ "విధివంచిత" ఔతుంది

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

ముగ్గురమ్మలు

అంతరిక్ష చిరునామా
సౌరమండల అంతరంగాన..
నవగ్రహ హితుల సరసన..
జీవులకే సమస్త రేవు తాజై..
అడగకుండానే గూడు..
గుడ్డ, కూడును వడ్డించే..
సుజల ఆమ్లజని ప్రదాత..
సర్వ ప్రాణులకే ధరణి అమ్మ..
పుణ్య పుడమేగా నా నేలతల్లి..
జీవులకే అమ్మ భూమాతే కదా !

నా జన్మకు చిరునామా..
బుడిబుడి అడుగుల వేదిక..
మాటలు నేర్పిన మాతృమూర్తి
నడక, నడతల్ని బోధిస్తూ..
చెట్టు, పుట్ట, గట్టు, పిట్టల్ని..
పరిచయం చేసిన నేస్తం..

ఆటపాటలకే ఆలవాలం..
చిరునవ్వులను పూయించే..
తల్లులకే ఆవాసమైన తల్లి..
నా జన్మభూమి, నా ఊరే అమ్మ !

నా ఉనికికే చిరునామా..
నవ మాసాలు మోసిన అమ్మ..
తన రక్తాన్ని ధారపోసి..
బిడ్డ కోసం తనను తానే మరిచి..
ప్రసవ వేదనకు సంతోషించి..
బొడ్డు పేగునే పంచి, తుంచి..
తొలి పలుకులు అడుగులు నేర్పి..
ప్రేమకు నిలువెత్తు రూపమై..
అమృతమే పంచిన ఆది దేవత
ప్రత్యామ్నాయమే లేని
నన్ను కన్నతల్లి !

-మధుపాళీ
9949700037

అమాయకపు గుట్టన్న కథలు

(పిల్లల హాస్య కథలు)

కుక్కపిల్ల

గుట్టన్న ఒకసారి ఒక చిన్న పిల్లవాడు మారాం చేయడం చూశాడు .వాడికి ఏం కావాలని అడిగాడు. వాడు తనకు కుక్కపిల్ల బొమ్మ కావాలని మారాం చేయసాగాడు. వెంటనే గుట్టన్న వాడి తల్లికి చెప్పి ఆ బాలుడిని చంకన ఎత్తుకొని బొమ్మల దుకాణానికి బయలుదేరాడు. అక్కడ ఆ దుకాణం యజమాని రకరకాల బొమ్మలను చూపించాడు. ఆ బాలుడు ఒక కుక్క పిల్ల బొమ్మను చేత పట్టుకున్నాడు. అప్పుడు ఆ దుకాణం యజమాని " ఓహో! అది కావాలా! ఈ కుక్క పిల్ల బొమ్మ ఖరీదు వంద రూపాయలు " అని చెప్పాడు. అప్పుడు గుట్టన్న "నా దగ్గర అంత డబ్బు లేదు. తర్వాత ఎవరినైనా సరే అడిగి ఇస్తానులే "అని ఆ దుకాణం యజమానితో చెప్పాడు. అప్పుడు అతడు" పొద్దున్నే ఎవరి ముఖం చూశానో! భలే బేరం దొరికింది .వెళ్ళు. వెళ్ళు" అని ఆ బాలుని చేతిలోని బొమ్మను లాక్కున్నాడు. ఆ బాలుడు తిరిగి ఏడవసాగాడు.

అప్పుడు గుట్టన్న వాడిని బుజ్జగించి "నీకు ఆ బొమ్మ ఏమిటి? నిజంగా కుక్క పిల్లనే ఇస్తాను పద! " అని అన్నాడు. ఆ బాలుడు ఏడుపు ఆపలేదు. అప్పుడు గుట్టన్నకు అక్కడ ఒంటరిగా వస్తున్న ఒక కుక్క పిల్ల కనిపించింది . వాడు ఆ కుక్క పిల్లని తన చంకన ఎత్తుకొని, మరో చంకలో ఈ బాలుని ఎత్తుకున్నాడు . ఇంతలో ఆ కుక్క పిల్లను చూసిన దాని తల్లి "భౌ, భౌ " మంటూ వాడి వెంబడి పడింది. గుట్టన్న ఆ పిల్ల వాడి ఇంటికి పరుగెత్తాడు. కుక్క వాడిని అందుకోసాగింది .అది కరుస్తుందేమోనన్న భయంతో కుక్కపిల్లను క్రింద వేసే బదులు ఆ చిన్న పిల్లవాడిని నేలపై ఎత్తి వేశాడు. వాడు తిరిగి ఏడవసాగాడు. అప్పుడే అక్కడికి వచ్చిన ఆ బాలుడి తల్లి వాడిని చీవాట్లు, శాపనార్థాలు పెట్టింది. ఆ కుక్క ను చూసి గుట్టన్న ఆవిడ శాపనార్థాలు పట్టించుకోకుండా ఆ కుక్క పిల్లను అలాగే చంకలో పెట్టుకొని పరిగెత్తాడు. మళ్లీ ఆ కుక్కమొరుగుతూ వాని వెంబడి పడింది. అప్పుడు గుట్టన్న " ఓహో! ఈ కుక్కపిల్ల కొరకే ఆ తల్లి వెంబడి పడుతుందని భావించి దాన్ని నెమ్మదిగా కింద వదిలి పెట్టాడు .ఆ కుక్క పిల్ల తల్లి వద్దకు పరుగెత్తింది .కుక్క భయానికి గుట్టన్న ఒక ఇంట్లో దూరాడు . వారు "ఏమైంది "అని అడుగగా జరిగిన విషయం చెప్పాడు .అది విని వారు నవ్వుకొని "నీ పెంపకం కుక్కనైతే ఫర్వాలేదు. కానీ వేరే దాని పిల్లను నీవు తీసుకొని వెళితే ఆ కుక్క నీ వెంబడి పడదా! ఆ పిల్లవాడికి బొమ్మ కొనివ్వాలి కానీ కుక్కపిల్లను ఇస్తానని అనడం , తగిన డబ్బు లేకుండా నీవు ఆ దుకాణానికి వెళ్లడం నీది తప్పు "అని అన్నారు. గుట్టన్న తనది పొరపాటైందని ఒప్పుకున్నాడు. ఆ కుక్క వెళ్ళిపోయిన తర్వాత వాడు ఇంటి దారి పట్టాడు.

-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

సాంప్రదాయానికి ఆధునికతకీ మధ్య వారధి

పుస్తక సమీక్ష



ఏ వ్యక్తి అయినా తన జీవితంలో కోరుకునేది ఏమిటి? అన్న ప్రశ్నకు- **'ఇల్లు ఇల్లాలు/ భర్త-పిల్లలు, సుఖ సంసారం'** అన్న జవాబు వస్తుంది. ఇవన్నీ భౌతిక సుఖ సదుపాయాలు. ఇవన్నీఉన్నా, మనసు మరే దో కావాలని వెంపర్లాడుతుంది. తన అస్తి త్వాన్ని కుటుంబం గౌరవించాలని ఆశపడుతుంది.

చిన్ననాటి నుండి సర్దుకుపోయే మనఃస్తత్వం గలది కార్తీక. ఎప్పటికప్పుడూ మనసుకు సర్దిచెప్పుకుంటూ, రేపటి మీద ఆశలు పెట్టుకుని జీవించే ఆమెలో భావుకత ఎక్కువ. సున్నితమైన మనస్తత్వం గలది. తన వంతు ఇంటి పనులు కూడా అక్క కార్తీకతో చేయించుకునేది. ఆమె ఇష్టా ఇష్టాలతో పనిలేకుండా బ్యాంకు ఆఫీసర్ భరద్వాజ్‌తో పెళ్ళిచేస్తారు. ఉత్తర భారత దేశం చండీఘర్‌కు కాపరానికి వెళ్తుంది. తెలియని భాష, కొత్త ఊరు. కొత్త పరి

పుస్తక సమీక్ష

పద్య రత్న మంజూష

ప్రాణము లున్నంత వరకు
వేణువుగా తెలుగు పద్య విభవమునెల్లన్
గానము చేసిన నిదుడని
పూని కపిలవాయి లింగమూర్తిని గొలుతున్



అన్నాడొక కవి, డా॥ కపిలవాయి లింగమూర్తి (1928-2018)గారిని ప్రస్తుతిస్తూ అనేక స్థల చరిత్రలు, ఆలయాల పుట్టు పూర్వోత్తరాలు, ప్రభంద కావ్యాల్లోని పద్య వైభవం తెలుగు సాహిత్యానికందించిన మహా పురుషుడు, తెలంగాణా ఏర్పడిన అనంతరం డాక్టరేటు పట్టా అందుకున్న తొలి సాహితీవేత్త. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు అంటే అది అతిశయోక్తి కాదు.లింగమూర్తిగారు తరచుగా సందర్భోచితంగా, ఛందస్సహిత పద్యాలు, స్వేచ్ఛా గేయాలు, పాటలు, పద్యాలు చెప్పేవారు. లోగడ కొన్ని 'ప్రబోధవటహం'' అన్న పేరుతో ప్రచురించబడ్డాయి. మరికొన్ని "పద్యపేటిక" శీర్షికతో ఇప్పుడు మన ముందుకు వారి తనయుడు కపిలవాయి అశోక్ బాబు తెస్తున్నారు. ప్రస్తుత గ్రంథంలో 211 అధ్యాయాలున్నాయి. ఒక్కో అధ్యాయం లో ఒక పద్యం నుండి, కొన్నింటిలో 20-25 వరకు పద్యాలున్నాయి. పండిత పామరు లకు అర్థం కావలెనని కాబోలు సరళమైన భాషనుపయోగించారు. పూర్వం తిరుపతి వేంకట కవులు రసిక ప్రముఖుల సందర్భించిన సందర్భాల్లో ఆశువుగా కవితలల్లెడివారు తర్వాతి కాలంలో "నానా రాజ సందర్శనం" అన్న పేరున సంపుటీకరించారు. లింగమూర్తి గారి ఈ పద్య పేటిక ఈ కోవకు చెందిన దనవచ్చును. వీరి ఛందస్సహిత, రహిత పద్యాలు చక్కని పద బంధాలతో, ధారశుద్ధితో శబ్దసిద్ధితో అర్థవంతంగా కర్ణపేయంగా ఉంటాయి.

కపిలవాయిగారి ఈ పద్యరత్న పేటికలోని పద్యాలను మూడు భాగాలుగా విభజించుకోవచ్చును. 1. వివిధ వ్యక్తులకు సంబంధించినవి, 2) వివిధ స్థలాలకు సంబంధించినవి 3) వివిధ అంశాలకు సంబంధించినవి. ప్రతి యేడు వచ్చే ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆ సంవత్సర ప్రశస్తి విశిష్టత వ్రాయటం లింగమూర్తిగారు మొదలిడినారు. కాని ప్రభవతో మొదలిడి దుందుబి వరకే (14 సంవత్సరములు) వ్రాయగలిగారు.బి.ఆర్. అంబేద్కర్ బూర్గుల రామకృష్ణారావు, సి.పి. బ్రౌను లాంటి ప్రముఖులతో మొదలిడీ మల్లురని, అయాచితం శ్రీధర్ లాంటి సమకాలిక వ్యక్తులు, తెలంగాణ పాలమూరు అచ్చంపేట జినుకుంట (లింగమూర్తి గారి స్వగ్రామం) సరికొండ, కలువకుర్తిలాంటి వివిధ స్థలాల ప్రశస్తి, మరియు రామా యణం, భగవద్గీత తెలుగుబిడ్డ రేడియో, టి.వి. సెల్ స్ట్రీ, సంక్రాంతి పండగలాంటి General Topics కూడా వీరి దృష్టిదాటి పోలేదు.

ఇవన్నీ సమకాలీన పరిస్థితులకు స్పందన, సమకాలీన సాంఘిక చరిత్రకు అద్దం పడతాయనటంలో సందేహం లేదు.

పద్యపేటిక వైభవం: నాటి సాంప్రదాయ కవులవలె లింగమూర్తిగారు కూడా సంపుటిలోని మొదటి 12 అధ్యాయాలను సరస్వతి, శ్రీవాణి, వెంకటేశ్వర భూదేవి గణపతి, షిర్డిసాయి, పర్తిసాయి వంటి దేవతల స్తుతించారు. ఆ తర్వాత 'పాలమూరు పూర్వ కవిస్తుతి,కవిస్తుతి, తలిదండ్రుడులు గురువులు ఆచార్యులుపై పద్యాలల్లారు. రామాయణ, భగవద్గీతల అనంతరం పలువురు ప్రముఖులు, కవి సమ్మేళన గోష్ఠి వివరణలు కావ్యీకరించారు. అత్త(శ్రీలక్ష్మి) కోదండ్ర (సరస్వతి) సంవాదము (పరిహాసము), 'కోడలా! ఏమిటే వీడవు పతినెందు/ నిలకడ లేకుండ నిలువ లేక/ బ్రహ్మ నాలుక మీదనే యాడునది సరస్వతి) అన్న లక్ష్మీదేవి యాక్షేపణకు కోడలు సరస్వతి బదులు "మగని నెదపై నెక్కుమొగము లేక" (విష్ణు వక్షఃస్థల విహారి లక్ష్మియని సరస్వతి దెప్పుపోటు) సకల దైవతముల సర్వస్వరూపంబు'' (పే.14) అని షిర్డిసాయిని సంబోధిస్తారు (హిందువులు ముసల్మానులు సాయిని ఆరాధిస్తారు) (పే.14) మానవులై పుట్టిన వారికి మహిమలుండవని ''మానవుడై మహిమలుండవటన్న/ మాటను గాదని పాటిజూప" (పే.16) అంటారు పుట్టపర్తి సత్యసాయిని సంబోధిస్తూ..

తన స్వగ్రామము జినుకుంట గూర్చి ''మా ఊరు'' (పే.40)లో కచ్చు గోడలెగాని (మట్టిగోడలు) గచ్చుగోడలు లేవు (గచ్చు సున్నము డంగు, లేదా సిమెంటు) కలవారి మేడలు గానరావు/ / ఇంకాపప్పులు పుట్నాల పాత కొట్లేగాని/ ఫ్యాషను షాపుల ఆశలేదు" అంటారు సీస పద్యంలో.

ఇక సంపుటికే మకుటాయ మాన మనదగ ''నేను'' (పే.54)లో ''నీ॥ దేశమన్నపుడే భారతీయుండ/ నాంధ్రాధిబేధంబు లాపిదపనె" అని దేశాభిమానము చాటు ఆదర్శ పౌరుడిగా, తెలుగువాడు ఋగ్వేదమంత ప్రాచీనుడనని ప్రకటించుతారు డా॥లింగమూర్తిగారు.

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి గురించి వ్రాస్తూ "శుద్ధ శ్రోత్రియునట్లు చూడ నొప్పుగు రూపు/ మతములన్నిటియందుమమత చూపు!!" (పే.86) రమణాచారి గారి ఆహార్యం, పాతబస్తీలో మత సహిష్ణుతకు సామరస్యానికి రమణగారి కృషి వివరించారు. అశ్విని భరణివంటి నక్షత్రాలతో ఆరుద్రను ప్రస్తుతించారు (పే.143). పాలెం గ్రామపు ప్రధానాచార్యులు తెలకపల్లి విశ్వనాథశర్మ గురించి వ్రాసిన పద్య సముదాయము ప్రతి చరణంలోను శర్మగారి పేరులో ఒక్కో అక్ష రం వచ్చేట్లుగా వివరించటం లింగమూర్తి గారికి భాషపై ఉన్న 'పట్టు'కు తార్కాణం, సమయోచితంగా ఇంగ్లీషు పదాలను కూడా వీరు వాడటం హృదయ వైశాల్యానికి వివరణ. జన బాహుళ్యంలోని పదాలు వాడుకయేగాని, అనవసర ఛాందసానికి స్వస్తి పలికిన మేధాశాతి.

చివరగా వీరి పద్య విశేషాలను వారి మాటల్లోనే "ఏదో ఒక విశేషం అంటే అలంకారం కావచ్చు. శబ్ద చిత్రం కావచ్చు అర్థచిత్రం కావచ్చు. చెణుకు కావచ్చు. లేదా యతి ప్రాసల విశేషమో వృత్త విశేషమో, వస్తు క్రమమో ఏదో ఒక ప్రత్యేకత చూపుతూ వ్రాసిన పద్య రత్నాలివి! పద్య పేటిక అన్న సాధారణ మందసం కాదిది! పద్య రత్నాలు భద్ర పరచిన మంజూషమిది.

ప్రతులకు:కపిలవాయి సాయి శరణ్య
హైదరాబాద్-500 044.
సెల్: 8790727772 మరియు
అన్ని ప్రముఖ
పుస్తక కేంద్రాలు..

- కూర చిదంబరం
సెల్: 8639335675

పరిశోధనా పత్ర కవితా ఖండిక

ఇదొక అద్భుత విజయం!
ఎన్నాళ్ల నుంచో మనందరం
ఎదురు చూస్తున్న పరిశోధన!!

ఇది ఐదు వందల సంవత్సరాల
గ్రహాంతర మానవుల చరిత్ర!

అనగనగా ఒక భూగోళ గ్రహం
అందులో ప్రాణ వాయువుని ప్రసాదించ
పచ్చని చెట్లు..
తివాచీలా పరిచిన పచ్చని
కనుదోయ పచ్చిక బయళ్లు..
వివిధ రకాల అమృత రుచుల
రస ఫలాలను చేతికి అందించే
చెట్లమ్మల అనురాగ దీవెనలు!

పోషకాహార పంట సిరులతో
మానవుల ఆకలి తీర్చే
పంట పొలాల ఆదరణ
ప్రాంగణాల సముదాయాలు!

జీవుల దాహార్తిని తీర్చడానికి
ఉరుకులు పరుగులు పెట్టే
జీవ నదీనదాల సోయగాల పరవళ్ళు!

తమ కుహూ నాదాల స్వరార్చనతో
భూపాలరాగ స్వర జతులతో
నిత్యం ప్రకృతి మాతను మేలుకొలుపే
పక్షుల ఆనంద కేళీ విన్యాస
సుప్రభాత సూర్యోదయాలు!

ఈ అమూల్య భోగాలను
అనుభవించడం కోసం
భగవంతునిచే సృజింపబడిన
మానవ చైతన్య స్వరూపాలు!

భగవత్ ప్రసాదిత
చతుర్వేద వేద వాఙ్మయం
రుషి ప్రోక్త మంత్ర
సంహిత బీజాక్షర జ్ఞాన సంపద
ఎందరెందరో ఘన చరితుల
మానవ కళ్యాణ సంరంభ
సమిధికోత్సవాలతో
అలలారిన పుడమి కథనం
చర్విత చరణ కాంతోదయం!

క్రమేణా నానాటికి విస్తరించిన
జనాభా పెరుగుదల
మానవ పురోగతికి
పెను శాపమై పరిణమించింది!
సుఖమయ జీవనం కోసం
మె?దలైన మానవ ప్రయత్నాలు
ఎన్నో అఖండ విజయాలు
చేకూర్చి స్వాగతించాయి!
విజయ పరంపర గర్వంతో
పరుగులెత్తిన మానవుని దురాశ
కాలుష్య కోరలకు చిక్కి
హాహాకారాలు చేసింది!
కలుషితమైన గాలి, నీరు
ఆయుష్షును హరించాయి!
పచ్చని పంట పొలాలు
అధిక రాబడి కోసం
మానవులు పన్నిన ఉచ్చులో
గిలగిలాడాయి!
కార్లు, కర్మాగారాలు, ఎ.సీలు
విసర్జించే విషతుల్య ఉద్గార
చక్రబంధంలో
మానవ ఆనంద జీవితాలు మసిబారాయి!

క్షణం..క్షణం పెరిగిన
అధిక భూ ఉష్ణోగ్రతలు
ప్రకృతి సమతౌల్యతకు
గొడ్డలి పెట్టులా పరిణమించాయి!

కపటం, కుట్ర, మోసం, వంచనలతో
మితిమీరిన ధనదాహంతో
నీతి తప్పి, నైతికతను పోగొట్టుకున్న
మానవ మనుగడ
ప్రమాద గాటిన పడింది

కొత్తగా పుట్టుకొచ్చిన పలు రోగాలు
మానవల పీకను పట్టుకొని
ప్రాణాంతకమయ్యాయి!

మానవ మేధస్సుకు అందని
పలు విషయాలు
పరిశోధనలకే పెను సవాలు విసిరి
మీసం దువ్వాయి!
మానవుల ఉనికిని ప్రశ్నార్థకం చేశాయి!

అధిక ఉష్ణోగ్రతల బారిన పడిన
సమస్త జీవరాసులు
దిక్కు తోచక దారులు వెతికాయి!
మంచు ధృవాలు కరిగి
సముద్ర మట్టాలు పెరిగి
జల ప్రళయానికి దారి తీసాయి!

చుట్టూ కమ్ముకొచ్చిన ప్రాణాంతక పరిస్థితులు
తను కూర్చున్న కొమ్మను
తనే నరుక్కున్న చెందాన
మానవ మనుగడ చరితకు
మంగళం పాడాయి!

సమస్త భూగోళం జలప్రళయంలో మునిగి
నీళ్లపై తేలియాడింది!



-వంగర. పరమేశ్వరరావు
9491400534

గజల్...ఎటువైపో

చిరునామే తెలియకుండ మా అడుగులు ఎటువైపో
పాలకునికి శిరసువంచి మా పరుగులు ఎటువైపో

ఉరుములేని పిడుగేదో తలపైనే పడిపోయెను
కాలుతున్న కలలతోడ ఈ బతుకులు ఎటువైపో

జాలిలేని రాతిగుండె శాసనమే రాసెనిపుడు
నలుగుతున్న మనుషులమై మా మనసులు ఎటువైపో

స్థానికతను కాలరాసి సంద్రంలో ముంచేసెను
దిక్కెరుగని గమనంలో మా ఉరుకులు ఎటువైపో

మాటకారి పాలనలో చేదుమిగిలె ఓస్వప్నా...!
ఆవిరైన ఆశలతో ఈ మలుపులు ఎటువైపో

-స్వప్నకృష్ణ
9440536669

వెలుగులు విరజిమ్మే దివ్వెలమౌదాం

పాత సంవత్సరానికి వీడ్కోలు
కొత్త సంవత్సరానికి స్వాగతం
కొంగొత్త ఆశలతో
ఆకాంక్షల లతో
సుఖ సంతోషాలతో
శాంతి సౌభాగ్యాలతో
ఆత్మీయత అనురాగంతో
ఆప్యాయత అభిమానంతో
ఆదరణ ఆనందంతో
భందాలు అనుబంధాలతో
ఆర్థత సౌహార్థతతో
సహకారం సమన్వయంతో
సహనం సంఘీభావంతో
సమత మమత సమైక్యతతో
సామరస్యత మానవీయత
పరిమళాల భరిత భవిత కు
భద్రతకునూతన వత్సరం బాట కావాలి
కుళ్ళు కుట్రల కుతంత్రాల
కుయుక్తుల ఆట కట్టాలి
పగలు పంతాలు కల్మషం కాఠిన్యం
కలహాల కట్టడితోఅగ్రవాదం ఉగ్రవాదం
ఉన్మాధం అంతరించి
స్వచ్ఛ భారత్ స్వయం
సమృద్ధ స్వాభిమాన భారత్ అవతరించాలి
కరోనాను ఎదుర్కొనే మనోధైర్యం
మానవాళికి కావాలి
ఆయుధం సంపూర్ణ ఆరోగ్యం ఆనందంతో
మనోల్లాసంతో మానవమనుగడ సాధిద్దాం
సమాజములో ఆశావహ వెలుగులు
విరజిమ్మే దివ్వెలమైదాం

-నేదునూరి కనకయ్య
9440245771

కాలాన్ని శాసిస్తావు

విజ్ఞానపు చెట్టుకు నమ్మకపు నిమ్మకాయను
వేలాడదీసిన మన సాంప్రదాయం
మూఢనమ్మకాల కొలిమిలో
శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానాన్ని
తగులబెట్టి పదును పెంచుకుంటుంది.

గోలీ గొట్టాలను
ప్రయోగ పాలీలను పాతిపెట్టి
నిద్రలేని రాత్రుల పరిశోధనను
అపహస్యం చేస్తూ...
అడుగడుగునా ముళ్ళకంపలా
విస్తరింపజేస్తున్నాయి.
బుల్లితెరలు భయంకరంగా
జీవిత కమతాన్ని నాశనంచేయ

నమ్మకం నాటుకున్న ఆత్మ విశ్వాసాన్ని
ఏపుగా పెంచి పెద్ద చెయ్యాలి
కానీ ముందరి కాళ్ళకు బంధనంగా మారే
మూఢాచారం కారాదు
నీ పై నీకు నమ్మకం ఉంటే
విశ్వవిజేతవుతావు...
మూఢ విశ్వాసాన్ని అల్లుకుంటే
సమస్యల చట్రంలో నలిగిపోతావు.
మంత్రించిన తాయెత్తును నమ్ముకుంటే
బానిస కొమ్ముకు వేలాడుతావు
బలిపీఠమెక్కిన
మూగజీవిలా విలవిలలాడుతావు
తెలివిని వంతెన కట్టి...
కష్టాన్ని నమ్ముకుంటే కాలాన్ని శాసిస్తావు
అంధకారమైన జీవితాలకు
వెలుగు బాటిల్ని పరుస్తావు.

-శ్రీతరం
7893613015

సరదా సరదా

చిలుకా చిలుకా ఏవూరూ?
చిక్కడపల్లీ మావూరోయ్!
చిలుకా చిలుకా నీ పేరోయ్?
చిట్టీ తల్లీ నా పేరోయ్!
ఇక్కడికెనీదూ కొచ్చావూ?
తియ్యని పండ్లు తింటానోయ్!
నీతో వచ్చిన వారేవరోయ్?
ప్రాణమైన మిత్రులేనోయ్!

నెమలీ నెమలీ ఏవూరూ?
నీలగిరి కొండలు మావూరోయ్!
ఇక్కడి కెందుకొచ్చావోయ్?
నాట్య మాడేటనీదూకోయ్!
కోయిల కోయిల ఏవూరూ?
కాంచీపురము మావూరోయ్!
ఇక్కడి కెనీదుకొచ్చావోయ్?
కమ్మని పాటలు పాడెదనోయ్!

హంసా హంసా ఏవూరూ?
హంసలు దీవీ మావూరోయ్!
నీ మనసులో ఏముందోయ్?
బయటాలోపల నిర్మలమోయ్!

-పోతుల
చైతన్యభారతి
7013264464

ఖలీల్ జిబ్రాన్ తత్త్వదర్శనం-డా॥గండ్ర లక్ష్మణరావు రచించిన

'వెర్రి మానవుడు'

అత్యంత సులభమైన మాటలలో, తేలికైన సంఘటనలు తీసుకొని, తాత్వికార్థాలను అందించే, తత్తవేత్త, కవి ఖలీల్ జిబ్రాన్ చిన్న కథలు, కవితలు డా॥ గండ్ర లక్ష్మణరావు ఆంగ్లానువాదం 'వెర్రి మానవుడు'గా తెలుగు చదువరులకు అందించారు. జిబ్రాన్ పెయింటింగ్ ముఖ చిత్రంతో వెలువడిన ఈ పుస్తకంలో 34 కథానుభూతి చిత్ర నిర్వచనాలున్నాయి. మానవ మనస్తత్వాలు, భావనలు పైకి సామాన్యంగా కనిపింపచేసి తాత్త్విక అంతరార్థాన్ని ఇమిడింపచేయటంలో ఖలీల్ జిబ్రాన్, లోలోతుల గాఢ చింతన, ప్రతి రచనలో వ్యక్తం అవుతోంది. మానవునికి వెర్రితనంలోనే, స్వేచ్ఛతో కూడిన ఏకాంతం లభ్యం అవుతుంది. అప్పుడే తనలో వున్న ఏ బంధం నుండో విముక్తి పొందినట్టు అనిపిస్తుంది. 'వెర్రిమానవుడు' తొలి కథనంలో దైవ విశ్వాసంలేని మానవ పరిణామ దశ, వర్తమానంలోని ద్వైదీభావన తాత్త్వికత ఆలోచనగా, స్వేచ్ఛతో కూడిన జీవన నిర్వచనం ధ్వనిస్తుంది. మనిషికీ, మనసుకీ, మనిషికీ లోకానికి నిక్షిప్తమైవున్న అంతరాంతర తాత్త్విక కవితా కల్పనాత్మకత ఈ పుస్తకంలో ప్రతీ కథనంలో ఆవిష్కరింపబడింది. 'నా మిత్రుడు'లో, తన వెర్రితనం ఆచ్ఛాదనంగా, ఏకాంతంలో వుంటూనే మానవుడు అన్నింటికీ అతీతంగా వుండేభావన దర్శింపచేస్తాడు. 'మూడు చీమలు'లో జ్ఞానాన్వేషణలోని అజ్ఞానాన్ని హెచ్చరించాడు. జిబ్రాన్ దర్శించిన లోతులను అర్థం చేసుకొని, డా॥ గండ్ర లక్ష్మణరావు గాఢమైన చింతనకు సులభశైలిలో ఊపిరి యివ్వటంలో ప్రతిభావంతమైన అనువాదం సృష్టించారు.



ప్రతులకు: డా॥గండ్ర లక్ష్మణరావు
10-3-537. వివేకానందపురి
కరీంనగర్-505 001.
సెల్: 98493 28036

-జయసూర్య
సెల్: 9440664610

ఈనాటి నవయువతరం

బ్రతుకు విలువ తెలియని నేటితరం
చిన్న కారణానికి
ఊపిరి వదిలేస్తున్న యువతరం
మితిమీరిన ఆశలతో
అడ్డదారులకు ఆహ్వానం
సమస్యను ఎదుర్కోలేని పిరికితనం
ఓటమిని ఓర్వలేని మనస్తత్వం!
తల్లిదండ్రుల మాట వినని తపస్వీలు..
వేగానికే పాఠాలు చెబుతున్న పండితులు..
పనికిమాలిన సహవాసాల సంగమాలు..
విదేశీ కల్చర్ కు "wel-come" చెప్పిన
వివేకులు మత్తు పదార్థాలకు
బానిసలుగా మారిన అమాయకులు..
నేటి నవయువకెరటాలు!
అనుబంధాలకు అడ్డుకట్టలు వేస్తున్నారు
అనురాగాలను ఆదమరుస్తున్నారు
ఆనందాలకు దూరమవుతున్నారు
ఆప్యాయతలను మరిచిపోతున్నారు
అయినా వాళ్లని దూరం పెడుతున్నారు
అంతర్జాలంలో అంతర్లీనమైపోతున్నారు
నేటి నవయువకెరటాలు!
ఓ.. నవయువతరమా.....
ఇకనైనా మేలుకో.....
నీ శక్తిని తెలుసుకో....
మంచేదో -చెడేదో యోచించి మసులుకో..!
ఇది రంగుల లోకమని మరువబోకు..
నీ బంగారు భవితను రాలిపోనీయకు..!
వివేకుడు ఇచ్చిన స్ఫూర్తితో...
కలాం కలలుకన్న నవసమాజాన్ని నిర్మించే
దిశగా,
ఆకాశమే నీ హద్దుగా,
అభివృద్ధియే నీ బాటగా,
అన్యాయాన్ని ఎదిరించేదిగా,
అవినీతిని అణచి వేయగా,
తల్లిదండ్రుల ఆశలు తీర్చగా,
విశ్వంలో దేశ ఖ్యాతిని చాటగా,
మాతృభూమి రుణం తీర్చగా,
సైన్యంలా ముందుకు సాగాలి..
నేటి యువతరం..
మన దేశ ఈనాటి
"నవయువతరం"!!!

-నందిని గోపు
6302398650

చివరి అంకం !!

మృత్యువు ముంగిటకు
చేరిన దేహయాత్ర..
క్షణక్షణం సందేహమై
కొనసాగిన జీవయాత్ర..!!

బాధ్యతల బరువులు మోసి
అలసిన బతుకుయాత్ర..
తన వారికి భారమై
ఆగిపోయే చివరియాత్ర..!!
జ్ఞాపకాల భారాల
మోతలతో మూలనపడిన మనసు..
కాలం చేసిన మాయలతో గాయాలతో
ముడతలు పడిపోయిన దేహం..!!

పేగుముడి విప్పుకొని
మృత్యుఒడి చేరేవరకూ..
మోసింది ఏముంది..?!
కంటతడి తప్ప..!!

కంటి పాపలే కంటిలో నలుసులై..
కని పెంచిన ప్రాణాలే
గుండెకోత కోసేస్తుంటే..

'నా' అనుకున్న వారు
'నా' బలం అని నమ్మినవారు
ఎదురు చూపులే మిగిల్చినపుడు..

వేదనలు చెప్పలేక..
ఎదలో దాచుకోలేక..

వెలుగులేక.. ఆరిపోలేక..
ఎదురుచూస్తూనే ఉంది..

చివరి అంకంలో మిణుకుమిణుకుమంటూ..
కొడిగట్టిన దీపంలా
వృద్ధాప్యం..!!!

-పేరిశెట్టి బాబు
9247170800

దుఖ్ఖం పూసిన పూట

సంసారం సుట్టు కన్నీటిబొట్లు
గుచ్చి గుచ్చి పొడ్చుతుంటే
దాని మర్మం బోధపడక
మన్సును ఈతసాప జేసి అల్లినా
తల్లకిందులైన రూపమే దర్శనం.

కండ్ల చెలిమెల కొనలపొంటి
రాలుతున్న చిన్ని సందమామలు
బాధలను బరువులను మోయలేక
ఒక్కొక్కటి లోపలి పేగును తెంచుకొని
భూమి మీదవడి
గోడు ఎల్లవోస్తుంటే
బీడు మన్సులు కరిగిన
కాలం కండ్లుతెరుస్తలేదు.

నేనోడిపోతున్న ప్రతిసారి
నాకంటే ముందే
రూపంలేని మన్సు
రెండు కన్నీటి సుక్కలను
రేపటిపొద్దుమీద వాగ్దానం జేస్తది.

సుట్టు సమస్తలోకమున్న
అంతుతెలియని లోకంలో
ఆరడుగుల నీడ
అంతులేని దుఖ్ఖంతో
కుమ్మక్కై కులికొస్తది.

ఎన్నితీర్ల ఎదలోతులోకి తొంగిజూసిన
మన్సు తుక్డలు తుక్డలుగా తెగి
రంపపు పొట్టె రాలుతున్న దృశ్యమే
కనిపించకుండ కాలిపోతుంది.

గియ్యాల గీ దుఖ్ఖాన్ని
ఎల్లని సంసారాన్ని గుంజుకపోతెనే
గుండెకు ధైర్నమొస్తది
బాధలలోను బంధాలను కల్సుకపోతెనే
సాటోళ్ళ ప్రేమకు సోటుంటది
అద్దమరాతిరి
మాటలను అరచేతిలో పట్టుకొని
కష్టమిచ్చిన కమ్మని కవనాన్ని ఎత్తుకొని
వేకువపొద్దుమీద
మౌనాన్ని ఆరని తడిగా
సంతకంగా జేస్తున్న
దుఖ్ఖంమూటను
ఈ పూటకు
దించుకుంటూ

- బోల యాదయ్య
9912206427

చుట్టాల్లో మందగించిన చూపు

ఏదైనా బంధం ఉంటే బంధువులు
కొద్దిగా దూరమౌతున్నా కొద్దీ
వేలు విడిచిన కాలు మోపనీ
బంధువులు,బంధుత్వాలు
ఏమి తెలియని వారు చుట్టూ
తిరుగుతూ చుట్టి వచ్చేవారు
చుట్టరికమే బంధుత్వంగా మారుతుంది
ఇంటికి పిల్లను ఇచ్చో
పిల్లను తెచ్చుకునో
పూర్వకాలంలో
దూర ప్రయాణం చేస్తూ వస్తారని
భోజనవేళలో ఎదురు చూపులు
ప్రేమతో ఆదరణ
నవీన ఉరుకుల పరుగుల జీవితంలో
తల్లిదండ్రులకే దిక్కు మొక్కు లేని దీనస్థితి
చుట్టపు చూపులు లేవు
చుట్టాలు కరువు
పకోళ్ల పలకరింపులు బరువు
పెళ్లి పేరంటాల తీరుబాటు కొరత
విందు సమయానికి హాలు నిండు
ఇదీ నేటి స్వార్థ పూరిత స్థితి
అంటిముట్టని నామాల కాకుల దుస్థితి
మాటలు కరువు పరువు కొరకు పరుగు
చుట్టపక్కాల దూరం నెట్
బహుళ అంతస్థుల బతుకులు
ఊర్లే పట్టణాలుఅత్యాధునిక సౌకర్యాలు
దూరమైన ప్రేమలు
ఎంతెంత దూరం అందనంత దూరం
నీకు నాకు సమానం
నువ్వెవరో నేనెవరో

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

పల్లవిస్తూనే ఉంటా...!

పయనం ప్రారంభమై చాలా కాలమైంది!
తీరమే కనిపించడం లేదు!
ఈ దారేమీ సమంగా లేదు !
ఎత్తు పల్లాలూ... రాళ్ళూ,ముళ్ళూ...
అక్కడక్కడా పూలు లేవని కాదు!
విరుల సౌరభాలను ఆఘ్రాణించేలోగా
తడిమే సమస్యల తుఫానులెన్నో...!
ఎడారి దారుల్లో
ఎదురయ్యే ఎండమావులు...
నిరాశాపాతంలోకి నెట్టేస్తూ...
కాసింత నిండు శ్వాస...
నన్ను ముందుకు సాగమంటూ...
పచ్చని నాగజెముడు తోటలో గుచ్చే ముళ్ళు
నన్నీ క్షణకాలమైనా
నవ్వుల పువ్వుల రాల్చనీయవు!
కష్టాలూ... కన్నీళ్ళూ...
వంతులవారీ రాకపోకలు సాగిస్తున్నా...
అప్పుడప్పుడూ ఓ చల్లని
పిల్లతెమ్మర నన్ను హత్తుకుని
నన్ను సంతోష సంద్రాన్ని చేస్తుంటుంది!
సవాళ్ళు నను సుడిగుండంలోకి తోసేసినా...
నే చెరగని ఆత్మవిశ్వాసాన్నై
పల్లవిస్తూనే ఉంటా...!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

ఈనాటి నవయువతరం

బ్రతుకు విలువ తెలియని నేటితరం
చిన్న కారణానికి
ఊపిరి వదిలేస్తున్న యువతరం
మితిమీరిన ఆశలతో
అడ్డదారులకు ఆహ్వానం
సమస్యను ఎదుర్కోలేని పిరికితనం
ఓటమిని ఓర్వలేని మనస్తత్వం!
తల్లిదండ్రుల మాట వినని తపస్వీలు..
వేగానికే పాఠాలు చెబుతున్న పండితులు..
పనికిమాలిన సహవాసాల సంగమాలు..
విదేశీ కల్చర్ కు "wel-come" చెప్పిన
వివేకులు మత్తు పదార్థాలకు
బానిసలుగా మారిన అమాయకులు..
నేటి నవయువకెరటాలు!
అనుబంధాలకు అడ్డుకట్టలు వేస్తున్నారు
అనురాగాలను ఆదమరుస్తున్నారు
ఆనందాలకు దూరమవుతున్నారు
ఆప్యాయతలను మరిచిపోతున్నారు
అయినా వాళ్లని దూరం పెడుతున్నారు

-నందిని గోపు
6302398650

చిరునవ్వు కు వెల చెల్లించాలి

జీవితం పై నాకు కోపం లేదు
కొన్ని సార్లు ఆశ్చర్యం ఉంటుంది
కొన్ని సార్లు ఆందోళన ఉంటుంది
కొన్ని సార్లు జీవితం సంధించే ప్రశ్నలకు
జవాబులు దొరకలేదు .

బ్రతకడానికి దుఃఖం కూడా
సహించాలని అనుకోలేదు ఎపుడు
చిరునవ్వుకు కూడా వెలచెల్లించాలని
అనుకోలేదు ఎపుడు
నవ్వితే కూడా పెదవులపై
పెను భారం ఉంటుందని అనుకోలేదు ఎపుడు
ఈక్షణం కంటినుండి జారడానికి
కన్నీళ్లు సిద్ధంగా ఉన్నాయి
రేపు ఎవరికి తెలుసు
ఎవరిని చూడడం కోసం
నిరీక్షిస్తాయో కళ్లు
వారి కోసం దాచి ఉంచుకున్నాను
కొన్ని కన్నీళ్లు

జీవితం లో ఓర్వలేని బాధ
బంధాలకు కొత్త అర్థం చెపుతోంది
ఈ బంధాలు మండుటెండలో
మహా వృక్షం లా చల్లని నీడనిచ్చాయి
బందాలతో దేవుడు కట్టడి చేస్తున్నాడు
జీవితం సంధించే
ప్రశ్నలకు జవాబులు దొరకలేదు

-అరుణ దేనియల్
9000606889

అక్షరయాత్ర

అక్షరాలు
పేజీల్లోంచి వెన్నెలను రాలుస్తోంది
వాక్యాలు
పుస్తకాల్లోంచి పక్షులై ఎగిరిపోతున్నాయి
చదివిన హృదయానికి
కొత్త భావాల రక్తాన్ని ఎక్కిస్తోంది

రాత్రి పాడుకున్న పాటకి
చెట్లకు కాసిన పూగుత్తులు
పసికూన బోసినవ్వులు కురిపిస్తున్నాయి
తెల్లవారి రాలిపడిన ఉదయానికి
చీకటి మడుగులోని
ఆకాశం వొళ్ళు విరుచుకొని
చైతన్యస్రవంతి రాగాన్ని ఆలపిస్తోంది
సూర్యుడి అక్షరయాత్ర మొదలవుతుందిప్పుడు

అనుభూతులుగా మారిన క్యాలెండర్ తేదీలు
అమృతాన్ని విడిచి
అశ్రుబిందువులను రాలుస్తున్నాయి
కాలం పెదవులపై వాలి
దీప దాహం తీర్చుతూ
వెలుగుతున్న ఆత్మకళను
అక్షరయాత్రగా ఆవిష్కరిస్తుందిప్పుడు.

జంతువుల కన్నీళ్ళను తూచలేనివాడు
నేల గాయాలను ఎలా పసిగట్టగలడు
నీటి ఆవేదనను ఎలా గుర్తించగలడు
అక్షరమక్షరమై జ్వలిస్తున్న పోరాటాలకు
మేఘాలు దారులు తప్పి అరుస్తున్నాయి
పుస్తకాల పుటల్లోకి
పారిపోయి దాక్కుంటున్నాయి
గాలి పేజీల్లోకి దూరి
తుఫానును సృష్టిస్తోంది

అక్షరం గొంతు విప్పి
శతాబ్దాలుగా భూమిలో
నిదురిస్తున్న చరిత్రను
చెక్కిన శిల్పమాలె బయటపెడుతోంది
శాసనరూపంలో మరో ప్రపంచం
మనలోకి ప్రవహింపజేస్తోంది



- కోడం పవన్‌కుమార్
9848992825

బాల్యం మళ్ళీ వస్తే...

కాలం వెనక్కి వెళ్ళి
బాల్యం మళ్ళీ తిరిగి వస్తే
నాన్న భుజంపై ఎక్కిన గుర్తులు
నాన్నతో ఆడిన దాగుడుమూతలు
నాన్న వీపున ఉప్పు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 449వ రోజు 'ఆదర్శం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఆదర్శం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అ X అ = అ!

అదర్శం ఆచరణ ఒక్కటే ఐతే విలువ!
తీర్థానికితీర్థం
ప్రసాదానికి ప్రసాదం
ఐతే గొడవ!
చెప్పేవి శ్రీరంగనీతులు
చేసేవి చెత్తపనులు
పెదాల చివర పదాలు
ఆచరించకుంటే బతుకు దిగజారు!
ఏకాదశి ఉల్లి వెల్లుల్లి నిషిద్ధం
అని బైట బడాయిలు!
ఇంట్లో మసాలాల ఘుమాయింపులు?!
యథాపిత తథాపుత్ర!
అమ్మని అనుసరించు ఆడపిల్ల!
సత్యహరిశ్చంద్రుని ఆదర్శం
శిబిచక్రవర్తి త్యాగం
చెప్పింది చేశారు!
చేసింది చెప్పారు!
మానసిక స్థైర్యానికి పటేల్ ఆదర్శం!
భార్య మరణవార్త టెలిగ్రాం!
కేసువాదించి చూపె నిగ్రహం!
సోమవారం రాత్రి
ఉపోషం చెప్పె శాస్త్రిజీ!
ప్రధానిగా ఉన్నా బడిబస్సులో
పిల్లల ఆదర్శం ఆచరణ!
ఎన్నికల కల్లబొల్లి కబుర్ల లొల్లి
గద్దెకెక్కినాక తీస్తారు తాట!
అడిగితే వీపు విమానం మోత!
నిగ్గదీసి అడిగితే నోరునొక్కే
కలికాల భారతం?
ఆదర్శంగా ఉండాలి
అందరు భేషని పొగడాలి
అనుకుంటే సరిపోదు!
చెప్పింది చేయాలి!
చేసింది చెప్పాలి!
చేతనైతే గద్దె దింపాలి!
ఉందా కలేజా!
లేదు కాబట్టే
ఛానళ్ల వార్తలు వింటాం!
కాలం వృధాచేస్తాం!
ఏ ఎండకాగొడుగు పట్టే
ఉత్తర కుమారులం!

-ఎ.రాజ్యశ్రీ

ఆదర్శపురుషుడు

మా కుటుంబంలో ఆదర్శపురుషుడు
మా తాతగారు
తండ్రిగా
తాతగా
అన్నగా
భర్తగా
దైవారాధకుడిగా
వక్తగా
సంగీతజ్ఞుడిగా
సాదాసీదామనిషి గా
జీవితాంతం గడపగలిగిన
ఉన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం
అలాంటి మనిషి
మా కుటుంబంలో
న భూతో న భవిష్యత్!
స్థితప్రజ్ఞుడిగా
జీవితచరమాంకం వరకు జీవించారు
వారే...
కొణికి సత్యనారాయణ రావు గారు
ఆయన ఆత్మకు తృప్తిగలగాలని
ఉత్తరాయణంలో
ఉత్తమ గతికై దివికేగిన
తాతయ్య కు అశ్రుధారలతో
వినమ్రనమస్కారాలు!

-కళ్యాణి

ఆదర్శవంతులు

ఏవీ ఆ ఆదర్శ నడవడికలు నేడు
ఏరీ ఆ ఆదర్శ మానవులు నేడీ జగతిలో
ఏరీ ఆ ఆదర్శ మహిళలు నేడీ మహిలో మన మధ్యన
ఆదర్శమనే దర్శనం నేడు నేతిబీరలో నేతి చందంలా!.

పదుగురికి ఆదర్శాన్ని తెలిపిన ఆ శ్రీరామచంద్రుడేడి
సమాజానికి గీతాసారం ప్రభోధించిన శ్రీకృష్ణ పరమాత్ముడేడి
విశ్వతత్వాన్ని ప్రభోధించిన సోక్రటీస్ అరిస్టాటిల్ ఏరి
జగమంతా ప్రేమమయమన్న ఆ క్రీస్తు ప్రభువెక్కడ?

జనావళికై సర్వం త్యజించిన ఆ తథాగతుడు నేడెక్కడ
మానవాళికి జ్ఞానం బోధించిన మహావీరుడు
దేశ స్వతంత్ర్యానికై పోరుసల్పిన నాయకమన్యులు
ఆదర్శ జీవితానికై అడుగులేసిన మహనీయ పురుషులేరి!.

అందరికీ చదువనే ఆదర్శ పూలే సావిత్రీలెక్కడ
సత్యం కోసం సర్వం త్యజించిన హరిశ్చంద్ర నేడున్నారా
మాటకోసం శరీరాన్ని త్యజించే శిబి చక్రవర్తి నేడేరి
వామనమూర్తికి మూడడుగుల నేలన్న బలి చక్రవర్తెక్కడ?.

సత్యం అహింసలను నమ్మిన జాతిపిత ఏడి
సతీసహగమనాన్ని ప్రశ్నించే రాజారామ్మోహనుడేడి
వితంతుపునర్వివాహమన్న కందుకూరి వీరేశలింగం
వర్ణాంతర వివాహమన్న మాలపల్లి ఉండవల్లి!

పుత్తడిబొమ్మ పూర్ణమ్మంటూ గురజాడ జాడలు
భూదానమంటూ వెదిరె రావి పుచ్చలపల్లి
అన్నదానమే భాగ్యమన్న డొక్కాసీతమ్మ తరిగొండ
నల్లజాతీయులకై పోరాడిన మార్టిన్ మండేలాలు!.

సేవారంగంలో మదర్ థెరిసా రెడ్ క్రాస్ లు
యువతకు స్ఫూర్తిని రగిలించిన స్వామి వివేకానందుడు
విశిష్ట ఆచార్యులుగ వాల్మీకి ద్రోణాచార్యులు
విజ్ఞానరంగాన చరక శుశృత ఆర్యభట్ట భాస్కరులు!.

విశ్వవినువీధులందు వీరేగా ఆదర్శం
పిన్నలైనా పెద్దలైనా సమసమాజానికి ఆదర్శం
ఆదర్శానికి అధినాయకులు వీరుగాక మరెవ్వరు
ఈ జననాయకమణ్యులేగా ఎప్పటికీ మనకాదర్శం!

- లక్ష్మారెడ్డి పసుల

అనర్హమైనదేది?

కన్న పేగు
పంచిన ప్రేమ
చవి చూపిన అమ్మ
అతివలకెంతో ఆదర్శం...
బతుకుకెంతో రక్షణనిచ్చి
పెంచి
పోషించి
తీర్చి దిద్దే
నాన్న ప్రేమ ఆదర్శం
విద్యా బుద్ధుల్ని
నడవడిని నేర్చి
సంస్కారపు బీజాన్ని నాటి
మొలకెత్తించే గురువే
మనకు ఆదర్శం
బాధ ఊబిలో నుండి
వెలికితీసి
మనలో ధైర్యమెంతో నింపే
స్నేహమే మనకు ఆదర్శం,
పడినా తిరిగి పుంజుకుని
పరుగులెన్నో తీసే
ఉవ్వెత్తున ఎగిసి పడే కెరటం
మనకెంతో ఆదర్శం
ఎత్తుపల్లాలల్లోనూ
ఒదిగిపోయి ప్రవహిస్తూ
జలజల పారే జలపాతమే
మనకు ఆదర్శం..
చకచకా పరుగులు తీస్తూ
గర్వమనేది లేని
నిరంతరం కష్టపడే
చిట్టిచీమ మనకు ఆదర్శం..
తాను కరిగిపోయినా
అందరికీ నిర్మలమైన వెలుగునిచ్చే
కొవ్వొత్తి మనకు ఆదర్శం..
రాలిపోతానని తెలిసినా
చిరునవ్వులు చిందిస్తూ
సుగంధపరిమళాలు వెదజల్లే
కుసుమం మనకు ఆదర్శం..
ఈలోకంలో
ఆదర్శానికి అనర్హమైనదేది...?
ఆలోచించు అసాధారణరీతిలో
మంచిని స్వీకరించు
చెడునెపుడూ తిరస్కరించు
ఇతరులకెపుడూ మనం
ఆదర్శమై నిలవాలి కలకాలం.

-పురం మంగ

అసత్య జీవి

జీవితాన్ని బంధించి
అసత్యమే తనదై
అధర్మ పాలనతో
పాలకుల రాజ్యాన్ని
నిర్మాణమే జేస్తూ
తనదైన ధర్మాన్ని
ప్రజల మీద నిలిపి
ఆకలి కేకలు వేసినా
అడిగిన వాడులేక
నవ్వుతూ నిలిచాడు
అధర్మమే తనదై.
మనసనే దానికి
విశ్వాసం లేక
ఆనంద జీవితమే
పాలనలో నిర్మాణమే
చేసిన వాడయ్యి.
నిరంతరం అబద్ధమే
మాట్లాడే వాడికి
నీ హృదయమే వినిపించిన
చెరగని శిలాక్షరాలు
మారుతున్న పాలనయై
అక్రమాలకు
అడ్డుకట్ట వేస్తేనే ఆదర్శం.

- వి. సంధ్యా రాణి

నిలబడుతుంది

ఆదర్శాలు మాత్రం వల్లె వేస్తూ
ఆచరణలో భిన్నంగా ప్రవర్తించేవారిని
సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నా
నిజమైన ఆదర్శవాదులు
కొందరైనా ఉంటారన్నది
అందరూ అంగీకరించవలసిన వాస్తవం.
ఆదర్శం కోసం మరణించిన వ్యక్తి జీవితం
వారితోనే అంతంకాదు
వారి ఆదర్శం
లక్షలాది జీవితాలను ఆవహిస్తుంది
వారి అంకితభావం
ఎందరినో ప్రజ్వలింపజేస్తుంది
వారి లక్ష్యం
తక్షణమే నిజం కాకపోవచ్చు
నెలలూ సంవత్సరాలూ పట్టొచ్చు
వారి ఆలోచన పేద ప్రజల కోసమైతే
వారి ఆచరణ మెజార్టీ ప్రజల పక్షమైతే
శతాబ్దం తరువాతైనా
వారి కల నిజమౌతుంది
యుగాంతం వరకైనా
ఫలితం నిలబడుతుంది.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

విశిష్ట కీర్తి

ఎన్నో తరాలకు
వారి కీర్తి ఆదర్శం
గాంధీ నెహ్రూ వంటి దేశ నాయకులు
దేశ పురోగతికి ఆదర్శం
ప్రజలకు అవగాహన కలిగించి
ఉన్నత ఉత్తమ
కార్యక్రమాలకు శ్రీ కారం చుట్టి
దేశ పురోగమనానికి కృషి
ఎన్నో భావితరాల కు
విశిష్ట కీర్తి ప్రతిష్టలు
ప్రముఖులు ఎందరో
విభిన్న రంగాల సాధన శోధనలు
ఎప్పటికీ శాశ్వతం
ఆదర్శం కూడా
అందుకే
స్థిర చిత్తంతో
సాధన చెయ్యాలి.

-నారుమంచి వాణీ ప్రభాకరి

ఆచరణలో పెడితే..

అవతలివారికి ఆమోదం
ఆసక్తితో ఆచరణీయం..
అప్పుడే అది ఆదర్శం
పెదవులతో చెప్పి
చేతల్లో లేకపోతే
ఆదర్శం వ్యర్థం
దాంపత్యంలో
సీతా రాములు
పార్వతీపరమేశ్వరులు
మనకి ఆదర్శం
ఎన్నియుగాలు
గడిచినా వాళ్లే ఆదర్శం.
యువతకి వివేకానంద
పోరాట స్ఫూర్తికి నేతాజీ ఆదర్శం..
వారు చూపిన బాట
సదా ఆచరణీయం..
ప్రకృతి పంథామనకి ఆదర్శం
పడిలేచే కెరటాలు
చెబుతాయెన్నో పాఠాలు
చిట్టి చీమ నేర్పుతుంది శిక్షణ
క్రమశిక్షణ
అంచెలంచెలుగా ఎదుగు
ఆదర్శంగా నిలువు.

- మోటూరిశాంతకుమారి

ఆదర్శమై పరిఢవిల్లె

శా. ఆదర్శమ్మననాచరించు పనియందాసక్తి మార్గమ్మునై
పాదమ్ముల్ పదిమందితో నడవగా స్పందించు బంధమ్ముతో
మోదమ్మైయభివృద్ధినైక్యతను సమ్మోహమ్ము సౌభాగ్యమౌ
నాదమ్మున్ వినిపించు గుండెలయసన్నద్ధమ్ము చేకూర్చెడిన్!!.

కం. సామాజికపరివర్తన
ధీమాతగురీతిపెంచు తెలివిని మేలున్
సామాన్యునికాదర్శము
క్షేమమ్మును గూర్చువారు శ్రీయుత ప్రాజ్ఞుల్!!.

తే.గీ. ఋషులు మునులు మహాత్ముల కృషికి ఫలము
వివిధరంగాలకాదర్శవేత్తలంత
మార్గదర్శులు ధర్మసమ్మానమొంద
శ్రేష్ఠులకు కష్ట నష్టాల జీవనమ్ము!!.

తే.గీ. రంతి,శిబి ధర్మరాజు ప్రేరకులు గాంధి
వంటి ఘనులు కోకొల్లలు ప్రథితులైరి
నేడుయంబేద్కరుడు సావిత్రి జోడు పూలె
భరతభూమికాదర్శమై పరిఢవిల్లె!!.

-మాడుగుల నారాయణ మూర్తి

అభిలషణీయం

ఆదర్శ జీవితం అభిలషణీయం
పిల్లలకు తమకు జన్మనిచ్చిన
తల్లిదండ్రులు ఆదర్శం
విద్యాబుద్ధులు చెప్పిన గురువులు
విద్యార్థులకు ఆదర్శం
పార్టీ అధినేతలు
కార్యకర్తలకు ఆదర్శం
రామాయణంలో శ్రీరాముడు
మహాభారతంలో శ్రీ కృష్ణుడు
భారతీయులకు ఆదర్శం
మహిళల చదువులలో
సావిత్రి బాయి పూలే ఆదర్శం
స్వాతంత్ర్య ఉద్యమంలో
సమరయోధులు ఆదర్శం
ఆపదలలో ఆపన్న హస్తాలనందించే
మహానుభావులు ఆదర్శం
దాంపత్య జీవితంలో
ఆది దంపతులు ఆదర్శం
సీతారాములు ఆదర్శం
రాజ్యాంగ స్ఫూర్తితో
అంబేద్కర్ ఆదర్శం
సత్యంలో హరిచంద్రుడు
దానంలో శిబి చక్రవర్తి
త్యాగంలో భగత్ సింగ్
అల్లూరిసీతారామారాజు
కొమురం భీం చాకలి ఐలమ్మ
ఝాన్సీ లక్ష్మీబాయి
బందగి దొడ్డికొమురయ్య
భాగ్యరెడ్డివర్మ
స్వామివివేకానంద
మహాత్మగాంధీ లాంటి
త్యాగధనులు మహానీయులు
నేటి తరానికి ఆదర్శం
ఆదర్శం మానవమనుగడకు
సామాజిక ప్రగతికి
ఉపయుక్తంగా ఉండాలి
ప్రజల కోసం ప్రాణాలిచ్చే వారు
సమాజానికి ఆదర్శం కావాలి
అవినీతి బంధుప్రీతి
దోపిడి దౌర్జన్యాలు లేని
సమాజ నిర్మాణం కావాలి
ఆదర్శవంతమైన సమాజం
నిర్మాణం కోసం నాయకులు
యువత కృషి చేయాలి
ప్రజలందరూ హాయిగా
సమాజంలో బతకాలి

-గుండం మోహన్ రె

ఘంటసాల- అమృతశాల

"నేను పుట్టాను ఈ లోకం మెచించంది" అంటూ 1922 డిసెంబర్ 4న శ్రీ సూర్యనారాయణ, రత్తమ్మ దంపతులకు గుడివాడ దగ్గరలోని చౌటుపల్లి గ్రామంలో శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గారు జన్మించారు. బాల్యంలోనే తండ్రిగారితో కచేరీలకు వెళ్ళేవారు. 11వ ఏట తండ్రిగారి మరణంతో బిక్షాటన చేస్తూ, అష్టకష్టాలనుభవించి గురువులకు సేవలు చేస్తూ "విజయ నగరంలోని సంగీత కళాశాలలో 1942లో ఘంటసాలగారు సంగీతంలో డిగ్రీ పట్టా పొందారు.

1943లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలుశిక్ష అనుభవించారు. ఎన్నో దేశభక్తి గీతాలను ఆలపిస్తూ ప్రజల్లో చైతన్యం నింపేవారు 1944 మార్చి 3వ తేదీన మేనత్త కూతురు సావిత్రిగారితో వీరి వివాహం జరిగినది. పెళ్ళి వేడుకల్లో తానే స్వయంగా గాన కచేరి నిర్వహించి బంధుమిత్రులకు వీనులవిందును గావించారు. పి. సీతారామశాస్త్రి గురువు దగ్గర సంగీతంలోని ఎన్నో మెలకువలను అభ్యసించారు ఘంటసాలగారు.

అక్కినేనిగారి 'సీతారామజననం" చిత్రంలో కొరస్‌గా పాడిన ఘంటసాల మాస్టారు స్వర్గసీమ, లైలమజ్ను, మనదేశం మరియు కీలుగుర్రం తెలుగు చిత్రాల్లో పాటలు పాడి ఎంతో పొంగి పోయారు. షావుకారు, పాతాళభైరవి, మల్లీశ్వరిలాంటి సంగీత ప్రధానమైన చిత్రాల్లో గానం చేసి విజయడంకా మ్రోగించారు. మాయా బజారు, గుండమ్మ కథ, లవకుశ, రహస్యం మరియు గుడి గంటలు తెలుగు చిత్రాలకు స్వీయ సంగీత సమకూర్చి ఎన్నో మధురమైన గీతాలకు జీవంపోసి కళా మతల్లి ముద్దుబిడ్డగా తనకంటు ఒక స్థానాన్ని సంపాదించారు.

భక్తి, పౌరాణిక, జానపద, చారిత్రాత్మక మరియు సాంఘిక చిత్రాల్లో సప్తస్వరాలతో చిత్రాల్లోని నవరసాల పాత్రలకు తన గాత్రంతో "సంగీత ప్రియులను ఆనంద డోలికల్లో పరవశింపచేశారు ఘంటసాల గారు అనటంలో ఏమాత్రం సందేహం లేదు. ప్రతి కచేరీల్లో నాటి నుండి నేటి వరకు "భలే మంచి రోజు" పాటతో కార్యక్రమానన్ని ప్రారంభిస్తున్నారు. "తెలుగు వీర లేవరా దీక్షబూని సాగరా" భారతమాతకు జేజేలు" "గాంధిపుట్టిన దేశమా ఇది" "పాడవోయి భాగతీయుడా" "నా జన్మభూమి ఎంతో అందమైన ప్రదేశం" లాంటి దేశభక్తి గీతాలతో స్వాతంత్రదినం రోజు ప్రతి టివి చానల్లో వారు ప్రసారం చేస్తూ ఉంటారు. ప్రతి నిత్యం పూజసమయాల్లో "ఘణా ఘణ సుందరా" "హే కృష్ణా ముకందా మురారి" "తిరుమల మందిర సుందరా" లాంటి భక్తి గీతాలతో ప్రతి ఒక్కరు భక్తి పారవశ్యంతో ఘంటసాలగారి గీతాలను మననం చేసుకుంటూ తరిస్తూ వుంటారు అనటంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు..!

"శివ శంకరీ శివానంద లహరి" "మాణిక్య వీణ మాపలం" లాంటి గంభీరమైన గీతాలు పాడి తనకు తానే సాటి అనిపించారు మాస్టారు. "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని" "మబ్బులో ఏముంది.. నా మనసులో ఏముంది" "ఊహలు గుసగుసలాడే" లాంటి మెలోడి గీతాలను ఘంటసాలగారు జనరంజ కంగా ఆలపించారు. "బొమ్మను చేసి ప్రాణం పోసి" "కనుపాప కరువైన కనులెందుకు" "జన్మ మెత్తితిరా అనుభవించితిరా" "కళకానిది విలువైనది" లాంటి విషాద గీతాలతో అభిమానుల కంట తడితో ఏడిపి స్తారు ఘంటసాలగారు. "సుందరి ఓసుందరీ నీ వంటి దివ్యస్వరూపం" "కాశికి పోయాను రామాహరి"లాంటి హాస్యం గీతాలతో మనల్ని నవ్విస్తారు. 'మనసైన ఓ చిన్నదాన" "చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నది" "కడవెత్తు కొచ్చింది కన్నెపిల్ల" లాంటి యుగళగీతాలతో యువతరాన్ని ఆకట్టుకున్నారు.

"ఎవరో వస్తారని ఏదో చేస్తారని" భలే భలే అందాలు సృష్టించావు" లాంటి ప్రబోద గీతాలతో చక్కటి సందేశాలను సమాజానికి అందించారు. "జగమే మాయ బ్రతుకే మాయ" "మనసు గతి ఇంతే" లాంటి పాటల్లోని "వేదాలలోని సారాన్ని" మనకు మత్తుగా అత్తుకునేలా ఘంటసాలగారు ఆలపించారు. "భాగ్యనగర గాథను" (బుర్రకథ) "సీతారామ కళ్యాణం(హరికథ) వరూదిని ప్రవరాఖ్యుల ప్రేమ ఘటాన్ని అత్యంత అద్భుతంగా గానం చేసి ముందుతరాలకు అందించారు. ఎన్టీఆర్, ఏయన్నార్, నాగయ్య, యస్వీఆర్, గుమ్మడి, కృష్ణ, శోభన్‌బాబు, హరనాథ్, కాంతారావు, చంద్రమోహన్ లాంటి హీరోలకే కాకుండా రేలంగి, చలం, పద్మనాభం, రాజబాబు లాంటి హాస్యనటు లకు సైతం తన గాత్రంతో మధురమైన సినీ గీతాలను ఆలపించారు ఘంటసాల గారు.

తిరుమలేషుని సన్నిదిలో భక్తి గీతాలు గాని చేసి సంగీత విద్యాంసుడిగా కీర్తిగాంచారు ఘంటసాలగారు. 1970లో "పద్మశ్రీ బిరుదుతో పాటు ఎన్నో పురస్కారాలు వారు అందుకున్నారు. 1971లో ఐరోపా, అమెరికా లాంటి దేశాల్లో కచేరిలు చేసి ప్రపంచ ఖ్యాతినార్జించారు. "కుంతీ విలాపం, పుష్ప విలాపం" మ రియు ఎన్నో ప్రైవేట్ గీతాలతో ఆల్బమ్ చేశారు. మూడు దశాబ్దాలుగా సుమారు 10వేల గీతాలను గానం చేసిన కారణజన్మునుడు ఘంటసాల గారు అనటంలో అతిశయోక్తి లేదు. పాటలతో పాటు ఎన్నో పద్యాలను ఆలపించి తనకు తానే సాటి అనిపించారు ఘంటసాలగారు.

మధుమేహ వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూనే "భగవద్గీత"లోని 107 శ్లోకాలను తాత్పర్యంతో గానం చేసి పామరులకు సైతం అర్థమయ్యేలా పాడి, తెలుగు జాతి ఋణం తీర్చుకొని, కళామతల్లి, ముద్దుబిడ్డగా తెలుగు భాష ఉన్నంత వరకు తన పాట ఉన్నదని నమ్మిన మహామేదావి ఘంటసాలగారు. టాటాగుడ్ బై ఇంక సెలవు అంటూ 1974 ఫిబ్రవరి 11నాడు ఘంటసాలగారు ఈ లోకాన్ని విడిచి అనంత లోకాలకు వెళ్ళిన గాన గంధర్వుడు.

(ఫిబ్రవరి 11 ఘంటసాలగారి వర్ధతి సందర్భంగా...)

- నేతాజీ
సెల్: 9859646489

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాధ్సా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ వలిపే**
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

మనసైన తోడు!

ఎక్కడినుండో...
గాలిలో తేలుతూ సాగిన
బీజపు గమ్యమెరుగని పయనం...
వానజల్లు చెలిమి వలన
ధరణీతలముపై నిలదొక్కుకునే
ఓ లేతాకుపచ్చని ప్రాణమై...
పెరిగే అనాథ లతకు
దక్కే ఆలంబన కంటక పొదలదో
నిలువెత్తు పచ్చదనానిదో...
దాని లక్ష్యం మాత్రం
అల్లుకుపోతూ ఎదగడమొక్కటే...!
మంచి మనసుల
చేయూతతో ఎదిగే మనిషి
పరోపకార వృక్షంగా పరిఢవిల్లితే...
విష సంస్కృతి నిలయంలో
సాగించిన జీవితం
హృదయ స్పందనలు లేని
కఠిన పాషాణ సమం!
ఏనాడో నిస్వార్థ చిత్తంతో నాటిన బీజం
అంతెత్తు వృక్షమై నీడనొసగు...
ఎప్పుడో అప్పుడు
మనకు కుదిరినప్పుడు
అందించిన ఆలంబన
కొందరి మనసుల్లోనైనా
ఉపకార స్ఫూర్తి నింపవచ్చు...
ఒకసారి ఆదుకున్న హస్తమే
ఆపదలో చిక్కుకుని గిలగిలలాడితే...
ఓనాడు మనం నేర్పిన పాఠమే
మనలను గట్టెక్కించవచ్చు...!
అనేక దశలుగా సాగే
జీవిత యానానికి
వెలుగు నీడలను
సమంగా స్వీకరించే శక్తి చేకూరాలంటే...
ఆది నుండి తుది వరకు
ఓ మంచి మనసైన తోడు అవసరం!

-వెగ్గలం ఉషశ్రీ

బతుకంటే అన్నీ

బతుకు పొడుగునా
మొఖం నవ్వుతనే వుంటదా.
పుల్లిరిసిన మాటలకు
మనసు కలుక్కుమని
కండ్లెంబడి చినుకు రాలదా.
బతుకు పొడుగునా
మొఖం ఏడుస్తనె వుంటదా.
చెమటచినుకులె
గెలుపు రాదార్లనేసి
సంబురాల పండగనియ్యదా.
బతుకు పొడుగునా
మొఖం నందివర్ధనమే ఐతదా.
కాగలించుకున్న బంధాలు
కాలం కాటేసినపుడు
ఎంతకీ ఒడవని కన్నీండ్లనియ్యదా.
బతుకు పొడుగునా
మొఖం నీటి చెలమే ఐతదా.
నాయిన పుట్టిండని
అమ్మ పుట్టిందని
పానంల పానమయ్యే
చిట్టి బంధాల మురిపెమవ్వమా
బతుకు పొడుగునా మొఖం
పున్నమి వెన్నెలే ఐతదా
కష్టాల కొలిమిల కాలి కాలి
పదునుదేరిన మనిషై నిలిసి
వెలుగునీడలు ఒకటనుకోమా
బతుకు పొడుగునా
ఒకటే వుండది
నవ్వుంటది..
ఏడుపుంటది
మనసు కెలికే దుఃఖముంటది
దుఃఖం పంచుకునే ప్రేముంటది
ఎన్ని జూస్తె బతుకైతది
బతుకు అన్నిటినీ తడుముతది
వెలుగునీ....నీడనీ..

-వేదన

మీకోసం

నేటినిజం లో..
'స్వీయ పరిచయవేదిక' త్వరలో...

వారం, వారం వర్ధమానులు, ప్రవర్ధమానులు తమ రచనల్ని అందించడానికి అనువైన పత్రికగా భాసిల్లుతున్న 'నేటినిజం" మరో కొత్త శీర్షికకు త్వరలో శ్రీకారం చుట్టబోతోంది. అనేక మంది కవులు, కవయిత్రులు తమ సాహితీ ప్రస్థానాన్ని 'నేటినిజం' స్వాగత తోరణం ద్వారానే ప్రారంభించిన వారున్నారు. ప్రసిద్ధులుగా తమ రచనల ద్వారా పాఠకుల హృదయాల్లో చోటు చేసుకున్న వారం సైతం చాలా మంది క్రమం తప్పకుండా పత్రికను ఆదరించి, ఆశీర్వదిస్తున్నారు.

కొత్తగా కలంపట్టే వారికి ప్రేరణనందించే విధంగా ప్రసిద్ధ కవులు, రచయితలు తమ రచనల ద్వారా 'నేటినిజం'లో ప్రేరణనందించడాన్ని చూస్తున్నాం. సాహిత్య సృజన చేస్తున్న కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులను పరిచయం చేసేందుకు లోగడ 'నేటినిజం' ద్వారా విశేష కృషి జరిగిన విషయం మీకు తెలిసిందే.. ఇదే క్రమంలో కలం పట్టి సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న సృజనకారులు తమకు తామే స్వీయ పరిచయం చేసుకునేందుకు.. 'నేటినిజం' ముందుకు రాబోతున్నది. 'స్వీయ పరిచయ వేదిక' అన్న శీర్షికతో ప్రతివారం సాహితీ కెరటాల ద్వారా అందించాలని సంకల్పిస్తున్నాం..

ఈ సందర్భంగా దిగువ సూచనలు గమనించి
తమ పరిచయాన్ని తామే పంపించగలరని కోరుతున్నాం..

సూచనలు:

1) ఇదివరకే తమ రచనల ద్వారా సాహితీ లోకానికి కవులుగా, రచయితలుగా, పరిచయమున్నప్పటికీ.. మీ, మీ మాటల్లోనే మీ గురించి రాసిన పరిచయ వాక్యాలను ఇంకా సమగ్రంగా సాహితీ బంధువులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రారంభించబడుతున్న శీర్షిక ఇది. కనుక వాస్తవ విషయాలనే ప్రస్తావిస్తారన్న విశ్వాసముంది. వాస్తవాలనే పంపాలన్న సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

2) పేరు, వృత్తి, చిరునామా.. ఇత్యాది విషయాలను మొదట పేరాలో మీకు మీరే పరిచయం చేసుకోవాలి.

3) రచనా వ్యాసంగంలోకి కవిగా, రచయితగా ప్రవేశించిన సం॥... తమ తొలి రచన.. ఇత్యాది వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

4) సాహితీ లోకంలో సృజనకారులుగా అడుగులు వేయడానికి మీకు ప్రేరణనిచ్చింది ఎవరు? వారికి సంబంధించి మీకు ఏ రచన ప్రభావితం చేసింది? వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

5) ఇప్పటి వరకు రాసిన కవితలసంఖ్య, వ్యాసాల సంఖ్య, కథలు.. ఇతరత్రా ప్రక్రియల్లో మీరు ప్రదర్శిస్తున్న ప్రతిభకు సంబంధించిన వివరాలు-సంక్షిప్తంగా..

6) మీరు వెలువరించిన గ్రంథాలు.. ప్రక్రియలు.. ఏయే సంవత్సరాల్లో.. తదితర వివరాలు.. పుస్తకాల పేర్ల జాబితాను పొందుపరచాలి.

7) మీరు పొందిన సాహిత్య పురస్కారాలు.. లిస్ట్ పొందు పరువచ్చు. పొందుపరిచే క్రమంలో.. ముఖ్యమైన వాటినే ప్రస్తావించాలి.

8) మీరు పొందిన బిరుదులు-వివరాలు-అందించిన సంస్థలు-వాటి వివరాలు

9) మీరు రచించిన కవితల్లో/ కథల్లో/ రచనల్లో మీకు బాగా నచ్చింది ఏమిటి? వివరాలు సంక్షిప్తంగా పొందుపరచవచ్చు.

10) మీరు పాల్గొన్న సభల్లో మీకు బాగా నచ్చిన సభ.. వివరాలు అందించండి.

11) ప్రసిద్ధ కవులు-రచయితలతో సభను పంచుకున్న సభలనూ వివరించవచ్చు.

12) మీ ద్వారా సాహితీకారులకు పురస్కారాలు అందిస్తే వివరాలు తెల్పండి.

13) మీరు ఏదైనా పత్రికకు కాలమిస్టుగా వ్యవహరిస్తే.. వివరాలు రాయాలి.

14) మీరు వెలువరించిన గ్రంథాలకు సంబంధించిన గ్రంథాల టైటిల్ పేజీలను మీకు ఇష్టమైన వాటిని **ఐదు**కు మించకుండా పంపాలి.

15) మీ సాహిత్య ప్రస్థానంలో మీరు పాల్గొన్న సభలకు సంబందించిన ఫోటోలు ఉంటాయి. వాటిలో కూడా అతి ముఖ్యమైన వాటిని ఎంపిక చేసుకుని **ఐదింటి**ని మాత్రమే పంపాలి.

16) మీ రచనలపై ఏ విశ్వ విద్యాలయంలోనైనా పాఠ్యాంశాలుగా నిర్ణయింపబడితే వాటి వివరాలు ఇవ్వండి.

17) మీ రచనలపై ఏ విశ్వవిద్యాలయంలోనైనా పరిశోధనలు జరుగుతున్నట్లయితే వివరాలు.. అందించండి..

18) సాహిత్య సంస్థల నిర్వహణలో మీకున్న భాగస్వామ్యం వివరాలు-

19) ఇప్పుడొస్తున్న కవిత్వం/ కథలు/ ఇతర సాహిత్యంపై మీ అభిప్రాయం.

20) మంచి కవిత్వానికి/ కథకు/ రచనకు ఉండాల్సిన లక్షణాలు.. ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?

21) ఇప్పుడొస్తున్న అంతర్జాల కవిత్వ సమూహాలు.. కవిత్వ సృజన జరుగుతున్న తీరు తెన్నులపై మీ అభిప్రాయం.

22) ఆధునిక సమాజంలో ఏ విధమగు సాహిత్యం/ కవిత్వం/ కథలు రావాలని కోరుకుంటున్నారు?

23) మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో పంపాలి.

24) కనీసం ఒక పుస్తకం ప్రచురణ అయిన వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

పై అంశాల్లో మీకు సంబంధించిన వివరాలు ఉంటేనే మీ పరిచయ వ్యాసంలో పొందుపరచ